

సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం 15 నెలల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసి హామీలు నిలబెట్టింది. జగన్ వదిలిన రూ.10 లక్షల కోట్ల అప్పులను తీరుస్తూ ముందుకు సాగుతున్న వైసీపీ నేతలు మాత్రం దుష్ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ


సోమవారం 08.09.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 143 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# సవాళ్లున్నా... సంక్షేమం



- సూపర్ సిక్స్ హిట్ పై అనంతపురంలో కూటమి పార్టీల సభ
- సూపర్ సిక్స్ పథకాల సూపర్ హిట్... మేనిఫెస్టో హామీల అమల్లో బెస్ట్
- సుపరిపాలనతో బ్రాండ్ ఇమేజ్-పెట్టుబడులకు భరోసా
- అన్ని వర్గాలకు బాసటగా కూటమి పాలన
- 10వ తేదీ సాయంత్రం అనంతలో సూపర్ సిక్స్-సూపర్ హిట్ బహిరంగ సభ



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** సూపర్ సిక్స్ విజయంపై రాష్ట్రంలో కూటమి పార్టీలు భారీ బహిరంగ సభను నిర్వహించనున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చాక కూటమి తొలిసారి ఉమ్మడి సభ నిర్వహిస్తోంది. డబుల్ ఇంజన్ సర్కార్ 15 నెలల పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లేలా అనంతపురంలోని ఇంద్రప్రస్థనగర్ లో ఈ సభను నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎన్డీఏ కూటమి తొలి ఉమ్మడి సభకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ అగ్ర నేతలు పీవీఎన్ మాధవ్, మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు హాజరు కానున్నారు. ఈ నెల 10వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ భారీ బహిరంగ సభకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి లక్షల మంది ప్రజలు హాజరయ్యేలా భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ పార్టీలు నిర్వహించే తొలి సభ కావటంతో దీన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఏడాది కాలంలోనే అత్యంత కీలకమైన నిర్ణయాలతో పాటు ఎన్నికల్లో హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను పూర్తి చేసి ప్రజలకు సంక్షేమం అందించటంపై ఈ సభలో ప్రధానంగా ప్రస్తావించనున్నారు. మొత్తంగా 15 నెలల పాలనా విజయాలను ఆవిష్కరించేలా సభను నిర్వహించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. పార్టీల వారీగా టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు వేర్వేరుగా సమావేశాలు ఏర్పాటు చేసుకున్నాయి. 2024 ఎన్నికల ముందు కూటమిగా ఏర్పడిన మూడు పార్టీలు ప్రజల ముందుకు కలిసి వెళ్లాయి. 94 శాతం స్ట్రైక్ రేట్ తో సాధారణ ఎన్నికల్లో కలిసి విజయం సాధించాయి. 164 సీట్లతో కనీవినీ ఎరగని విజయాన్ని దక్కించుకున్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పాలనా పగ్గాలు చేపట్టిన అనంతరం సంయుక్త నిర్ణయాలతోనే ప్రజా పాలన సాగిస్తున్నాయి. ఉమ్మడిగా అమలు చేసిన సూపర్ సిక్స్ పథకాలతో లక్ష కోట్ల రూపాయలకు పైగా సంక్షేమం-అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరింది. అలాగే ప్రభుత్వంగా ఇప్పటి వరకూ అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ఈ బహిరంగ సభ ద్వారా ప్రజలకు చెప్పాలని కూటమి అగ్రనాయకత్వం భావిస్తోంది.

**సవాళ్లున్నా సంక్షేమం అభివృద్ధి వైపే అడుగులు :** గత పాలకులు చేసిన విధ్వంసంతో ఆంధ్రప్రదేశ్ అప్పుల కుప్పగా మారింది. వ్యవస్థలు ధ్వంసం అయ్యాయి. అవినీతి అక్రమాలతో రాబడి కుంటుపడింది. పరిశ్రమలూ పొరుగు రాష్ట్రాలకు పారిపోయాయి. ఏపీ రోడ్ల గురించి పొరుగు రాష్ట్రాల్లోనూ మిగతా 2లో...

## ఆలపాటి వ్యూహం..

### ఏకగ్రీవం దిశగా తెనాలి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికలు



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్):** తెనాలి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పాలక మండలి ఎన్నికలు పోటీ రసవత్తరంగా కాకుండా సయోధ్యతో ముగియనున్నాయి. ఆదివారం నాటికి నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. కూటమి తరఫున ఒక్క ప్యానల్ మాత్రమే బరిలోకి రావడంతో ఏకగ్రీవం దిశగా ఎన్నికల వాతావరణం మారింది.

**ఎమ్మెల్సీ ఆలపాటి వ్యూహం ఫలితం :** ప్రారంభం నుంచే కూటమి నేతల మధ్య చర్చలు సాగినట్లు తెలిసింది. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చురుకైన పాత్ర పోషించడంతో, టిడిపి, జనసేన, బిజెపి మధ్య పొత్తు బలపడింది. ఈ కూటమి ప్యానల్‌లో టిడిపి నుంచి ఏడుగురు, జనసేన నుంచి నలుగురు, బిజెపి నుంచి ఒకరు నామినేషన్లు దాఖలు చేశారు.

**హరిప్రసాద్ చైర్మన్ అభ్యర్థి :** చైర్మన్ పదవికి అధిష్ఠానం నుంచి గ్రీన్ సిగ్నల్ పొందిన మంగమూరి హరిప్రసాద్, మారీస్‌పేటలోని తన నివాసం నుంచి భారీ ర్యాలీగా వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. జనసేన అభ్యర్థులు కూడా పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా వచ్చి తమ పత్రాలు సమర్పించారు.

**ఏకగ్రీవానికి వేదిక :** మరో ప్యానల్ నుంచి ఎవరూ బరిలోకి రాకపోవడంతో పాలకమండలి ఏకగ్రీవం మిగతా 2లో...

## మాతా, శిశు వైద్యసేవలకు ఊతం

### అందుబాటులోకి రానున్న 1,000 పడకలు

### గుంటూరు జిజిహెచ్ లో 500, కాకినాడ జిజిహెచ్ లో 500

### రూ.128 కోట్ల వ్యయంతో రెండు నూతన ఎంసిహెచ్ బ్లాకులు

### రు.51 కోట్లతో వైద్య పరికరాల కొనుగోలుకు మంత్రి సత్యకుమార్ ఆమోదం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వాస్పత్రుల్లో మాతా, శిశు వైద్య సేవలను విస్తరింపజేసి గర్భిణులు, నవజాత శిశువుల మరణాలను తగ్గించే కూటమి ప్రభుత్వ ప్రయత్నాల్లో ఒక పెద్ద అడుగు ముందుకు పడనుంది. గుంటూరు, కాకినాడ సర్వజన ఆస్పత్రు(జిజిహెచ్ )ల్లో రెండు నూతన ఎంసిహెచ్ (మదర్ అండ్ ఛైల్డ్ కేర్) బ్లాకుల ద్వారా సేవలను పెంచడానికి ప్రభుత్వం సిద్ధమైంది.

త్వరలో అందుబాటులోకి రానున్న ఈ రెండు బ్లాకుల్లో వైద్యసేవలందించడానికి అవసరమయ్యే వైద్య పరికరాలను, ఇతర అవసరమైన వస్తువులను రూ. 51.33 కోట్లతో కొనుగోలు చేయడానికి వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపారు.

**రెండు నూతన ఎంసిహెచ్ బ్లాకులు:** గుంటూరు జిజిహెచ్ లో పూర్వ విద్యార్థుల ఆర్థిక సహకారంతో రూ. 86 కోట్లతో నిర్మించబడుతున్న నూతన ఎంసిహెచ్ బ్లాకు త్వరలో పూర్తి కానున్నది. దీనిలో 500 పడకల ద్వారా మాతా, శిశు వైద్యసేవలల్ని విస్తృతం చేయనున్నారు. ఇదే రీతిన, కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సహకారంతో రూ. 46 కోట్లతో నిర్మాణంలో వున్న మరో ఎంసిహెచ్ బ్లాకు కూడా త్వరలో పూర్తి కానున్నది. దీనిలో కూడా మరో 500 పడకలతో సేవలందించేదుకు వీలుంది



**రూ.51 కోట్లతో వైద్య పరికరాలు :** ఈ రెండు ఎంసిహెచ్ బ్లాకు ల ద్వారా సేవలందించేందుకు అవసరమైన వైద్య పరికరాలు, అనుబంధ సామగ్రిని రూ. 51.33 కోట్లతో కొనుగోలు చేయడానికి మంత్రి సత్యకుమార్ యాదవ్ అనుమతించారు. మిగతా 2లో...

## శ్రీ ఆదిచుంచనగిరి క్షేత్రాన్ని సందర్శించిన మంత్రి లోకేష్

**కర్ణాటక:** కర్ణాటక రాష్ట్రం మాండ్య జిల్లా నాగమంగల తాలూకాలోని ప్రముఖ సామాజిక- ఆధ్యాత్మిక కేంద్రం శ్రీ ఆదిచుంచనగిరి మహాసంస్థాన మఠాన్ని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సందర్శించారు. 18 వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఈ మఠం జ్ఞానానికి, భక్తికి, సేవకు చిహ్నం. ఈ సందర్భంగా క్షేత్రంలోని శ్రీ కాలభైరవేశ్వర స్వామివారిని దర్శించుకుని మంత్రి నారా లోకేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ ఆదిచుంచనగిరి మహాసంస్థాన మఠం చేపడుతున్న వివిధ సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వాహకులను మిగతా 2లో...



## జగన్ పాలనలో ఏపీకి తీరని నష్టం..

**పశ్చిమగోదావరి(జర్నలిస్ట్ ఫైల్):** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ ఏపీ ఆర్థిక పరిస్థితిని చిన్నాభిన్నం చేసి, అప్పుల పాల్జేశాడని ధ్వజమెత్తారు. ఆదివారం పాలకొల్లు నియోజకవర్గంలో 53 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు మంత్రి నిమ్మల రామానాయుడు.

ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మీడియాతో మాట్లాడారు. జగన్ ఐదేళ్ల పాలనలో ముఖ్యమంత్రి సహాయ నిధిని రద్దు చేయగా, చంద్రబాబు మానవత్వంతో పునరుద్ధరించారని ఉద్ఘాటించారు. మిగతా 2లో...



## మెడికల్ కాలేజీలపై వైసీపీ దుష్ప్రచారం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేస్తున్నారని వైసీపీ ప్రచారం చేయడం పూర్తిగా తప్పుడు ఆరోపణలేనని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసిన ఆయన, పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణంపై వైసీపీ చేస్తున్న విమర్శలను ఖండించారు. మిగతా 3లో...

## నిర్మాణాలు పూర్తి చేయండి..



**తుళ్లూరు (జర్నలిస్ట్ ఫైల్):** రాజధాని నిర్మాణ పనులను మూడేళ్లలో పూర్తి చేయాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనులను వేగవంతం చేయాలని నిర్మాణ సంస్థల ప్రతినిధులను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ కోరారు. తుళ్లూరు మండలం నేలపాడులో నిర్మాణంలో ఉన్న గెజిటెడ్ అధికారుల టైప్ -1, టైప్-2 ఇళ్లను ఆదివారం ఆయన పరిశీలించారు. పనుల పురోగతిపై సిఆర్‌డిఏ ఇంజనీర్లు, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులతో సమావేశమయ్యారు. కొంతమంది నిర్మాణ సంస్థల ప్రతినిధులతో ఫోన్‌లో మాట్లాడారు. కొన్ని భవనాల స్లాబ్, ఇతర పనులను ఎప్పుడు ప్రారంభిస్తారో చెబితే కొబ్బరికాయ కొడతానంటూ కొంత అసహనం వ్యక్తం చేశారు. ఏయే నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ.... అమరావతిలో గెజిటెడ్, గ్రూప్ - డి అధికారుల కోసం మొత్తం 14 టవర్స్‌లో 1440 ఇళ్లు నిర్మిస్తున్నామని, టైప్-1లో 384, టైప్-2 లో 336 ఇళ్లు, మిగతా 2లో...

## హలో... అమ్మా బాగున్నారా..?



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** హలో... అమ్మా... నాన్నా... బాగున్నారా..? నేను మీ చిన్నాను... అంటూ బీసీ బిడ్డలు తమ తల్లిదండ్రులకు ఫోన్లో రోజూ పలుకరించే అవకాశం... కళ్లెదుటే ఉండాల్సిన బిడ్డ ఎక్కడో దూరంగా గురుకులంలో ఉంటూ తింటున్నాడో.. లేదో..? బెంగతో మదనపడే తల్లిదండ్రులకు రోజూ తమ బిడ్డ పలుకరింపు వినే సదావకాశం కూటమి ప్రభుత్వం కల్పించింది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సౌకర్యార్థం మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల్లో పే ఫోన్ పేరుతో టెలీఫోన్ బాక్స్ లు ఏర్పాటు చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 110 గురుకుల పాఠశాలల్లో పే ఫోన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో గురుకుల పాఠశాలలో మిగతా 2లో...

## గాల్లో తేలినట్లుంటుంది..



**విశాఖ(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో పర్యాటక ప్రాజెక్టులను పెద్దఎత్తున ఆకర్షించడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా టూరిజం రంగానికి పెద్దపీట వేస్తోంది. పర్యాటక వనరులైన సముద్ర తీరాలు, అటవీప్రాంతం, కాలువలు, నదీతీరాలు, కొండ ప్రాంతాలు, ప్రసిద్ధిగాంచిన ఆలయాలు, పురాతనమైన కట్టడాలు, సహజ సిద్ధంగా ఏర్పడిన ప్రకృతి వింతలున్న ప్రాంతాలు ఇలా వేర్వేరు చోట్ల విభిన్నమైన వాటికి మరింత గుర్తింపు తెచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తోంది.

**గాల్లో తేలియాడే అనుభూతి :** ఈ క్రమంలో విశాఖ పర్యాటకంలో కైలాసగిరి కీలకపాత్ర పోషిస్తోంది. ఇక్కడికి నిత్యం వేలాది మంది సందర్శకులు వస్తుంటారు. వారిని అలరించడానికి గతంలో టీడీపీ పాలనలో రోప్‌వే అందుబాటులోకి తెచ్చారు. ఆ తర్వాత వచ్చిన వైఎస్సార్సీపీ సర్కార్ ఐదు సంవత్సరాలు కైలాసగిరిని పట్టించుకోలేదు. కొత్తగా ఒక్క ప్రాజెక్టు కూడా ఏర్పాటు కాలేదు.

## వైసీపీని ప్రజలు నమ్మరు



**కర్నూలు :** ఉల్లి రైతులను అడ్డం పెట్టుకొని వైసీపీ నేతలు డ్రామాలు ఆడుతున్నారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. ఉల్లి ధరల విషయంలో వైసీపీ వైఖరిని ఆయన తీవ్రంగా ఖండించారు. తమ ప్రభుత్వం టన్ను ఉల్లిని రూ. 1200 కొనుగోలు చేస్తోందని, ఇదివరకే సీఎం చంద్రబాబు నాయుడు ఈ విషయాన్ని ప్రకటించారని గుర్తు చేశారు. అయినప్పటికీ వైసీపీ నేతలు ఈ విషయంలో రాజకీయం చేస్తున్నారని అన్నారు. క్షేత్ర స్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఉంటే రైతులకు నష్టం లేకుండా చూసుకునేందుకు ప్రభుత్వం అన్నివిధాలా చర్యలు తీసుకుంటోందని మంత్రి వివరించారు. గడిచిన ఎన్నికల్లో ప్రజలు ఛీ కొట్టినా వైసీపీ నాయకులకు ఇంకా బుద్ధిరాలేదన్నారు. ఒకవైపు సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తూ, మరోవైపు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబునాయుడు అహర్నిశలు కష్టపడుతున్నారని, ఇది చూసి మిగతా 2లో...

## సంపాదకీయం

### 'షుగర్ బోర్డులు' సరిపోవు సంపూర్ణ ఆహార విప్లవం అవసరం

ఆగస్టు 21న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాశాఖ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్నిటిలో 'షుగర్ బోర్డులు' ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. మే 14న సి.బి.ఎస్.ఇ బోర్డు జారీ చేసిన సర్క్యులర్‌ను అనుసరించేందుకే ఈ చర్య. పిల్లలలో ఊబకాయం, మధుమేహం వంటి జీవనశైలి వ్యాధులు ఆందోళనకరంగా పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం ఒక స్వాగతార్హమైన అడుగు.

పంచదార అధిక సేవనం వల్ల కలిగే దుష్పరిణామాలను ఇప్పుడు వైద్య పరిశోధనలు బహిర్గతం చేస్తున్నాయి. ఒక రోజు పిల్లలు తీసుకోవలసిన కేలరీల్లో చక్కెర నుండి వచ్చే వాటి శాతం 5 దాటకూడదని నిపుణులు చెబుతుంటే, మన దేశంలో అది 13-15 శాతం వరకు చేరింది. ఇది భవిష్యత్తు భారత పౌరులను చిన్న వయసులోనే రోగగ్రస్తులను చేసే పరిస్థితి. ఢిల్లీ హైకోర్టు 2010లో విచారణకు తీసుకున్న ఒక ప్రజా ప్రయోజన వ్యాజం నుండి మొదలైన ఈ చర్చ, ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి వచ్చి నిర్ణయాల రూపం దాల్చడం సంతోషకరం.

పంచదార అధికంగా ఉన్న జంక్‌ఫుడ్స్ వల్ల ఊబకాయం, మధుమేహం మాత్రమే కాదు – దంత సమస్యలు, గుండె జబ్బులు, బి.పి., జ్ఞాపకశక్తి హ్రాసం, మానసిక కుంగుబాటు వంటి అనేక సమస్యలు వస్తున్నాయి. ఆరోగ్య రీత్యా బలహీనమవుతున్న పిల్లలు తరగతి గదుల్లో చదువుపై శ్రద్ధ పెట్టలేకపోతున్నారు. ఇంతలో స్కూళ్ళన్నీ ర్యాంకుల పోటీలో పడి ఆటలు, వ్యాయామాలను పక్కన పెట్టడం పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తోంది.

మే 25న ప్రధాని మోడీ 'మన్ కీ బాత్'లో 'షుగర్ బోర్డుల' అవసరాన్ని ప్రస్తావించి, "ఫిట్ ఇండియా" అనే లక్ష్యాన్ని ముందుంచారు. కానీ ఇది కూడా సినిమాల్లో కనిపించే "మద్యపానం ఆరోగ్యానికి హానికరం", "పొగ తాగడం ప్రమాదకరం" అనే లిప్‌సర్వీస్‌లాగ కాకుండా ఆచరణాత్మక మార్పులకు దారి తీసేలా ఉండాలి.

- **అందుకోసం కేవలం స్కూలు ఆవరణల్లో లేదా 50 మీటర్ల పరిధిలో జంక్‌ఫుడ్స్ అమ్మకాన్ని నిషేధించడం సరిపోదు. ఈ సమస్యను సమూలంగా అరికట్టే కొన్ని ప్రధాన చర్యలు అవసరం:**
- **జంక్‌ఫుడ్స్ తయారీని కట్టడి/నిషేధం చేయాలి.**
- **పోషకాహార విద్యను పాఠశాల సిలబస్‌లో భాగం చేయాలి.**
- **పిల్లలతో వారానికోసారి వంట, పోషకాహార వర్క్‌షాప్‌లు నిర్వహించాలి.**
- **తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పోషకాహారంపై శిక్షణ తప్పనిసరి చేయాలి.**
- **ఆహార వేళలు, నిద్ర వేళలు శరీర బయో క్లాక్‌కి అనుగుణంగా ఉండేలా అవగాహన కల్పించాలి.**
- **ప్రతి స్కూల్లో ఆట స్థలాలు, వ్యాయామ సమయం తప్పనిసరిగా ఉండాలి.**
- **శారీరక దారుఢ్యాన్ని విద్యలో ఒక అంతర్భాగంగా గుర్తించాలి.**

పిల్లల ఆరోగ్యం కాపాడడం కేవలం బోర్డులు పెట్టడం ద్వారా సాధ్యం కాదు. జీవనశైలిలో, ఆహారపు అలవాట్లలో మూలభూత మార్పు అవసరం. బలమైన శరీరం, స్ఫూర్తిదాయకమైన మనసు కలిగిన పిల్లలతోనే రేపటి భారత్ "ఫిట్ ఇండియా"గా మారగలదు.

## మాతా, శిశు వైద్యసేవలకు ఊతం

(మొదటి పేజీ తరువాయి)

. మొత్తం 332 రకాలకు చెందిన 5,687 పరికరాలు మరియు సామగ్రిని కొనుగోలు చేస్తారు.

గుంటూరు జిజిహెచ్ లో 37 రకాలకు చెందిన 1,187 పరికరాలను రు.23.51 కోట్లతో అందజేస్తారు. కాకినాడ జిజిహెచ్ లో 295 రకాలకు చెందిన 4,500 పరికరాలను రు.27.82 కోట్లతో ఏర్పాటు చేస్తారు.

ఈ కొత్త బ్లాకుల కోసం పడకలు, బెడ్లు, ఐసియు బెడ్లు, పేషెంట్ మోనిటర్లు, వెంటిలేటర్లు, డీఫిబ్రిరేటర్లు, ఇసిజి మెషీన్లు, మొబైల్ ఎక్స్‌రే యూనిట్లు, మొబైల్ అల్ట్రా సౌండ్ మెషీన్లు, నిబులైజర్లు, డెలివరీ సెట్లు, ఆక్సీ మీటర్లు, ఫోటో థెరపీ యూనిట్లు, సర్జికల్ చైర్లు వంటి పలు రకాల వైద్య పరికరాలను భారీ స్థాయిలో కొనుగోలు చేయనున్నారు.

**మంత్రి అభినందనలు** : ఈ రెండు ఆస్పత్రుల్లో ఎంసిహెచ్ బ్లకుల నిర్మాణానికి ముందుకొచ్చిన గుంటూరు మెడికల్ కాలేజీ అలమ్నై ఆఫ్ నార్త్ అమెరికా, కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీ అలమ్నై ఆఫ్ నార్త్ అమెరికాలను మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందించారు. ఈ బ్లాకుల నిర్మాణాలకు కృషిచేసిన ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్లు, సిబ్బందిని మంత్రి ప్రశంసించారు.

## జగన్ పాలనలో ఏపీకి తీరని నష్టం..

(మొదటి పేజీ తరువాయి)

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన నష్టం కన్నా, జగన్ ఐదేళ్ల పాలనలోనే ఎక్కువ నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు మంత్రి నిమ్మల రామానాయుడు.

ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేసిందని నొక్కిచెప్పారు. తమ ప్రభుత్వంలో పెన్షన్ సొమ్ము పెంపు, మహిళలకు ఉచిత ప్రయాణం, తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి రూ. 13 వేలు అందించామని స్పష్టం చేశారు. అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ, గుంతలు లేని రోడ్లు, మత్స్యకారులకు రూ. 20 వేలు, తదితర సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

## నిర్మాణాలు పూర్తి చేయండి..

(మొదటి పేజీ తరువాయి)

గ్రూప్-డి అధికారుల కోసం 720 ఇళ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. డిసెంబర్ 31 లోగా అన్ని టవర్లను పూర్తిచేస్తామన్నారు. వచ్చేఫిబ్రవరి ఒకటికల్లా నిర్మాణాలు పూర్తి చేసి అధికారులకు అప్పగిస్తామని తెలిపారు. ఐఎఎస్ అధికారుల టవర్ల నిర్మాణం దాదాపు పూర్తయిందని, మొత్తం 4,400 ఇళ్లలో 3,750 ఇళ్లను వచ్చే మార్చి నాటికి అధికారులకు, ఉద్యోగులకు అప్పగిస్తామని చెప్పారు. ఏడాదిలో ట్రంక్ రోడ్లు, రెండున్నరేళ్లలో లే అవుట్ రోడ్లు, మూడేళ్లలో ఐకానిక్ టవర్లను పూర్తి చేస్తామని తెలిపారు.

## వైసీపీని ప్రజలు నమ్మరు

(మొదటి పేజీ తరువాయి)

తట్టుకోలేని వైసీపీ నాయకులు ప్రతి విషయాన్ని రాజకీయం చేసేందుకు డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు.

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు 5 ఏళ్లు రైతులను పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు ఏ పని లేకుండా కేవలం రైతులను అడ్డం పెట్టుకొని ప్రభుత్వంపై బురద జల్లేందుకు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు.

ఉల్లి సమస్యను సీఎం చంద్రబాబు నాయుడు ఎప్పటి కప్పుడు పర్యవేక్షిస్తున్నారన్నారు. వైసీపీ అంటే డ్రామా.. డ్రామా అంటే వైసీపీ అని ఆయన ఎద్దేవా చేశారు. ఎలాంటి సమస్య లేకున్నాఏదో ఉన్నట్టు సృష్టించడంలో వైసీపీ నేతలు ఆరితేరారని మంత్రి టీ.జీ భరత్ పేర్కొన్నారు. పేపర్ ఉంది కదా అని ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు.

# సవాళ్లున్నా.. సంక్షేమం



(మొదటి పేజీ తరువాయి)

హేళనగా మాట్లాడిన దుస్థితి. అనేక ఆర్థిక సవాళ్లు ఉన్నా ఊహించని స్థాయిలో సంక్షేమం, అభివృద్ధి చేసేందుకు సంకల్పించింది. 15 నెలల క్రితం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం రాష్ట్ర పునర్నిర్మాణం దిశగా వేగంగా నిర్ణయాలు అమలు చేసింది. సంక్షేమం ఒకవైపు, అభివృద్ధి ఇంకోవైపు అంటూ పాలనను పరుగులు పెట్టించింది. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టుగానే పాలనా పగ్గాలు చేపడుతూనే పెంచిన పెన్షన్లను అమలు చేసేలా తొలిసంతకం చేశారు ముఖ్యమంత్రి చంద్రబాబు. హామీ ఇచ్చిన నాటి నుంచే పెంచిన పెన్షన్లు అమలయ్యేలా మూడు నెలల బకాయిలు కలిపి వృద్ధులు, దివ్యాంగులు, ఇలా వివిధ కేటగిరీలకు చెందిన పెన్షనర్లకు అందించింది కూటమి సర్కారు. ప్రతీ నెలా జరిగే సామాజిక పండుగగా పెన్షన్ల పథకం అమలు చేస్తోంది కూటమి ప్రభుత్వం. ఇప్పటి వరకూ దాదాపు రూ.45 వేల కోట్లను వ్యయం చేసింది. మహిళలకు ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలెండర్లు ఇచ్చేలా దీపం 2.0 పథకాన్నీ దిగ్విజయంగా అమలు చేస్తోంది. 2.3 కోట్ల ఉచిత గ్యాస్ సిలెండర్లు మహిళల ఇళ్లల్లో వెలుగులు నింపాయి. తల్లికి వందనం పథకం ద్వారా ఎంత మంది పిల్లలు ఉన్నా వారందరికీ ఆర్థిక సాయం అందిస్తూ అండగా నిలిచింది. 67 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాలకు రూ.13 వేల చొప్పున నిధుల్ని జమ చేసింది. దీని కోసం రూ.10 వేల కోట్లను కూటమి వెచ్చించింది. గతంలో ఒక్కరికి మాత్రమే ఈ సాయం అందేదీ.. కానీ కూటమి ప్రభుత్వం ఎంత మంది పిల్లలు ఉన్నా వర్తింప చేసింది. అన్నదాతకు ఆత్మ బంధువుగా నిలుస్తూ 44 లక్షల మంది రైతులకు రూ.20 వేల చొప్పున మూడు విడతలుగా ఆర్థిక సాయం అందించేలా అన్నదాత సుఖీభవ పథకాన్నీ అమలు చేస్తోంది. గత పాలకులు ఏడాదికి రూ.7,500 విదిలిస్తే.. కూటమి సర్కారు ఒక్క విడతకే రూ.7 వేలను వారి ఖాతాల్లో వేసింది. దీని కోసం రూ.3,200 కోట్లను వ్యయం చేసింది. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ద్వారా మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ స్త్రీశక్తి పథకం అమలు చేస్తోంది కూటమి. 5 కోట్ల పైచిలుకు ప్రయాణాలతో మహిళలు ఈ పథకాన్ని సూపర్ హిట్ చేశారు. దీని కోసం రూ.2 వేల కోట్లను వెచ్చిస్తున్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16,347 మందిని ఉపాధ్యాయులుగా భర్తీ చేసి నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీనీ నిలబెట్టుకుంది కూటమి సర్కారు. అలాగే పెట్టుబడులను ఆకర్షించడం... పరిశ్రమలు స్థాపించడం ద్వారా లక్షల సంఖ్యలో ఉద్యోగాలు, ఉపాధి కల్పన దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సుపరిపాలనతో రాష్ట్ర బ్రాండ్ ఇమేజీని పునరుద్ధరించి... 15 నెలల కాలంలో దాదాపు రూ. 10 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులకు ఒప్పందాలను కుదుర్చుకుంది ప్రభుత్వం. వీటి ద్వారా పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది.

**అందరికీ ఆరోగ్య సేవ** : పేదవాడికి ఆకలి తీర్చేలా రాష్ట్రంలో 204 అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేసిన ప్రభుత్వం రూ.5కే భోజనం అందిస్తోంది. ఇప్పటి వరకూ 5.6 కోట్ల భోజనాలు అన్నార్తుల కడుపు నింపాయి. ఇక రాష్ట్రంలోని ప్రజలందరికీ ఆరోగ్య ధీమా కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం విప్లవాత్మకం. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేనట్టుగా పేద ధనికా అనే తారతమ్యం లేకుండా 5 కోట్ల మంది ప్రజలకు వర్తింప చేస్తూ యూనివర్సల్ హెల్త్ పాలసీని అమలు చేస్తూ నిర్ణయం తీసుకుంది. రూ.25 లక్షల వరకూ వైద్య చికిత్సలు ఉచితంగా చేయించుకునేందుకు ఆస్కారం కల్పించింది రాష్ట్రప్రభుత్వం. సంక్షేమాన్ని-అభివృద్ధిని కలగలిపి పాలన చేస్తూ ఇప్పటికే సంక్షేమంపై రూ. లక్ష కోట్లకు పైగా వెచ్చించింది కూటమి సర్కారు. గత పాలకులు ఐదేళ్ల కాలంలో 2 లక్షల కోట్ల రూపాయలు వెచ్చించామని గొప్పలు చెప్పుకుంటుంటే.. కేవలం 15 నెలల కాలంలోనే రూ. లక్ష కోట్లకు పైగా వ్యయం చేసింది రాష్ట్ర ప్రభుత్వం. ఏడాదిలోనే ఇరిగేషన్ రంగంలో అద్భుతమైన ఫలితాలు సాధించింది ప్రభుత్వం. హంద్రీ-నీవా కాల్వల విస్తరణ ద్వారా రాయలసీమ చివరి భూములకు తొలి సారి సాగు నీరు అందించింది ప్రభుత్వం.

**అన్ని వర్గాలకు అండగా...** : బీసీలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ముందుకు తీసుకువెళ్లేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికలు అమలు చేస్తోంది. చేతి వృత్తులు, కులవృత్తులైన అన్ని వర్గాలకు బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి అండగా నిలుస్తోంది. బీసీల రక్షణ చట్టం తీసుకుని వచ్చేందుకు మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం చేస్తోంది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్‌లను గత ప్రభుత్వం 24 శాతానికి తగ్గిస్తే... తిరిగి 34 శాతానికి పెంచేలా కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. బీసీల గృహ నిర్మాణానికి అదనంగా రూ.50 వేలు, బీసీల ఇళ్లపై 3 కిలోవాట్ల సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు రూ.98,000 సబ్సిడీ ఇస్తోంది. దేవాలయాల్లో పని చేస్తున్న నాయీ బ్రాహ్మణుల కనీస వేతనం రూ.25 వేలకు ప్రభుత్వం పెంచింది... అలాగే ఈ వర్గాలకు దేవాలయ ట్రస్ట్ బోర్డుల్లో చోటు కల్పించేలా నిర్ణయం తీసుకుంది. 40వేల సెలూన్లకు 200యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తోంది. మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్టు కల్లు గీత కార్మికులకు 10శాతం మద్యం దుకాణాలు, బార్‌లు కేటాయించింది. మత్స్యకారులకు వేట విరామ సమయంలో రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని ఇస్తోంది. మత్స్యకారుల సేవలో పథకం ద్వారా 1,29,178 మందికి రూ.259 కోట్లు అందించింది. చేనేతకు అండగా హ్యాండ్లూమ్స్‌కు నెలకు 200యూనిట్లు, పవర్‌లూమ్స్‌కు 500యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తోంది. చేనేత ఉత్పత్తులకు జీఎస్టీ 5 శాతం రీయింబర్స్‌మెంట్ ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నేతన్న భరోసా కింద చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.25 వేలు సాయంగా ఇవ్వాలని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. వడ్డెరలకు మైనింగ్ లీజుల్లో 10 శాతం కేటాయింపు, కురబలకు, యాదవులకు సబ్సిడీలో గొర్రెలు, మేకలు, పశువులు అందించి ఉపాధి కల్పిస్తోంది. ఎస్సీ సామాజిక వర్గాల్లో అంతరాలు తగ్గించేలా...ఏ వర్గాన్ని నొప్పించకుండా, ఏ ఒక్కరూ నష్టపోకుండా ఎస్సీ వర్గీకరణతో వారి దశాబ్దాల ఆకాంక్షను కూటమి ప్రభుత్వం నెరవేర్చింది. ఏజెన్సీ ప్రాంతాల్లో 'అడవితల్లి బాటలో' కార్యక్రమం ద్వారా రూ.1,000 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టింది. మైనారిటీల హక్కులు పరిరక్షిస్తూ, అవసరాలు తీరుస్తోంది. ఇమామ్‌లకు రూ.10,000, మౌజన్లకు రూ.5,000 చొప్పున గౌరవవేతనం ఇస్తోంది. హజ్ యాత్రికులకు ఒకొక్కరికి రూ.1 లక్ష ఆర్థికసాయం అందిస్తున్నాం. గన్నవరం ఎయిర్‌పోర్టును ఎంబార్కేషన్ పాయింట్‌గా చేసింది. 8,427 మంది పాస్టర్లకు రూ.5,000 గౌరవ వేతనాన్ని ప్రభుత్వం ఇస్తోంది. ఇక అర్చకుల జీతాలను రూ. 15 వేలు చేసిన ప్రభుత్వం... ధూప దీప నైవేద్యాలకు ఆలయానికి రూ. 10 వేల చొప్పున చెల్లిస్తోంది. ఇక వేద విద్యార్థులకు రూ. 3 వేల స్టైఫండ్ కూటమి ప్రభుత్వం అందిస్తోంది.

**టీమ్ ఎన్డీఏగా సక్సెస్...** : చిన్నపాటి పొరపొచ్చాలు కూడా లేకుండా కూటమి సర్కారు పాలన కొనసాగిస్తోంది. ఎన్నికలకు ముందు రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా... సీట్ల సర్దుబాటు చేసుకున్న మూడు పార్టీలు... అధికారంలోకి వచ్చాక కూడా అదే పంథాతో వెళ్తున్నాయి... కలిసికట్టుగా నడుస్తున్నాయి. 15 నెలల కాలంలో సీఎం చంద్రబాబు-డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్-మంత్రి లోకేష్-బీజేపీ అగ్ర నేతలు అత్యంత సమన్వయంతో పని చేస్తున్నారు. అవసరమైన సమయాల్లో కేంద్రంతో, ప్రధాని మోదీతో సంప్రదింపులు జరుపుతూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా అడుగులు వేయిస్తున్నారు. ఇక నామినేటెడ్ పదవుల విషయంలోనూ మూడు పార్టీల మధ్యే అంతే సమన్వయం, సహకారం కన్పిస్తోంది. ప్రాంతాలు, జిల్లాల వారీగా... ఆయా సామాజిక వర్గాల సమీకరణాలను బేరీజు వేసుకుని నామినేటెడ్ పదవుల కూర్పు చేపడుతున్నారు. రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ఇప్పటి వరకు సుమారు 60 వేల మేర నామినేటెడ్ పదవుల భర్తీ సాఫీగా జరిగింది. కలిసి వచ్చాం, కలిసి గెలిచాం, కలిసి పని చేస్తున్నాం.. ఇక భవిష్యత్తులోనూ కలిసే ఉంటాం అనే రీతిలో ఓ బలమైన సంకేతాన్ని ఈ వేదిక ద్వారా పంపాలన్నది కూటమి నేతల లక్ష్యంగా కన్పిస్తోంది.

## ఆలపాటి వ్యూహం..





(మొదటి పేజీ తరువాయి)

అవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పట్టణ టిడిపి అధ్యక్షుడు మహమ్మద్ కుదూస్ మాట్లాడుతూ "కూటమి అధిష్ఠానం నిర్ణయం మేరకు నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఇది మంచి పరిణామం" అని అన్నారు.

**ప్రధాన నేతల సమన్వయం** : ఈ ప్రక్రియలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మార్గనిర్దేశకులుగా వ్యవహరించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. నామినేషన్ల సమర్పణలో జొన్నాదుల మహేష్, భీమవరపు సాంబిరెడ్డి, షేక్ జాకీర్ హుస్సేన్, హరిదాసు గౌరీశంకర్, షేక్ ఇస్మాయిల్, మామిడి బత్తుల సుబ్రహ్మణ్యం, సుంకర హరికృష్ణ, కరణం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీలపై వైసీపీ దుష్ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

**వైసీపీ ఆరోపణలు అసత్యం: మంత్రి దుర్గేష్**

కాలేజీలను ప్రైవేట్ పరం చేయడం కాదని, నిర్మాణం పూర్తైన తర్వాత యాజమాన్యం, నియంత్రణ ప్రభుత్వానికే ఉంటుందని మంత్రి తెలిపారు. పీపీపీ విధానం వల్ల నిర్మాణాలు వేగంగా పూర్తి అవుతాయని, ప్రతి కాలేజీలో కనీసం 150 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా పెరుగుతాయని ఆయన వివరించారు. ఈ నిర్ణయం వల్ల ప్రభుత్వంపై భారం తగ్గి, వైద్య విద్య ఎక్కువ మందికి అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

**జగన్ హయాంలో కాలేజీల పరిస్థితి**

17 మెడికల్ కాలేజీలు కడుతున్నామన్న జగన్ రెడ్డి ఒక్క కాలేజీని కూడా పూర్తిచేయలేదని మంత్రి దుర్గేష్ ఆరోపించారు. మార్కాపురం కాలేజీ 17%, మదనపల్లె 12%, పులివెందుల 77%, ఆదోని 15% మాత్రమే పూర్తయ్యాయని వివరించారు. రూ.8,500 కోట్లు ఖర్చు పెట్టాల్సిన చోట వైసీపీ హయాంలో కేవలం 17% మాత్రమే ఖర్చు పెట్టారని తెలిపారు. విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాలలో 2023-24లో అరకొర వసతులతోనే క్లాసులు ప్రారంభించారని, హాస్టళ్లు, సిబ్బంది లేకుండా కాలేజీలు నడుస్తున్నాయని ఆయన విమర్శించారు.

**కూటమి ప్రభుత్వ కసరత్తు** : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాడేరులో మెడికల్ కాలేజీని ప్రారంభించిందని, మరికొన్ని కాలేజీలను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటోందని మంత్రి గుర్తుచేశారు. రెండు దశల్లో పీపీపీ మోడల్‌లో కాలేజీలను పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చే యోచనలో ప్రభుత్వం ఉందని వివరించారు.

**ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం నిర్ణయం** :ప్రతి కాలేజీని 100 ఎంబీబీఎస్ సీట్లతో ప్రారంభించేలా నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించామని మంత్రి చెప్పారు. వైద్య విద్య పేదలకు అందుబాటులో ఉండేలా పీపీపీ విధానంలో నిర్మించిన ఆసుపత్రుల్లో ఉచిత ఓపి సేవలు, 70% పడకలను ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు ఉచితంగా ఇవ్వాలని నిబంధనలు పెట్టామని తెలిపారు. జనరిక్ మందులు కూడా ఉచితంగా అందిస్తున్నామని వివరించారు.

**వైసీపీ విషప్రచారం** : సెల్ఫ్ ఫైనాన్స్ విధానం పేరుతో ఎంబీబీఎస్ సీట్ల ఫీజు రూ.12 లక్షలు పెట్టిన జగన్ రెడ్డి, నేడు పీపీపీ విధానాన్ని తప్పుపడటం విచిత్రమని మంత్రి ఎద్దేవా చేశారు. కాలేజీలు నిర్మించకుండా సగం పనిలో వదిలేసిన వైసీపీ ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి మండిపడ్డారు. "జగన్ హయాంలో పూర్తి కాని మెడికల్ కాలేజీలను మేమెలా ప్రైవేట్ పరం చేస్తాం?" అని వైసీపీని ప్రశ్నించారు. "వైద్య విద్యను పేదలకు అందుబాటులోకి తేవడమే మా లక్ష్యం. కానీ వైసీపీ మాత్రం ప్రజలను తప్పుదోవ పట్టించే విషప్రచారానికే పరిమితమైంది" అని మంత్రి దుర్గేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## హలో... అమ్మా బాగున్నారా..?

(మొదటి పేజీ తరువాయి)

ఆరు చొప్పున పే ఫోన్లు ఏర్పాటు చేయబోతోంది. ఈ ఫోన్లను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత సోమవారం పెనుకొండ నియోజక వర్గం రొద్దం ఎంజేపీ స్కూల్లో ప్రారంభించబోతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 110 గురుకుల పాఠశాలల్లో 40 వేల మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కుటుంబానికి, తల్లిదండ్రులకు దూరంగా ఉండడంతో విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురవుతుంటారు. నెలకో, రెండు నెలలకో తల్లీదండ్రి వస్తే వారితో కాసేపు మాట్లాడడం, వారు వెళ్లిపోయాక దిగాలు పడిపోవడం విద్యార్థులకు పరిపాటిగా మారిపోయింది. విద్యార్థుల మానసిక వేదనను గుర్తించిన ప్రభుత్వం గురుకుల పాఠశాలల్లో పే ఫోన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ ఫోన్ల ద్వారా తమ తల్లిదండ్రులు, బంధువులతో రోజూ మాట్లాడుకునే అవకాశం కలుగుతుంది. తరుచూ తల్లిదండ్రులతో మాట్లాడుతుండడం వల్ల విద్యార్థులకు ఇంటిపై ఉన్న బెంగపోవడంతో పాటు విద్యపై దృష్టిసారించడానికి అవకాశం కలుగుతుందనేది ప్రభుత్వ భావన.

**రోజుకు రెండు గంటల మాత్రమే అవకాశం...** : రాష్ట్రంలో ఉన్న 110 గురుకుల పాఠశాలల్లో ఆరు పే ఫోన్లు చొప్పున ఏర్పాటు చేయనున్నారు. తల్లిదండ్రులు, బంధువులతో ఫోన్‌లో మాట్లాడానికి రోజుకు రెండు గంటల సమయం కేటాయించనున్నారు. ఉదయం తరగతలు ప్రారంభానికి ముందు ఒక గంట, సాయంత్రం మరో గంట ఫోన్లో మాట్లాడానికి అవకాశం కల్పిస్తారు. ఆయా పాఠశాలల సౌలభ్యాన్ని సమయం నిర్ణయించుకునే అవకాశం ప్రిన్సిపాళ్లకు ప్రభుత్వం కల్పించింది.

**స్మార్ట్ కార్డుతో ఫోన్ చేసుకునే వీలు..** : విద్యార్థులకు ప్రభుత్వం ఏటీఎం కార్డుల తరహాలో స్మార్ట్ కార్డులు అందజేస్తోంది. ఈ కార్డులకు రూ.10లు రీ ఛార్జి చేయాల్సి ఉంటుంది. ఒక్కో నిమిషానికి ఒక్కో రూపాయి వ్యయమవుతుంది. విద్యార్థులే తమ కార్డులకు రీఛార్జి చేసుకోవాల్సి ఉంటుంది. విద్యార్థి ఎన్ని పర్యాయాలైన స్మార్ట్ కార్డుకు రీఛార్జి చేసుకోవొచ్చు. తల్లిదండ్రులు సూచించిన నాలుగు ఫోన్ నెంబర్లు మాత్రమే ఆ స్మార్ట్ కార్డులో పొందుపరుచుతారు. విద్యార్థులు ఆ ఫోన్ నెంబర్లకు మాత్రమే ఫోన్ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. విద్యార్థుల సౌకర్యం కోసం ఏర్పాటు చేస్తున్న పే ఫోన్లు దుర్వినియోగం కాకుండా ఉండేలా సీసీ కెమెరాలతో పర్యవేక్షించనున్నారు.

**కార్పొరేట్ విద్యా సంస్థల తరహాలో...** : కార్పొరేట్ విద్యాసంస్థల్లో పే ఫోన్లు సౌకర్యం ఉంటుంది. ఇపుడీ అవకాశం ఎంజేపీ స్కూళ్లో చదువుకునే బీసీ విద్యార్థులకు వచ్చింది. ప్రభుత్వ పరిధిలో ఉన్న మిగిలిన గురుకుల సంక్షేమ పాఠశాల్లో ఈ తరహా టెలిఫోన్ బాక్సులు ఇంకా ఏర్పాటు చేయలేదు. గురుకుల పాఠశాలల్లో చదివేదే అత్యధిక మంది పేద విద్యార్థులే. తమ బిడ్డలను చూసుకోవడం సుదూర ప్రాంతాల్లో ఉండే పేద తల్లిదండ్రులకు ఆర్థిక భారంతో కూడుకున్నది. పే ఫోన్ల ఏర్పాటుతో తమ బిడ్డలతో రోజూ మాట్లాడుకునే అవకాశం తల్లిదండ్రులకు, బంధువులకు, సంరక్షలకు కులుగుతుంది.

**ప్రభుత్వంపై భారం లేదు...** : 110 గురుకుల పాఠశాల్లో ఏర్పాటు చేసే పే ఫోన్ల వల్ల ప్రభుత్వంపై ఎటువంటి భారమూ పడడం లేదు. ఎం.ఆర్.కె.ఆర్. ఐటీ సొల్యూషన్ సంస్థ ఈ ఫోన్ల ఏర్పాటుకు ముందుకొచ్చింది. విద్యార్థులు చేసుకునే రీ ఛార్జే ఆ సంస్థకు ఆదాయంగా వస్తుంది. కార్పొరేట్ విద్యా సంస్థల్లోనూ ఇదే తరహాలో టెలిఫోన్ బాక్సులు ఏర్పాటు చేస్తుంటారు.

**పే ఫోన్లతో విద్యార్థులకు మేలు** : సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీసీ విద్యార్థుల విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోంది. ముఖ్యంగా బీసీ హాస్టళ్లు, గురుకులాలపై ప్రత్యేక దృష్టి సారించింది. గత ప్రభుత్వం పెట్టిన డైట్, కాస్మోటిక్ ఛార్జీల బకాయిలను అధికారంలోకి రాగానే చెల్లించాం. హాస్టళ్ల మరమ్మతులకు, వసతుల కల్పనకు నిధులు మంజూరు చేశాం. పౌష్టికాహారం అందజేయడంలో మెనూను సక్రమంగా అమలు చేయిస్తున్నాం. విద్యార్థులకు సన్న బియ్యంతో భోజనం అందిస్తున్నాం. ఇంటిలో ఎందరు పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం నిధులు అందజేశాం.

## శ్రీ ఆదిచుంచనగిరి క్షేత్రాన్ని సందర్శించిన మంత్రి లోకేష్



(మొదటి పేజీ తరువాయి)

అడిగి తెలుసుకున్నారు. మఠం 72వ పీఠాధిపతి జగద్గురు శ్రీ నిర్మలానందనాథ మహాస్వామిజీ ఆశీర్వాదం పొందారు. మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలు, మెడికల్ కాలేజ్, హాస్పిటల్, యూనివర్సిటీ ను మంత్రి నారా లోకేష్ సందర్శించారు. అనంతరం మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంవిత్ పాఠశాలల గురించి ప్రత్యేకంగా అడిగితెలుసుకున్నారు. పేద విద్యార్థులకు ఎటువంటి ఖర్చు లేకుండా 6 వ తరగతి నుండి ఇంటర్ వరకూ అన్ని వసతులతో కూడిన విద్యను అందిస్తున్నాం అని మఠం నిర్వాహకులు తెలిపారు. అంతే కాకుండా ఇంటర్ పూర్తయిన తరువాత ఏ రాష్ట్రంలో డిగ్రీ చదవాలి అనుకున్నా మఠం ఆర్థిక సహాయం అందిస్తుంది అని తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ లో పేద విద్యార్థులకు ఉపయోగపడేలా సంవిత్ పాఠశాల ప్రారంభించాలని మంత్రి నారా లోకేష్ కోరగా పీఠాధిపతి జగద్గురు శ్రీ నిర్మలానందనాథ మహాస్వామిజీ అందుకు అంగీకరించారు.

## గాల్లో తేలినట్లుంటుంది..

(మొదటి పేజీ తరువాయి)

ఇటీవలే వీఎంఆర్డీఏ స్కై సైక్లింగ్, జిప్‌లైనర్‌లను అందుబాటులోకి తెచ్చింది. ఇప్పుడు పర్యాటకులను మరింత ఆకర్షించడానికి తేలియాడే గాజు వంతెన సైతం మరికొద్ది రోజుల్లో అందుబాటులోకి తేనుంది.

దేశంలోనే అతి పొడవైన గాజు వంతెన : విశాఖలో మరికొద్ది రోజుల్లో గాజు వంతెన పర్యాటకులకు థ్రిల్ పంచనుంది. మహా విశాఖ ప్రాంత నగరాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కైలాసగిరిపై 55 మీటర్లు పొడవు కలిగిన గాజు వంతెన నిర్మాణం పూర్తి అయింది. ఒకేసారి 100 మంది నిలబడే సామర్థ్యంతో దీనిని నిర్మించినా భద్రత దృష్ట్యా ఒకసారికి కేవలం 40 మందికి మాత్రమే అనుమతిస్తారు. నడిచేందుకు దేశంలోనే అత్యంత పొడవైన గాజు వంతెనగా ఇది పేరొందింది.

**బ్యాచుల వారీగా నడకకు అవకాశం** : 55 మీటర్ల ఈ గాజు వంతెన పీపీపీ పద్ధతిలో రూపుదిద్దుకుంది. నిర్దేశిత రుసుము చెల్లించి గాజు వంతెన పై బ్యాచుల వారీగా నడకకు అవకాశం కల్పిస్తారు. అత్యంత దృఢమైన గాజు పలకల అమరికతో ఇది రూపొందింది. దీనిపై నడిచేటప్పుడు పర్యాటకులకు గాలిలో తేలియాడే అనుభూతిని కలుగుతుంది. పెద్దలతో పాటు పిల్లలు కూడా ఆస్వాదించేందుకు వీలుగా భద్రతా ప్రమాణాలు ఏర్పాటు చేశారు. గాజు వంతెనపై నడుచుకుంటూ సెల్ఫీలు దిగేందుకు కూడా అవకాశం కల్పించారు.

గతంలో కైలాసగిరిపై టైటానిక్ వ్యూ పాయింట్ ఉండేది. అక్కడి నుంచి చూస్తే సముద్రం అద్భుతంగా కనిపిస్తుంది. ఈ దృశ్యాన్ని చూడటానికే ఇక్కడికి సందర్శకులు వచ్చేవారు. అది ఆ తర్వాత శిథిలమైంది. ప్రస్తుతం దాని స్థానంలో తేలియాడే గాజువంతెన నిర్మాణం అందుబాటులోకి రానుంది.

స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు : ఒడిశా, పశ్చిమబెంగాల్, తదితర రాష్ట్రాల నుంచి వచ్చే సందర్శకులు విశాఖలోని జిప్‌లైనర్, స్కైసైక్లింగ్, రోప్‌వే, అద్దాల ఏసీ రైలుబండికి ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. వీటి ద్వారా వీఎంఆర్డీఏకు ఆదాయం కూడా సమకూరుతోంది. ఇప్పుడు కొత్తగా గాజు వంతెన ఏర్పాటైతే పర్యాటకుల సంఖ్య మరింత పెరగనుంది. దీంతో స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగవనున్నాయి.

ఏపీలో తొలిసారిగా ఏర్పాటు : తేలియాడే గాజు వంతెన దక్షిణ భారతదేశంలో కేరళలో ఉంది. ఏపీలో తొలిసారిగా విశాఖలో ఏర్పాటు చేస్తున్నారు. ఇది అందుబాటులోకి వస్తే దేశంలోనే అతి పొడవైన గాజు వంతెనగా నిలవనుంది. దీనిపైకి ఎక్కిచూస్తే చుట్టూ ఎత్తైన కొండలు, కింది భాగంలో లోయ, కనుచూపు మేరలో సాగరం కనిపిస్తాయి. కొత్త లోకంలో విహరిస్తున్నట్లు, గాల్లో తేలియాడుతున్న భావన సందర్శకులకు కలుగుతుందని నిర్వాహకులు చెబుతున్నారు.

# కిమ్‌పై గూఢచర్యంలో నేవీసీల్స్ వైఫల్యం!



**వాషింగ్టన్, సెప్టెంబరు 7 :** ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్‌పై గూఢచర్యం చేసేందుకు అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ఓ రహస్య ప్రయత్నం దారుణంగా విఫలమైంది. 2019లో జరిగిన ఈ సీక్రెట్ ఆపరేషన్‌లో అమెరికా నేవీ సీల్స్ బృందం కొందరు ఉత్తర కొరియా పౌరులను హతమార్చి, లక్ష్యాన్ని పూర్తి చేయకుండానే వెనుదిరగాల్సి వచ్చింది. ఈ సంచలన విషయాలను అమెరికా ఆంగ్లపత్రిక ప్రత్యేక కథనం ప్రచురించింది. 2019లో కిమ్‌తో అణు చర్చలు జరగడానికి ముందు ఆయన కమ్యూనికేషన్లను రహస్యంగా తెలుసుకునేందుకు ట్రంప్ యంత్రాంగం ప్లాన్ వేసింది. ఇందులో భాగంగా కిమ్ ఫోన్ సంభాషణలను సైతం వినగలిగే ఒక ఎలక్ట్రానిక్ పరికరాన్ని ఉత్తర కొరియా భూభాగంలో అమర్చాలని భావించింది. ఈ బాధ్యతను అత్యంత నైపుణ్యం కలిగిన నేవీ సీల్ టీమ్ 6 కు అప్పగించారు. నెలల తరబడి శిక్షణ పొంది, పక్కా ప్రణాళికతో ఈ ఆపరేషన్ ప్రారంభించారు. అయితే, క్షేత్రస్థాయిలో పరిస్థితులు అనుకూలించలేదు. జలాంతర్గామి నుంచి మినీ సబ్‌మెరైన్ల ద్వారా తీరానికి చేరుకున్న సీల్స్ బృందానికి ఊహించని అవాంతరాలు ఎదురయ్యాయి. మొదట వారి మినీ సబ్‌మెరైన్ల సమన్వయం దెబ్బతింది. ఆ తర్వాత, వారికి రియల్ టైమ్ ఇంటెలిజెన్స్ లేకపోవడం పెద్ద లోపంగా మారింది. తాము ఉన్న ప్రాంతంలో ఎవరూ లేరని భావించిన వారికి ఓ చిన్న చేపల పడవ కంటపడింది. ఆ పడవలోని మత్స్యకారులు తమను గమనిస్తున్నారని, మిషన్ రహస్యం బయటపడిపోతుందని సీల్స్ బృందం ఆందోళన చెందింది. తమ ఆచూకీ బయటపడకముందే అప్రమత్తమైన సీల్స్.. ఆ మత్స్యకారులపై కాల్పులు జరిపి వారిని హతమార్చింది.

# హనీమూన్ హత్యకేసులో పురోగతి

## 790 పేజీల చార్జిషీటు దాఖలుచేసిన మేఘాలయ పోలీసులు



**భోపాల్, సెప్టెంబరు 7:** భర్తను మధ్యప్రదేశ్ నుంచి హనీమూన్‌పేరుతో మేఘాలయకు తీసుకెళ్లి హత్య చేయించిన కేసు దర్యాప్తు కోసం మేఘాలయ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం తాజాగా ఛార్జిషీట్ దాఖలు చేసింది. మొత్తం 790 పేజీల చార్జిషీట్‌ను కోర్టుకు సమర్పించింది. ఈ చార్జిషీట్‌లో హతుడి భార్య సోనమ్, ఆమె ప్రియుడు రాజ్ కుశ్వాహా సహా ఐదుగురు నిందితులపై పోలీసులు అభియోగాలు మోపారు. ప్రస్తుతం ఆ ఐదుగురు నిందితులు జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఈ కేసులో మరిన్ని ఫోరెన్సిక్ రిపోర్టులు అందిన తర్వాత మరో ముగ్గురు సహ నిందితులపై అనుబంధ ఛార్జిషీట్ దాఖలు చేయనున్నట్లు సిట్ వెల్లడించింది. సోనమ్‌ను ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా ఉంది. హత్య అనంతరం 17 రోజులపాటు సోనమ్ దాగివున్న భవన యజమానిని కూడా ఈ కేసులో నిందితుడిగా చేర్చారు. ఈ ఛార్జిషీట్‌ను పరిశీలించిన తర్వాత కోర్టు ఈ కేసులో తదుపరి విచారణ జరపనుంది. కాగా మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన రాజా రఘువంశీ కుటుంబం ట్రాన్స్‌పోర్టు వ్యాపారం చేస్తోంది. ఈ ఏడాది మే 11న అతడికి సోనమ్‌తో వివాహం జరిగింది. ప్రియుడి కోసం భర్త హత్యకు ప్లాన్ చేసిన సోనమ్ రఘువంశీ మే 20న హనీమూన్ పేరుతో భర్తను మేఘాలయకు తీసుకెళ్లింది. అక్కడ మే 22న రాజా రఘువంశీని ప్రియుడి స్నేహితులతో హత్య చేయించింది. తర్వాత నిందితులు ఇండోర్ వచ్చి ఎవరి ఇళ్లకు వాళ్లు వెళ్లారు. సోనమ్‌ను ఆమె ప్రియుడు కుశ్వాహా ఓ అద్దె ఇంట్లో ఉంచాడు. హనీమూన్‌కు వెళ్లిన కొడుకు, కోడలు తిరిగి రాకపోవడంతో రఘువంశీ కుటుంబ సభ్యులు మిస్సింగ్ కేసు పెట్టారు. ఈ క్రమంలోనే అదృశ్యమైన 11 రోజుల తర్వాత అంటే జూన్ 1న సోహ్రాలోని ఓ జలపాతం సమీపంలోగల లోతైన లోయలో పోలీసులు రాజారఘువంశీ మృతదేహాన్ని గుర్తించారు. అతడి శరీరంపై కత్తి గాయాలు ఉండటంతో పోలీసులు హత్యగా అనుమానించారు. అనంతరం సోనమ్ కోసం గాలించగా ఉన్నట్టుండి జూన్ 7న ఉత్తరప్రదేశ్‌లోని గాజీపుర్‌లో ప్రత్యక్షమైంది. ఎవరో తన కిడ్నాప్ చేసి ఘాజీపూర్‌లో వదిలివెళ్లినట్లు నాటకం ఆడింది. కానీ పోలీసులు అప్పటికే తమకు లభించిన ఆధారాల ఆధారంగా తమదైన శైలిలో ప్రశ్నించడంతో నేరం ఒప్పుకుంది. ప్రియుడితో కలిసి తానే తన భర్తను హత్య చేయించినట్లు చెప్పింది.

# స్నేహితుడిపై పగతీర్చుకోడానికే బాంబు బెదరింపులు చేసా!

## ముంబయి ఆర్డీఎక్స్, మానవబాంబుల బెదరింపుల వ్యక్తి అరెస్ట్

**ముంబయి, సెప్టెంబరు 7 :** దేశ ఆర్థిక రాజధాని ముంబైకి ఉగ్ర బెదిరింపులు కలకలం రేపిన విషయం తెలిసిందే. ముంబై నగరమంతా మానవ బాంబులను మోహరించామని, వారు 400 కిలోల ఆర్డీఎక్స్‌తో కోటి మందిని చంపేస్తారంటూ వచ్చిన ఒక బెదిరింపు హెచ్చరిక ముంబై పోలీస్ యంత్రాంగాన్ని పరుగులు పెట్టించింది. వినాయక నిమజ్జనం వేళ ఈ బెదిరింపు మెయిల్ రావడంతో ముంబై పోలీసులు హై అలర్ట్ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ బెదిరింపులపై దర్యాప్తు చేపట్టిన అధికారులు తాజాగా ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. నిందితుడు బీహార్‌లోని పాటలీపుత్రకు చెందిన అశ్విన్ కుమార్‌గా గుర్తించారు. అతడిని నోయిడాలో అదుపులోకి తీసుకున్నారు. తన స్నేహితుడిపై ప్రతీకారం తీర్చుకునేందుకు ఈ బెదిరింపులకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. ఫిరోజ్ అనే వ్యక్తి తనపై 2023లో కేసు పెట్టాడని, దీంతో మూడు నెలలు జైలు శిక్ష అనుభవించినట్లు నిందితుడు తెలిపాడు. దీంతో కోపంతో రగిలిపోయిన అతడు దీనికి ప్రతీకారంగానే ఈ నకిలీ బెదిరింపులకు పాల్పడినట్లు చెప్పాడు. ఈ మేరకు నిందితుడి నుంచి ఏడు మొబైల్ ఫోన్స్, మూడు సిమ్ కార్డ్స్, ఆరు మెమరీ కార్డ్స్ తదితర వస్తువులు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ముంబై ట్రాఫిక్ కంట్రోల్ రూమ్ అధికార వాట్సాప్ నంబర్‌కు ఈ బాంబు బెదిరింపు మెసేజ్ వచ్చింది. తాము పాకిస్థాన్‌కు చెందిన లష్కరే జీహాదీ గ్రూప్‌నకు చెందిన వారమని, 14 మంది ఉగ్రవాదులు నగరంలోకి ప్రవేశించారని, అనంత చతుర్దశి సందర్భంగా నగరంలోని 34 చోట్ల 34 మానవ బాంబులను మోహరించామని అందులో తెలిపారు. మానవ బాంబులతో కూడిన పలు వాహనాలను ముంబై నగరమంతా మోహరించామని, వారి వద్ద ఉన్న 400 కేజీల ఆర్డీఎక్స్ వల్ల కోటి మంది మరణిస్తారని మెసేజ్‌లో బెదిరించారు.

# ఆపరేషన్ సిందూర్ 3 రోజులే కాదు..

## ఆర్మీ చీఫ్ జనరల్ అనిల్ చౌహాన్ సంచలన ప్రకటన



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 7 :** జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం మే 7న చేపట్టిన ఆపరేషన్ సిందూర్ కేవలం మూడు రోజుల్లో ముగిసిపోలేదని, చాలా కాలం పాటు కొనసాగిందని ఆర్మీచీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది సంచలన ప్రకటనచేసారు. ఆయన స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో జరిగిన ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మే 10 నాటికి ఆపరేషన్ ముగిసిందని మీరు అనుకోవచ్చు. కానీ అది నిజం కాదు. ఆ తర్వాత కూడా ఇది చాలా కాలం పాటు కొనసాగింది. ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చింది. దీనికి మించి మరిన్ని వివరాలు ఇక్కడ పంచుకోవడం కష్టమని జనరల్ ద్వివేది వివరించారు. నియంత్రణ రేఖ వెంబడి పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదం ఇంకా అంతం కాలేదని, చొరబాట్ల ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయని ఆయన తెలిపారు. ఆపరేషన్ సిందూర్ ప్రభావంపై ఇప్పుడే ఒక అంచనాకు రావడం తొందరపాటు అవుతుంది. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం ఆగిపోయిందా నాకైతే అలా అనిపించడం లేదు. ఎంతమంది ఉగ్రవాదులు హతమయ్యారో, ఎంతమంది తప్పించుకున్నారో మనందరికీ తెలుసని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్ యుద్ధ వ్యూహాల్లో భాగంగా సైన్యంలో థియేటరైజేషన్ (త్రివిధ దళాల ఏకీకరణ) కచ్చితంగా జరిగి తీరుతుందని జనరల్ ద్వివేది స్పష్టం చేశారు. థియేటరైజేషన్ ఈరోజో, రేపో జరగడం ఖాయం. ఎంత సమయం పడుతుందన్నదే ప్రశ్న. ఆధునిక యుద్ధాల్లో సైన్యంతో పాటు సివిల్, సైబర్ వంటి ఎన్నో విభాగాలు పనిచేయాల్సి ఉంటుంది. వీటన్నింటినీ సమన్వయం చేయాలంటే ఏకీకృత కమాండ్ తప్పనిసరని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటీవల ప్రభుత్వం డ్రోన్లపై జీఎస్టీని 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించడాన్ని ఆయన స్వాగతించారు. ఈ నిర్ణయం సైనిక ఆధునికీకరణకు ఎంతో దోహదపడుతుందని, దీనివల్ల పెద్ద ఎత్తున డ్రోన్లను కొనుగోలు చేసే అవకాశం కలుగుతుందని అన్నారు.

ఈ సంస్కరణలతో డిఫెన్స్ కారిడార్లు బలపడతాయని, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ), స్టార్టప్‌లకు ప్రోత్సాహం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు చెన్నైలో జరిగిన కార్యక్రమంలో ఎయిర్ చీఫ్ మార్షల్ సింగ్ అమర్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌లో త్రివిధ దళాలు, ఇతర ఏజెన్సీల మధ్య అద్భుతమైన సమన్వయం కనిపించిందని ప్రశంసించారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని ఆయన యువ అధికారులకు పిలుపునిచ్చారు.



# న్యాయవ్యవస్థలోకి 'రోబోజడ్జి'లు!

## నరేంద్రమోడీ ప్రభుత్వం వినూత్న నిర్ణయం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 7 :** దేశంలోని న్యాయ వ్యవస్థలో పేరుకుపోయిన కోట్ల కొద్దీ కేసులకు పరిష్కారం చూపే దిశగా నరేంద్ర మోదీ ప్రభుత్వం ఒక విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. చిన్నపాటి నేరాలు, భూ వివాదాలు వంటి సాధారణ కేసుల్లో తీర్పులను వేగవంతం చేసేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీని ప్రవేశపెట్టనుంది. రోబో జడ్జిలుగా పిలుస్తున్న ఈ కొత్త విధానం, భారత న్యాయ వ్యవస్థ రూపురేఖలనే మార్చే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. రోబో జడ్జి అంటే న్యాయమూర్తి స్థానంలో ఒక రోబో కూర్చుని తీర్పులు చెప్పడం కాదు. కేసులకు సంబంధించిన సమాచారం, పాత రికార్డులు, గతంలో వెలువడిన తీర్పులు వంటి వాటిని ఏఐ టెక్నాలజీ వేగంగా విశ్లేషిస్తుంది. ఈ సమాచారం ఆధారంగా న్యాయమూర్తులు త్వరితగతిన ఒక నిర్ణయానికి రావడానికి ఇది సహాయపడుతుంది. ముఖ్యంగా ట్రాఫిక్ ఉల్లంఘనలు, చిన్నపాటి దొంగతనాలు, భూ తగాదాలు వంటి కేసుల విచారణలో ఈ విధానాన్ని ఉపయోగించనున్నారు. దీని ప్రధాన ఉద్దేశం మానవ న్యాయమూర్తులను తొలగించడం కాదు, వారికి సహాయకారిగా ఉంటూ న్యాయ ప్రక్రియను వేగవంతం చేయడమే. విదేశాల్లో జడ్జిలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారుకూడా. ఈ ప్రయోగాన్ని విజయవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించింది. జిల్లా, సెషన్స్ కోర్టుల న్యాయమూర్తులకు ఏఐ వాడకంపై ప్రత్యేక శిక్షణ ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే రెండు బృందాలుగా సుమారు 70 నుంచి 80 మంది ఐసీటీ (సమాచార, కమ్యూనికేషన్ టెక్నాలజీ) అధికారులు, న్యాయమూర్తులు సింగపూర్‌లో శిక్షణ పూర్తి చేసుకున్నారు.

ఎస్టోనియా, చైనా వంటి దేశాల్లో విజయవంతమైన ఏఐ నమూనాలను అధ్యయనం చేసి, మన దేశ న్యాయ వ్యవస్థకు అనుగుణంగా ఒక స్వదేశీ వ్యవస్థను నిర్మించడం ఈ శిక్షణ లక్ష్యం. ఈ కార్యక్రమాన్ని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (ఐఐపీఏ) పర్యవేక్షిస్తోంది. ప్రస్తుతం దేశంలోని దిగువ కోర్టుల్లో సుమారు 3.6 కోట్లకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ భారాన్ని తగ్గించేందుకు ఏఐ టెక్నాలజీ ఎంతగానో దోహదపడుతుందని ప్రభుత్వం విశ్వసిస్తోంది. పైలట్ ప్రాజెక్టులు చేపట్టిన ఢిల్లీ, బెంగళూరు, ముంబై వంటి నగరాల్లో కేసుల విచారణ సమయం 30 శాతం వరకు మెరుగుపడినట్లు న్యాయశాఖ అధ్యయనంలో తేలింది. అదేవిధంగా, ఏఐ ఆధారిత డిజిటల్ వ్యవస్థలు వాడిన కోర్టుల్లో రెండేళ్లలో పెండింగ్ కేసులు 15నుంచి 20 శాతం తగ్గినట్లు నేషనల్ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ (ఎన్‌జేడీజీ) నివేదికలు చెబుతున్నాయి. ప్రపంచం టెక్నాలజీ వైపు పరుగులు పెడుతున్నప్పుడు మనం వెనుకబడి ఉండలేమని, న్యాయ వ్యవస్థలో ఏఐ ప్రవేశం అనివార్యమని ఓ సీనియర్ అధికారి వ్యాఖ్యానించారు. రానున్న రోజుల్లో రోబో జడ్జి అనేది కేవలం ఒక ఆలోచనగా కాకుండా, భారత న్యాయస్థానాల్లో వాస్తవరూపం దాల్చనుంది.

# డిస్కౌంట్ ఆఫర్‌లో సిఎం సిద్దరామయ్య

## ట్రాఫిక్ జరిమానాలు చెల్లింపు

**బెంగళూరు, సెప్టెంబరు 7 :** కర్ణాటక ముఖ్య మంత్రి సిద్ధరామయ్య తాను ప్రయాణించే వాహనంపై ఉన్న పెండింగ్ చలానాలను రాయితీతో చెల్లించారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై వాహనదారులకు ఊరటనిస్తూ కర్ణాటక ప్రభుత్వం ఇటీవల 50 శాతం రాయితీ పథకాన్ని ప్రకటించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కూడా ఈ పథకాన్ని ఉపయోగించుకుని జరిమానా చెల్లించారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రయాణించే వాహనంపై మొత్తం ఏడు ట్రాఫిక్ ఉల్లంఘనలు నమోదయ్యాయి. వాటిలో సీటు బెల్టు ధరించనందుకు ఆరుసార్లు, అతివేగం కారణంగా ఒకసారి చలానా విధించారు. అయితే, ముఖ్యమంత్రి వాహనానికి జరిమానా ఉన్నప్పటికీ చెల్లించలేదంటూ సామాజిక మాధ్యమాల్లో చర్చ జరిగింది. దీనితో ముఖ్యమంత్రి కార్యాలయ సిబ్బంది స్పందించి, రాయితీ పథకం ద్వారా చలానా చెల్లించారు. రాయితీ మినహాయించి రూ. 8,750 చెల్లించారు. ట్రాఫిక్ చలానాల రాయితీ పథకాన్ని ఆగస్టు 21 నుంచి సెప్టెంబర్ 19 వరకు ప్రభుత్వం ప్రకటించింది. జరిమానాకు గురైన వాహనదారులు 50 శాతం చెల్లిస్తే మిగిలిన మొత్తాన్ని మాఫీ చేస్తామని తెలిపింది.

# భారత్‌లో పెరుగుతున్న వృద్ధతరం

## - పడిపోతున్న పునరుత్పత్తిరేటు - తక్షణ కార్యాచరణ చేపట్టాలని నిపుణుల హెచ్చరికలు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 7:** ఆసియాలోనే అగ్రరాజ్యం అయిన చైనాలో వృద్ధజనాభా పెరుగు తుండటంపై ఆదేశం ఆందోళన వ్యక్తంచేస్తున్నట్లు గానే మన దేశ జనాభాలోకూడా వృద్ధుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. ఇందుకోసమే ఇపుడు ప్రతి కుటుంబంలోను నవ దంపతులు కనీసం ముగ్గురుపిల్లల్ని కనాలని రాష్ట్రాల ముఖ్య మంత్రులుసైతం ఇపుడు బహిరంగంగానే ప్రోత్సహిస్తున్నారు. కొన్ని ప్రభుత్వాలయితే ఇక్రిమెంట్లు, పారితోషికాలు, ప్రోత్సాహకాలు ప్రకటిస్తున్నాయి. అర్థగణాంకశాఖ వివరాలను పరికిస్తే ప్రతి పది మందిలో ఒకరు 60 ఏళ్ల పైబడిన వారు ఉన్నారు. నమూనా నమోదు సిస్టం 2023 నివేదిక ఇటీవల ఆ గణాంకాలను వెల్లడించింది. పడిపోతున్న జననాల రేటు, పెరుగుతున్న ఆయుర్దాయంతో వయో వృద్ధ భారతంగా దేశం మారుతోందని నిపుణులు చెబుతున్నారు. వయోధికుల ఆరోగ్య సంరక్షణ, పింఛన్లు, సామాజిక భద్రత విషయంలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నివేదిక ప్రకారం దేశ జనాభాలో ప్రస్తుతం 60 ఏళ్లు పైబడ్డ వృద్ధులు 9.7 శాతంగా ఉన్నారు. 2011లో అది 8.6గా మాత్రమే ఉంది. 65 ఏళ్లు పైబడ్డ వారిలో పెరుగుదల 6.4 శాతంగా నమోదైంది. 60 ఏళ్లు పైబడిన వయోధికుల జనాభాలో కేరళ 15 శాతంతో అన్ని రాష్ట్రాల కంటే ముందు ఉంది. ఆ తర్వాత స్థానాల్లో తమిళనాడు, హిమాచల్, పంజాబ్, మహారాష్ట్ర వృద్ధుల జనాభా జాతీయ సగటు 9.7% కంటే ఎక్కువ ఉంది. ఇక బీహార్, మధ్యప్రదేశ్, యూపీ, జార్ఖండ్ రాష్ట్రాల్లో వయోధికుల జనాభా 8 లోపే ఉంది. అంటే ఈ రాష్ట్రాల్లో జనాభా వృద్ధి బాగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. దక్షిణ, పశ్చిమ భారత రాష్ట్రాల్లో జనాభా తగ్గుముఖం పట్టింది. వృద్ధుల జనాభా పెరుగుదలకు రెండు ప్రధాన కారణాలు కనిపిస్తున్నాయి. ఒకటి, మొత్తం పునరుత్పత్తి రేటు జనాభా భర్తీ స్థాయి 2.1 కంటే తగ్గి పోవడం, ఆయుష్షు పురుషులకు 68.5 ఏళ్లకు, మహిళలకు 72.5 ఏళ్లకు పెరగడం. పునరుత్పత్తిరేటు తగ్గడం వల్ల జనాభాలో పిల్లల సంఖ్య తగ్గిపోతోంది. ఆయుర్దాయం పెరగడం వల్ల వృద్ధుల జనాభా పెరుగుతూపోతోంది. దేశంలో తక్కువ మంది ప్రజలు మాత్రమే శ్రామిక శక్తిగా ఉంటారు. యువత ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు ఆర్థిక ప్రగతి సాధిస్తాయి. వృద్ధ జనాభా ఎక్కువ ఉన్న రాష్ట్రాల్లో శ్రామిక శక్తి తక్కువగా ఉండటం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయి. సంప్రదాయ ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయి. వృద్ధులు ఒంటరిగా మిగిలిపోయి ప్రభుత్వం పైనో, సేవా సంస్థలపైనో ఆధారపడాల్సి వస్తోంది. ఇప్పటికీ దేశంలో యువ జనాభా ఎక్కువగానే ఉన్నా వృద్ధ జనాభాలో పెరుగుదల, పిల్లల జనాభా తగ్గుదల ఓ హెచ్చరికగా నిపుణులు చెబుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే వృద్ధుల జనాభా అధికంగా ఉన్న చైనా, జపాన్, యూరప్ దేశాల సరసన భారత్ కూడా చేరడానికి ఎంతో సమయం పట్టదు. వృద్ధులకు సదుపాయాలు కల్పిస్తూనే, యువ జనాభా పెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఆరోగ్య రంగ నిపుణులు ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు.

# అన్నాడిఎంకె సీనియర్‌నేత సెంగొట్టియన్‌పై క్రమశిక్షణ వేటు!



**మదురై, సెప్టెంబరు 7 :** అన్నాడీఎంకేలో విభేదాలు ముదిరాయి. పార్టీ సీనియర్ నేత, శాసనసభ్యుడు కేఏ సెంగోట్టియన్‌ను పార్టీ పదవుల నుంచి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి శనివారంనాడు తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలు తక్షణం అమల్లోకి వచ్చాయి. సెంగోట్టియన్ ప్రస్తుతం ఈరోడ్ సబర్బన్ వెస్ట్ డిస్ట్రిక్‌కు జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ, జిల్లా సెక్రటరీగా ఉన్నారు. పార్టీ సీనియర్ నేతలు, మాజీ మంత్రులతో దిండిగల్‌లోని ఓ హోటల్‌లో పళనిస్వామి శనివారం ఉదయం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో సెంగోట్టియన్‌ను పార్టీ పదవుల నుంచి తొలగించాలని నిర్ణయం తీసుకున్నారు. పళనిస్వామిని కలిసిన వారిలో మాజీ మంత్రులు దిండిగల్ శ్రీనివాసన్, నాథం విశ్వనాథన్, కేపీ మునుసామి, ఎస్పీ వేలుమణి, కామరాజ్, ఓసీ మణియన్, విజయభాస్కర్ తదితరులు ఉన్నారు. అన్నాడీఎంకే అధిష్ఠానవర్గం పార్టీ పదవుల నుంచి తనను తప్పించడంపై సెంగోట్టియన్ సంతోషం వ్యక్తం చేసారు. ఐ యామ్ హ్యాపీ అని చెప్పారు. వీకే శశికళ, ఓ పన్నీర్ సెల్వం, టీటీవీ దినకరన్‌తో సహా బహిష్కృత నేతలందరినీ తిరిగి పార్టీలోకి తీసుకోవాలని సెంగోట్టియన్ డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికల్లో పార్టీ విజయం సాధించాలంటే ఈ చర్య తప్పనిసరని ముందురోజుమీడియాతో మాట్లాడుతూ ఆయన అన్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తర్వాత కూడా పార్టీ సీనియర్ నేతలు ఈపీఎస్‌ను కలిసి పార్టీని వీడిన వారిని వెనక్కి తీసుకురావాలని కోరామని, అయినప్పటికీ తమ సలహాను ఈపీఎస్ ఖాతరు చేయలేదని అన్నారు. ఐక్య అన్నాడీఎంకే కోసం తాను కృషి చేస్తున్నానని, 2016 నుంచి ఏ ఎన్నికలు తమకు అనుకూలంగా రాలేదని చెప్పారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకుని ఉంటే తమకు 30 సీట్లు వచ్చేవని అన్నారు. బహిష్కృత నేతలను తిరిగి పార్టీలోకి తీసుకుంటేనే అన్నాడీఎంకే ఈసారి ఎన్నికల్లో గెలుస్తుందని కుండబద్ధలు కొట్టారు.




# బ్రిటన్ హోంమంత్రిగా షబానా మహమూద్

**లండన్, సెప్టెంబరు 7 :** బ్రిటన్ రాజకీయాల్లో ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. దేశ హోం మంత్రి (హోం సెక్రటరీ) పదవిని తొలిసారిగా ఒక ముస్లిం మహిళ చేపట్టారు. పాకిస్థాన్ మూలాలున్న షబానా మహమూద్‌కు ప్రధాని కీర్ స్టార్మర్ హోంశాఖ బాధ్యతలు అప్పగించారు. ప్రధాని తన మంత్రివర్గంలో చేపట్టిన పునర్వ్యవస్థీకరణలో భాగంగా షబానాను ఈ పదవిలో నియమించారు. ఏంజెలా రేనర్ రాజీనామా అనంతరం య్వెట్ కూపర్ స్థానంలో ఆమె బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ నియామకంతో దేశ అంతర్గత భద్రత, వలస విధానాలు, పోలీసింగ్ వంటి అత్యంత కీలకమైన విభాగాలు షబానా పర్యవేక్షణలోకి వస్తాయి. ప్రస్తుతం దేశం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలో ఆమె నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది. ఎవరీ షబానా మహమూద్ తల్లిదండ్రులు పాకిస్థాన్ నుంచి బ్రిటన్‌కు వలస వచ్చారు.

# సంక్షిప్తంగా..

## అక్టోబర్ 5 వరకు ముంబయిలో డ్రోన్లపై నిషేధం



**ముంబయి, సెప్టెంబరు 7 :** వినాయక నిమజ్జనాలు కొనసాగుతున్న వేళ ముంబయి పోలీసులు కీలక ఆదేశాలు జారీ చేశారు. భద్రతా పరమైన ఆందోళన కారణంగా ముంబయి వీధుల్లో డ్రోన్లు, పారా గ్లైడర్లు, రిమోట్ కంట్రోల్‌తో నడిచే మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, హాట్ ఎయిర్‌బెలూన్లు ఎగుర వేయడంపై నిషేధం విధించారు. సెప్టెంబర్6 నుంచి అక్టోబర్ 5 వరకు మొత్తం 30 రోజులు ఈ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయని అధికారులు వెల్లడించారు. వినాయక నిమజ్జనాలు కొనసాగుతుండడం, త్వరలో దసరా నవరాత్రులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 6న నిమజ్జనం సందర్భంగా నగరంలో భారీ జనసమూహం ఉంటుందని అంచనావేశారు. దీంతో నగరంలో శాంతి భద్రతలను రక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఇందులో భాగంగా పలు ప్రధాన ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు చేసినట్లు తెలిపారు. డ్రోన్లు, పారాగ్లైడర్లు వంటి ఎగిరే వస్తువుల ద్వారా ఎలాంటి విధ్వంసం జరగకుండా ఈ ఆంక్షలు విధించామన్నారు.

## ట్రంప్, మోడీల మధ్య బలమైన మైత్రీబంధం: జైశంకర్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 7 :** భారత్‌అమెరికా మధ్య వాణిజ్యపరమైన ఉద్రిక్తతలు నెలకొన్నప్పటికీ, ప్రధాని నరేంద్ర మోడీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య వ్యక్తిగత సంబంధాలు బలంగా ఉన్నాయని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. ఇరు దేశాల మధ్య కొన్ని సమస్యలు ఉన్నప్పటికీ, ఇరువురు అగ్రనేతల స్నేహబంధంపై ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అమెరికాతో మన భాగస్వామ్యానికి ప్రధాని మోడీ ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. అధ్యక్షుడు ట్రంప్‌తో ప్రధానికి ఎప్పుడూ మంచి వ్యక్తిగత సంబంధాలు ఉన్నాయని ఆయన తెలిపారు. అమెరికాతో చర్చలు నిరంతరం కొనసాగుతాయని, ప్రస్తుతానికి ఇంతకంటే ఎక్కువ చెప్పలేనని జైశంకర్ పేర్కొన్నారు. ఇటీవల అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రధాని మోడీని తన మిత్రుడు , గొప్ప ప్రధాని అని ప్రశంసించారు.
దీనికి ప్రధాని మోదీ కూడా సానుకూలంగా స్పందించారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే జైశంకర్ తాజా వ్యాఖ్యలు చేశారు.

## ఉత్తరప్రదేశ్‌లోని మేరఠ్‌లో న్యూడ్‌గ్యాంగ్..



**లక్నో, సెప్టెంబరు 7 :** ఉత్తరప్రదేశ్‌లోని మేరఠ్‌లో న్యూడ్‌గ్యాంగ్ హల్‌చల్ చేస్తుండడంతో అక్కడి ప్రజలు హడలెత్తిపోతున్నారు. కొద్దిరోజులుగా మేరఠ్‌లోని పలు గ్రామాల్లోకి కొందరు పురుషులు నగ్నంగా వచ్చి మహిళలను నిర్జన ప్రాంతాలకు ఈడ్చుకెళుతున్నట్లు అక్కడి వారు తెలిపారు. ఇప్పటికీ నాలుగుసార్లు ఆ ముఠా మహిళలపై దాడి చేసినట్లు పేర్కొన్నారు. ఇటీవల మేరఠ్‌లోని భారాలా గ్రామంలో ఓ మహిళ ఒంటరిగా ఆఫీస్‌కు వెళుతున్న సమయంలో నిర్జన ప్రదేశంలో న్యూడ్‌గ్యాంగ్ ఆమెను పొలంలోకి లాగడానికి యత్నించినట్లు గ్రామస్తులు తెలిపారు. బాధిత మహిళ కేకలు వేయడంతో వారు అక్కడి నుంచి పారిపోయారన్నారు. స్థానికంగా వారి కోసం గాలించినా ఎవరూ కని పించలేదని అన్నారు. అయి తే తనను లాక్కెళ్లడానికి యత్నించిన వ్యక్తులు ఎటు వంటి దుస్తులు ధరించ లేదని బాధత మహిళ పేర్కొంది.

## ఇమ్రాన్ సోదరిపై కోడిగుడ్డు విసిరిన సొంతపార్టీనేత



**రావల్పిండి, సెప్టెంబరు 7 :** పాకిస్థాన్ రాజకీయాల్లో ఓ అనూహ్య ఘటన చోటుచేసుకుంది. మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ సోదరి అలీమా ఖానుమ్‌పై సొంత పార్టీకి చెందిన ఓ మహిళ కోడిగుడ్డుతో దాడి చేయడం సంచలనంగా మారింది. రావల్పిండిలోని ఆడియాలా జైలు వెలుపల ఈ సంఘటన జరిగింది. తో షాఖానా కేసుకు సంబంధించి ఆడియాలా జైలు లో జరుగుతున్న విచారణకు అలీమా ఖానుమ్ హాజరయ్యారు. విచారణ ముగిసిన అనంతరం ఆమె జైలు బయట మీడియా ప్రతినిధులతో మాట్లాడుతున్నారు. అదేసమయంలో, జనంలోంచి వచ్చిన ఓ మహిళ ఆమెపైకి కోడిగుడ్డు విసిరింది. ఈ పరిణామంతో అక్కడున్న వారంతా షాక్‌కు గురయ్యారు.దాడి జరిగిన వెంటనే అలీమా పక్కనే ఉన్న ఓ మహిళ ఎవరు ఈ పని చేసిందంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, అలీమా ఖానుమ్ మాత్రం ఎంతో సంయమనంతో స్పందించారు.

# మహేశ్‌కుమార్‌ను అభినందించిన రేవంత్‌రెడ్డి

## సిఎంను మర్యాదపూర్వకంగా కలిసిన పిసిసి ప్రెసిడెంట్

**హైదరాబాద్**, సెప్టెంబరు 7 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణలో కాంగ్రెస్‌పార్టీని సంస్థాగతం అభివృద్ధిచేయడంతో పాటు ప్రభుత్వానికి పార్టీకి అనుసంధానకర్తగా టిపిసిసి ప్రెసిడెంట్ బొమ్మ మహేష్‌కుమార్ పనిచేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. శనివారం మహేష్ కుమార్ గౌడ్ టిపిసిసి అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటికి వెళ్ళి మర్యాద పూర్వకంగా కలిశారు.పిసిసి చీఫ్‌ను సిఎం శాలువా కప్పి అభినందించారు. స్థానిక సంస్థల ఎన్నికలు,బిసి రిజర్వేషన్‌తోపాటు,రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు తెలిసింది.

కామారెడ్డి జిల్లాలో ఈనెల 15న తలపెట్టిన భారీ బహిరంగ సభ పైకూడా సమాలోచనలు చేశారని కాంగ్రెస్‌వర్గాలు వివరించాయి. రానున్న పదిరోజుల్లో గ్రామ,మండల జిల్లా కమిటీలు ప్రకటించబోతుండటంతో అన్ని కమిటీల కూర్పు విధివిధానాలపై కూడా వారిరువు చర్చించారు.

టిపిసిసి సంస్థాగత నిర్మాణం కానప్పటికి పార్టీ బలోపేతం చేయడానికి పార్టీ ఇంచార్జీ మీనాక్షి నటరాజన్‌తో చేసిన పాదయాత్ర అంశాలను,జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేయడానికి ఉత్సాహం చూపే ఔత్సాహికుల సంఖ్య పెరుగుతుండటంతో వాటిపై కూడా వారిరువురు? చర్చించినట్లు తెలిసింది.

### నామినేటెడ్ పదవులు ఇవ్వండి: మాజీ ఎంపి విహెచ్

తెలంగాణ పిసిసి అధ్యక్షుడిగా ఏడాది పూర్తి చేసుకున్న బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌కు సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ ఎంపి వి.హనుమంతరావు అభినం దించారు. రానున్న రోజులో మహేశ్‌గౌడ్ ఆద్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం కావాలని, అందుకోసం తన వంతు పూర్తి సహకారం ఉంటుంది అని వి.హెచ్. హామి ఇచ్చారు. కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ తరఫున పోరాటం చేసిన కార్యకర్తలకు రానున్న రోజుల్లో వివిధ పార్టీ మరియు నామినేటెడ్ పదవిలో తగ్గిన గుర్తింపును ఇవ్వాలని సూచించారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి చేయాలనే లక్ష్యంతో పూనుకోవాలని అన్నారు.

### ప్రతికార్యకర్తకు భరోసా ఇచ్చిన మహేశ్ కుమార్‌గౌడ్: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

"పిసిసి అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్ పార్టీ సంస్థాగత బలోపేతానికి చేపట్టిన చర్యలు ప్రతి కార్యకర్తకు భరోసాను పెంపొందించేలా చేశాయని పాదయాత్ర నుంచి మొదలుకొని ప్రజాసమస్యల దాక ప్రతి ఉద్య మంలో మీరు పోరాట పటిమ కనబరిచిన తీరు కార్యకర్తలకు స్ఫూర్తిదాయకంగా ఉందని ఆయన మహేశ్‌కుమార్‌ను అభినందించారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నాయకత్వంలో మీ మార్గదర్శకంలో కాంగ్రెస్‌పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఎక్స్ వేదికపై ట్వీట్ చేస్తూ అభినందించారు.

# జాతీయ చిహ్నాన్ని దుర్వినియోగపరచిన బిజెపి

## సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

**హైదరాబాద్**, సెప్టెంబరు 7 (జర్నలిస్ట్ ఫైల్) : జాతీయ చిహ్నాన్ని భారతీయ జనతా పార్టీ(బిజెపి) దుర్వినియోగం చేస్తోందని భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ విమర్శించారు. హజ్రత్‌బాల్ మందిరంలో బిజెపి.. జాతీయ చిహ్నాన్ని దుర్వినియోగం చేయడాన్ని సిపిఐ ఖండిస్తుందన్నారు. బిజెపి తనరాజకీయ లాభం కోసం జాతీయ చిహ్నాలను దుర్వినియోగం చేయడానికి బిజెపి చేసిన ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జమ్మూ అండ్‌కాశ్మీర్ వక్ఫ్ బోర్డు ఛైర్‌పర్సన్, బిజెపి నాయకురాలు డాక్టర్ దరక్షన్ అంద్రాబి ఇటీవల హజ్రత్‌బాల్ మందిరంలో ఒక ఫలకాన్ని ప్రారంభించారని.. ఆ ఫలకంపై భారత జాతీయ చిహ్నంతో పాటు ఆమె పేరు కూడా ఉందని నారాయణ అన్నారు. జాతీయ చిహ్నాల ముసుగులో బిజెపి పక్షపాత ప్రచారాన్ని ప్రదర్శించడానికి పవిత్ర మత స్థలాన్ని ఉద్దేశపూర్వకంగా రాజకీయంగా ఉపయోగించే చర్యగా అభివర్ణించారు. జాతీయ చిహ్నం గణతంత్రం యొక్క సామూహిక గౌరవాన్ని సూచిస్తుందని.. దానిని వ్యక్తిగత కీర్తింపు రాజకీయ తారుమారు సాధనంగా ఎప్పటికీ తగ్గించకూడదన్నారు. ఇటువంటి చర్యను వ్యతిరేకించిన వారిని బిజెపి నాయకత్వం 'ఉగ్రవాదులు'గా ముద్ర వేస్తుందని, ప్రజాస్వామ్య అసమ్మతిని నేరంగా పరిగణించి, ప్రజల నిరసన వాక్కును నిశ్శబ్దం చేసే ప్రయత్నాన్ని సిపిఐ తీవ్రంగా ఖండిస్తుందన్నారు.

# తొలగించిన జెఎంఇటిల పునర్నియామకం

## సింగరేణి ఉత్తర్వులు

**హైదరాబాద్**, సెప్టెంబరు 7 (జర్నలిస్ట్ ఫైల్) : సింగరేణి కాలరీస్‌లో జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రైనీలుగా (జేఎంఈటీ) పనిచేస్తున్న పలువురిని తొలగించిన యాజమాన్యం తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు చర్యలు చేపట్టింది. వివిధ కారణాలతో టర్మినేట్ అయిన 43 మంది జేఎంఈటీ ఉద్యోగులను పునర్నియామకం చేస్తూ సింగరేణి యాజమాన్యం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో వీరంతా విధులకు గైర్హాజరు కావడం, అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించకపోవడం వంటి కారణాలతో విధుల నుంచి తొలగించడం జరిగింది. అయితే వీరిని తిరిగి విధుల్లోకి తీసుకునే అంశంపై ఇటీవల డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్, సింగరేణి యాజమాన్యం, గుర్తింపు కార్మిక సంఘంకు మధ్య త్రైపాక్షిక ఒప్పందం జరిగింది.ఈ నేపథ్యంలో వీరిని తిరిగి విధుల్లోకి తీసుకోవడానికి వీలుగా యాజమాన్యం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. వీరంతా సంస్థ ఏర్పాటు చేసే హై పవర్ కమిటీ ముందుకు వెళ్లి తమ వివరాలు, ఓవర్ మెన్ సర్టిఫికెట్, గ్యాస్ టెస్టింగ్ ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్లు తదితర వాటిని సమర్పించాల్సి ఉంటుంది. అనంతరం కమిటీ సూచన మేరకు మెడికల్ ఫిట్ నెస్ పరీక్షలకు హాజరవ్వాలి. దాని ఆధారంగా ప్రాథమిక అపాయింట్మెంట్ ఆర్డర్లు జారీ చేస్తారు. ఇక తిరిగి ఉద్యోగంలో చేరిన జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రైనీలు తమ తొలి ఏడాది తప్పనిసరిగా కనీసం 190 మస్టర్లకు తగ్గకుండా విధులు నిర్వహించాల్సి ఉంటుంది.

# కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టులో అధికారులకు లోకాయుక్త నోటీసు

**హైదరాబాద్**, సెప్టెంబరు 7(జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు (కేటీపీపీ) భూసేకరణలో అవకతవకలు జరిగాయని నిర్వాసితులు చేసిన ఫిర్యాదుపై లోకాయుక్త విచారణ చేపట్టింది. ఈ విషయంపై బాధితులు గత నెల 4న లోకాయక్తను ఆశ్రయించగా కేసు నమోదు చేసిన సంస్థ వివరణ ఇవ్వాలని తాజాగా అధికారులకు నోటీసు జారీ చేసింది. ఇందులో తెలంగాణ జెన్కో మాజీ సీఎండీ, ప్రస్తుత కలెక్టర్, జెన్‌కో సివిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, మాజీ, ప్రస్తుత చీఫ్ ఇంజనీర్లు తదితరులు ఉన్నారు. భూపాలపల్లి సమీపంలోని చెల్పూర్ రెవెన్యూలో కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు రెండో దశ నిర్మాణం కోసం 2019లో సర్కారు నోటిఫికేషన్ జారీ చేసింది.

2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇస్తామని చెప్పిన అధికారులు ఆ తర్వాత తమకు చెప్పకుండానే 2017 తెలంగాణ భూసేకరణ చట్టాన్ని అనుసరించి స్థలాల సేకరణకు అంగీకరిస్తున్నట్టు తమ నుంచి సంతకాలు తీసుకున్నారని దుబ్బపల్లి గ్రామస్తులు చెబుతున్నారు. ప్రాథమిక ప్రకటనలో ఇచ్చిన బాధితుల పేర్లను డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌లో ప్రకటించినప్పటికీ అవార్డుల జారీలో చాలామంది పేర్లను తొలగించారని విమర్శలు ఉన్నాయి. 2017 చట్టం ప్రకారం ప్రకటించిన అవార్డులో పునరావాసానికి సంబంధించి ఎలాంటి ప్రస్తావన లేకపోవడంతో బాధితులు అధికారుల తీరుపై భగ్గుమంటున్నారు. పరిహారం విషయంలోనూ సంప్రదింపుల సందర్భంగా నిర్ణయించిన మొత్తాన్ని కాకుండా అవార్డు తగ్గించి ప్రకటించడం పట్ల మండిపడుతున్నారు. ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ జాబితాలో మైనర్లను చేర్చాల్సి ఉన్నా.. వారి ప్రస్తావనే లేదని బాధితులు ఆరోపిస్తూ లోకాయుక్తను ఆశ్రయించారు.

# నెరవేరిన పేదల సొంతింటి కల

## ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన మంత్రులు పొంగులేటి, జూపల్లి, వాకిటి శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న గృహనిర్మాణ, ప్రచార, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**నందిగామ**, సెప్టెంబరు 7 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రజలు ఇచ్చిన శక్తి సామర్థ్యాలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రాన్ని సంక్షోభం నుండి సంక్షేమం వైపు.. విధ్వంసం నుండి వికాసం వైపు నడిపిస్తున్నామని గృహ నిర్మాణ రెవెన్యూ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరిలు స్పష్టం చేశారు. నందిగామ మండలం అప్పారెడ్డి గూడలో శనివారం షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఇందిరమ్మ ఇండ్ల నూతన గృహప్రవేశ కార్యక్రమాలను ప్రారంభించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు దుస్తులు పెట్టి వారితో ముఖాముఖి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం అప్పుల ఊబిలోకి కూరుకు పోయిన పేదవారికి సన్న బియ్యం ఇచ్చామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మూడు విడతలుగా ఇస్తామన్నారు. వట్టుదల, కార్యదర్శతకు కష్టపడి పని చేసే మంచి నాయకుడు వీర్లపల్లి శంకర్ దొరకడం అదృష్టంగా భావించాలన్నారు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ బిఆర్ఎస్ కుటుంబ పాలనలో రాష్ట్రం ఆగం, ఆగం చేశారనీ, కాళేశ్వరం పేరుతో కమిషన్లు కాజేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి ఆగం చేశారని, ప్రజాస్వామ్యాన్ని పాతర వేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ దేశానికి శ్రీరామరక్ష అని అన్నారు. రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి వాకిట శ్రీహరి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా పేదల కోసం సన్న బియ్యం పంపిణీ విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ చంద్ర రెడ్డి, ఎమ్మార్వో సైదులు, ఎంపీడీవో సుమతి, ఎంపీఓ తేజ నాయక్, మాజీ ఎంపీపీ ప్రియాంక శివశంకర్‌గౌడ్, మాజీ జెడ్పీటీసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి, ఆయా శాఖల అధికారులు, కాంగ్రెస్ శ్రేణులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సౌత్ ఇండియా బిజినెస్ అవార్డ్స్-2025లో డాక్టర్ సింధూర నారాయణకు అరుదైన గౌరవం!

**హైదరాబాద్**, సెప్టెంబరు 7 (జర్నలిస్ట్ ఫైల్) : విద్యారంగంలో అసాధారణ కృషి, సమర్థ నాయకత్వానికిగాను నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ పి. సింధూర నారాయణ దుబాయ్‌లో అంగరంగ వైభవంగా జరిగిన ప్రతిష్టాత్మక సౌత్ ఇండియా బిజినెస్ అవార్డు(ఎస్ఐబిఏ)-2025ను అందుకున్నారు.



సంస్థ ప్రతినిధులు డాక్టర్ పి. సింధూర నారాయణను అవార్డుతో సత్కరించారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి వేర్వేరు రంగాల్లో రాణిస్తున్న ప్రభావశీల వ్యక్తులను ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. డాక్టర్ పి. సింధూర నారాయణ నాయకత్వంలో నారాయణ విద్యాసంస్థ భారత దేశంలోనే కాకుండా, ఆసియాలోనే అతిపెద్ద విద్యాసంస్థల్లో ఒకటిగా ఎదిగిందని నిర్వాహకులు ప్రశంసించారు. విద్యా ర్థుల, తల్లిదండ్రుల ప్రయోజనాలను కాపాడటంలో ముందుంటూ విద్యారంగంలో విశ్వసనీయతకు చిరునామాగా నిలవటంలో ఆమె కృషిని కొనియాడారు. కార్యక్రమంలో తెలంగాణ కార్మికశాఖ మంత్రి వివేక్, సినీ తారలు శ్రియాశరణ్, మంచు లక్ష్మి పాల్గొన్నారు. పదేళ్లకు పైగా దక్షిణ భారత సినీ రంగంలోని ప్రముఖులను, అగ్రగాములను గౌరవిస్తున్న సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ (ఎస్ఐఐఎంఏ) వారసత్వాన్ని కొనసాగిస్తూ, ఎస్ఐబిఏ వ్యాపార రంగానికి విస్తరించింది. దక్షిణ భారత వ్యాపార రంగంలో ఉన్నత విలువలు, నూతన ఆవిష్కరణలను గుర్తించి ప్రోత్సహించేందుకు సౌత్ ఇండియా బిజినెస్ అవార్డ్స్ (ఎస్ఐబిఏ)ను నెలకొల్పగా, ఈ అవార్డులు ఆర్థికాభివృద్ధి, పురోగతికి విశిష్టమైన కృషి చేసిన పారిశ్రామికవేత్తలు, సంస్థలు, వ్యాపార దక్షత గల నాయకులను వెలుగులోకి తీసుకొచ్చేందుకు నడుంకట్టింది. అవార్డును స్వీకరిస్తూ డాక్టర్ పి. సింధూర నారాయణ మాట్లాడుతూ "ఒక వ్యాపారవేత్తగా, ముందు ఉత్పత్తి తయారు చేసి దానికి మార్కెట్ వెతకడం కంటే, ఉన్న సమస్యలకు పరిష్కారాలను వెతకటం ముఖ్యం అని నేను నమ్ముతాను. నిజమైన పురోగతి అనేది అర్థవంతమైన, ప్రయోజనకరమైన పరిష్కారాల ద్వారా వస్తుంది. నారాయణ విద్యాసంస్థల్లో, ప్రతి విద్యార్థి సమగ్రాభివృద్ధి సాధించే విధంగా, విద్యార్థులు, తల్లిదండ్రుల అవసరాలకు తగినట్లుగా నేరుగా స్పందించే విధంగా ఫ్రేమ్ వర్క్స్, పాఠ్యప్రణాళికలను రూపొందించామన్నారు. దీంతో విద్య ఎల్లప్పుడూ ప్రామాణికంగా, ప్రభావవంతంగా, భవిష్యత్తుకు అనుగుణంగా ఉంటుంది. '46 ఏళ్ల వారసత్వంతో, నారాయణ విద్యాసంస్థలు ఆసియాలో అతి పెద్ద విద్యాసంస్థలలో ఒకటిగా ఎదిగింది. 900కి పైగా పాఠశాలలు, కళాశాలలు, కోచింగ్ సెంటర్లలో 6 లక్షలకు పైగా విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతోంది. 'మీ కలలే, మా కలలు' అనే నినాదాన్ని నిజం చేస్తూ, నారాయణ నాణ్యమైన విద్యను అందిస్తూ, ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూ, విద్యార్థుల భవిష్యత్ లక్ష్యాలను

# కృషి విజ్ఞాన కేంద్రానికి నాలుగు అవార్డులు

## రైతులకు అందుబాటులో సాంకేతికత

## కేంద్రం ప్రధానశాస్త్రవేత్త డాక్టర్ వరప్రసాద్

**హైదరాబాద్**, సెప్టెంబరు 7 (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)కు నాలుగు అవార్డులు లభించాయి. తమిళనాడులోని వెల్లూరులో మూడు రోజుల పాటు జరిగిన అటారి జోన్-10 పరిధిలోని 72 కృషి విజ్ఞాన కేంద్రాల వార్షిక జోనల్ వర్క్‌షాప్ ముగిసింది. ఈ సందర్భంగా ప్రతి యేడాది జరిగే ఈ సమావేశంలో కృషి విజ్ఞాన కేంద్రాల పనితీరు సమీక్ష నిర్వహించి అవార్డులు ప్రశంస పత్రాలను అందచేశారు సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు చెందిన డీడీఎస్ కృషి విజ్ఞాన కేంద్రం నాలుగు విభాగాల్లో అవార్డులు సాధించింది.

స్థానిక డీడీఎస్ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్ర వేత్త డాక్టర్ సి. వరప్రసాద్ వెల్లూరులో ఈ అవార్డులు, ప్రశంస పత్రాలను అందుకున్నారు. మట్టి ఆరోగ్య కార్డులు, మట్టిశాస్త్రంపై ఆధారపడి సమగ్ర పోషక పదా ర్థాల నిర్వ హణను ప్రోత్సహించడంలో విశిష్ట ప్రతిభ కనబర్చినందుకు ప్రత్యేక అభినందన పత్రాన్ని ఈ కృషి విజ్ఞాన కేంద్రం అందుకుంది.

ఉత్తమ విజయగాథల విభాగంలో రెండో స్థానం, ఉత్తమ బాక్స్ ఐటెమ్స్ కంటెంట్ విభాగంలో రెండో స్థానం, అత్యధిక భూమి ఆరోగ్య కార్డులు జారీ చేసిన విభాగంలో మూడో స్థానం లభించింది. 2024 సంవత్సరంలో ఇక్కడి కృషి విజ్ఞాన కేంద్రంలో అధికారులు సుమారు 2 వేల మట్టిసాంపిళ్లను విశ్లేషించి, రైతులకు ఉచితంగా మట్టి ఆరోగ్య కార్డులు అందజేశారు. ఈ నేపథ్యంలో శాస్త్రవేత్తల సహాయ సహకారాలతో సాధించిన విజయాలతో ఈ కృషి విజ్ఞాన కేంద్రం జాతీయ వేదికపై మరోసారి తన ప్రతిభను చాటుకుంది.

ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో అవార్డులు సాధించడం తో బాధ్యత మరింత పెరిగిందన్నారు. రైతులకు శాస్త్రీయ, ఆధునిక వ్యవసాయ సాంకేతిక పద్ధతులు, దిగుబడులు సాధించేందుకు అవలంబించే విధానాల నిమిత్తం తమ కేంద్రం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.



మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సతీమణికి 'పివి మెమోరియల్ పురస్కారం' ప్రదానం చేస్తున్న ప్రముఖులు

# మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు పివి స్మారక పురస్కారం

**హైదరాబాద్ (సైఫాబాద్)**, సెప్టెంబరు 7 (జర్నలిస్ట్ ఫైల్) : ఆర్థిక శాస్త్రంలో భారతదేశానికి విశిష్ట సేవలు అందించిన పద్మవిభూషణ్ డా.మన్మోహన్ సింగ్‌కు 2025 సంవ త్సరానికి 'పివి మెమోరియల్ పురస్కారాన్ని' పివి మెమోరియల్ ఫౌండేషన్ ప్రక టించింది. ఈ మేరకు శనివారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో ఈ పురస్కారాన్ని మన్మోహన్‌సింగ్ సతీమణి గురుశరణ్‌కౌర్‌కు ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు, ప్రముఖ పాత్రి కేయులు కె.రామచంద్రమూర్తి, గౌరవ సలహాదారులు డా.జయప్రకాశ్‌నారాయణ, పోలా విజయ్‌బాబు, ప్రధాన కార్యదర్శి మాధంశెట్టి అనిల్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా పివి మెమోరియల్ ఫౌండేషన్‌కు కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ ఛైర్ పర్సన్ సోనియాగాంధీ అభినందనలు తెలియజేశారు. గాంధీ సిద్ధాంతాలను అమలుచేస్తున్న సబర్మతి హరిజన ఆశ్రమ్ మేనేజింగ్ ట్రస్టీ ఈశ్వరీబాయి పటేల్, దాతృత్వ సేవలకు గాను పద్మవిభూషణ్ రతన్‌నావల్ టాటాకు, విశ్వశాంతి స్థాపనకు చేసిన సేవలకు గాను దలైలామాకు, పద్మవిభూషణ్ ప్రజాకవి కాళోజీ నారాయణరావు ఇప్పటి వరకు పివి మెమోరియల్ పురస్కారాలను పివి ఫౌండేషన్ అందజేసింది.

# బిసి రిజర్వేషన్ల సాధన కోసం పోరాట కార్యాచరణ

## కవితకు బాసటగా బిసి కుల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్

## తెలంగాణ జాగృతిలో చేరిన బిసి నాయకులతో కవిత

**హైదరాబాద్**, సెప్టెంబరు 7(జర్నలిస్ట్ ఫైల్) : రిజర్వేషన్ల సాధన కోసం బిసి నాయ కులు, వివిధ కులాల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. హైదరాబాదులో తెలంగాణ జాగృతి కేంద్ర కార్యాలయంలో శనివారం జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను బిసి కుల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్,ఇతర నాయకులు వారిని కలిసి మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న ప్రస్తుత రాజకీయ పరిస్థితుల పైన సుదీర్ఘంగా చర్చించడం జరిగింది. బిసి ఉద్యమ బలోపేతం మరియు నలబై రెండు శాతం రిజర్వేషన్ పైన మరింత తీవ్రస్థాయిలో ప్రభుత్వం పైన ఒత్తిడి పెంచాలని బిసి రిజర్వేషన్ అమలు కోసం జాగృతి,యునైటెడ్ పూలే ఫ్రంట్ సంయుక్తంగా భవిష్యత్తు లో అనేక కార్యక్రమల రూపకల్పన జరుగుతుందని వారు అన్నారు. రానున్న రోజులలో తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ చేసే ప్రతి ఉద్యమాన్ని గ్రామ స్థాయి వరకు తీసుకు పోవాలని 42 శాతం రిజర్వేషన్ సాధన కోసం బిసిలను, బిసి సంఘం నాయకులను మేధావులను, ఇతర ప్రజా సంఘాలను, కలుపుక విస్తృతమైన ప్రజా జాగరణ కార్యక్రమాలు చేస్తూ ప్రజలకు అండగా ఉంటూ ఉద్యమాన్ని గ్రామ స్థాయి నుండి బలోపేతం చేయాలని కవిత పిలుపునిచ్చారు. కామారెడ్డి డిక్లరేషన్ ను అమలు చేయకుండానే కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే యోచనలో ఉందనీ అదే జరిగితే ఈ ప్రభుత్వానికి తగిన రీతిలో బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ జాగృతి, బిసి సమాజం ఒత్తిడికి తలొగ్గి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ, కౌన్సిల్ లో బిసి రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ బిల్లులు పాస్ చేసిందే తప్ప వాటికి రాష్ట్రపతి ఆమోదం కోసం చిన్న ప్రయత్నం కూడా చేయలేదన్నారు. ప్రధాని వద్దకు అఖిలపక్షం తీసుకెళ్తామని అసెంబ్లీలో హామీ ఇచ్చి మాట తప్పిందన్నారు. కేంద్రం వద్ద బిల్లులు పెండింగ్ లో ఉండగానే రాష్ట్ర కేబినెట్ రిజర్వేషన్ల పెంపునకు చట్ట సవరణ చేస్తున్నట్టుగా ప్రకటించి ఆ ప్రతిపాదనలు గవర్నర్ కు పంపిందన్నారు.

అటు కేంద్రం, ఇటు గవర్నర్ ను కలిసి రిజర్వేషన్లు సాధించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కనీస ప్రయత్నాలు చేయలేదన్నారు. రాష్ట్ర అసెంబ్లీ పాస్ చేసిన బిల్లులను, కేంద్రం, కేబినెట్ తీర్మానాన్ని గవర్నర్ తొక్కిపెట్టినా న్యాయపోరాటం చేసి ఒత్తిడి తెచ్చే ప్రయత్నమేది చేయలేదన్నారు. బిసిలను మభ్యపెట్టేందుకు ఇటీవల అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి చట్ట సవరణ పేరుతో మళ్లీ మోసపూరిత రాజకీయాలకు తెర తీసిందన్నారు. స్థానిక సంస్థలతో పాటు విద్య, ఉద్యోగాల్లో బిసి లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకు జాగృతి ఆధ్వర్యంలో ఉద్యమాన్ని కొనసాగిస్తామని కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు.తెలంగాణ జాగృతి లో బిసి నాయకులు చేరిక షురూ అయింది.

శనివారం బంజారాహిల్స్ లోని జాగృతి కార్యాలయంలో అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వారికి కండువాలు కప్పి జాగృతిలోకి ఆహ్వానించారు. 2001 నుంచి కెసిఆర్ వెంట తెలంగాణ ఉద్యమంలో కలిసి నడిచిన జిహెచ్ఎంసి మాజీ కార్పొరేటర్ గోపు సదానందం, సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఆరె కటిక సంఘం సురేందర్ తమ అనుచరులతో కలిసి జాగృతిలో చేరారు. బిసి రిజర్వేషన్ల పెంపు కోసం కల్వకుంట్ల కవిత చేస్తున్న కృషిని గుర్తించే తాము జాగృతిలో చేరుతున్నామని వారు ప్రకటించారు. బిసి42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు విశ్రమించేది లేదని వారు పేర్కొన్నారు.

# ఐదు నెలల్లో రైల్వేశాఖకు రూ.8,593 కోట్ల ఆదాయం

**హైదరాబాద్**, సెప్టెంబరు 7(జర్నలిస్ట్ ఫైల్): దక్షిణ మధ్య రైల్వే ఆదాయం ఐదు నెలల కాలంలో రికార్డు సృష్టించింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు మధ్య కాలంలో అత్యధిక స్థూల మూల ఆదాయం రూ.8,593 కోట్లను నమోదు చేసి రికార్డు సృష్టించింది. గత సంవత్సరం ఇదే కాలంలో సాధించిన రూ.8,457 కోట్ల కంటే ఇది ఎక్కువ. ఈ వృద్ధికి ప్రధానంగా సరుకు రవాణా కారణంగా మారినట్లు తెలుస్తోంది. ఈ జోన్ 60.4 మిలియన్ టన్నుల సరుకును రవాణా చేసింది. రూ.5,634 కోట్ల సరుకు రవాణా ఆదాయాన్ని ఆర్జించింది. ఇది అత్యుత్తమ పనితీరును సూచిస్తుంది. గత సంవత్సరం లోడింగ్ 56.6 మిలియన్ టన్నులతో పోలిస్తే ఇది 6.7 శాతం పెరుగుదలను చూపిస్తుంది. ప్రయాణికుల రద్దీ కూడా రికార్డు వృద్ధిని సాధించింది. ఏప్రిల్, ఆగస్టు 2025 మధ్య దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికుల ఆదాయంలో రూ.2,500 కోట్లు ఆర్జించింది. ఇది గత సంవత్సరం రూ.2,445 కోట్లతో పోలిస్తే 2.2 శాతం పెరుగుదల. ఈ కాలంలో 119 మిలియన్ల ప్రయాణికులను తీసుకెళ్లింది. బొగ్గు (28.5 మెట్రిక్ టన్నులు), సిమెంట్ (15.7 మెట్రిక్ టన్నులు), ఇనుప ఖనిజం (3.6 మెట్రిక్ టన్నులు), ఎరువులు (3.0 మెట్రిక్ టన్నులు), ఉక్కు కర్మాగారాలకు ముడి పదార్థాలు (2.5 మెట్రిక్ టన్నులు), ఆహారధాన్యాలు (2.5 మెట్రిక్ టన్నులు), ఇతర వస్తువులు (4.6 మెట్రిక్ టన్నులు) సరుకు రవాణాతో ఆదాయం పెరిగింది.

# వ్యవసాయ సహకార సంఘ ఉద్యోగుల బదలీపై స్టేటస్‌కో

**హైదరాబాద్**, సెప్టెంబరు 7 (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్) ఉద్యోగుల బదిలీలు, సంబంధిత విధానం అమలుపై హైకోర్టు యథాతథ స్థితిని విధించింది. బదిలీలపై ఉద్యోగుల అభ్యంతరాలు స్వీకరించాలనే హైకోర్టు గత ఉత్తర్వులను పట్టించుకోకుండా రాష్ట్ర స్థాయి కన్వీనర్ ఆగస్టు 22న పీఏసీఎస్ ఉద్యోగుల యూనిఫాం హెచ్ఆర్ పాలసీ ట్రాన్స్‌ఫర్ పాలసీ ఇంప్లిమెంటేషన్‌కు సంబంధించి ఉత్తర్వులు జారీ చేశారని, వాటిని కొట్టేయాలని పేర్కొంటూ రాష్ట్ర వ్యవసాయ సహకార సొసైటీ ఉద్యోగుల సంఘం సహా పలువురు ఉద్యోగులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది వాదిస్తూ గతంలో ఇదే హైకోర్టు బదిలీల పాలసీని కొట్టేసిందని, ఉద్యోగుల అభ్యంతరాలు స్వీకరించాలని ఆదేశించిందని పేర్కొన్నారు. ఆ ఆదేశాలను పట్టించుకోకుండా బదిలీలు చేపట్టాలని ఆదేశిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీచేశారన్నారు. వాదనలు విన్న ధర్మాసనం వివరణ ఇవ్వాలని స్టేట్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు ఛైర్మన్, చీఫ్ జనరల్ మేనేజర్, ఎండీ, పీఏసీఎస్ సెల్ కన్వీనర్, సీఈవో తదితరులకు నోటీసులు జారీచేసింది. బదిలీలపై యథాతథ స్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని పేర్కొంటూ విచారణను అక్టోబరు 7కు వాయిదా వేసింది.

# ఇష్టారాజ్యంగా ఇసుక మాఫియా!

## దళారులు చెప్పిన రేటుకే కొనాలి

## ప్రజాప్రతినిధుల అండదండలతో కొనసాగింపు

## వర్షం కురిస్తే చాలు కాసుల పంటే

## భారీగా ఇసుక నిల్వలు...బ్లాక్ చేస్తున్న వైనం

**హైదరాబాద్**, సెప్టెంబరు 7(జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక మాఫియాకు అడ్డూఅదుపులేకుండా పోతుంది. తక్కువ ధరలకు ఇసుకను అందుబాటులోకి తీసుకు రావాలని ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకంటే దళారుల చేసే దోపిడి ఎక్కువైంది. రాష్ట్ర వ్యాప్తంగా పలు ఇసుక రీచ్‌లలో ప్రజాప్రతినిధుల అండదండంలో ఇష్టారాజ్యంగా ధరలను నిర్ణయిస్తూ అమ్మకాలు కొనసాగిస్తున్నారు. రీచ్‌ల వద్ద ఇసుకను వారు నిర్ణయించిన ధరలకే అమ్మాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి తోడు ప్రభుత్వంలో కీలకంగా ఉన్న వారు తోడవ్వడంతో ఇష్టారాజ్యంగా మారింది. ఇసుక మాఫియా దెబ్బతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సాండ్ బజార్ లక్ష్యం రోజురోజు నీరుగారుతుంది. నాసిరకం ఇసుక సరఫరా చేస్తున్నారంటూ తప్పుడు ప్రచారం చేసి .. ఆ ఇసుకను కొనకుండా చేస్తున్నారు. దీంతో సాండ్ బజార్‌లలో ఇసుకను కొనుగోలు చేసేవారు కనిపించడం లేదు. ఇసుక మాఫియా ముందు సాండ్ బజారు బేజారవుతోంది. ఇసుక మాఫియా మూలంగా సాండ్ బజార్లకు అనుకున్న స్థాయిలో ఆదరణ లభించకుండా చేస్తున్నారు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఇసుక ఇబ్బందులు తప్పడం లేదు. మాఫియా నేతల తప్పుడు ప్రచారంతో బడా బిల్డర్లు సాండ్ బజార్ వైపు కన్నెత్తి చూడడం లేదు. ప్రజలకు అందుబాటులో ఉండేలా నగరానికి నాలుగు వైపులా ప్రభుత్వం ఇసుక బజార్లను ఏర్పాటు చేసింది. ఉప్పల్, ఎల్‌బినగర్, కూకట్‌పల్లి ప్రాంతాల్లో ప్రభుత్వం సాండ్ బజార్లను ఏర్పాటు చేసింది. దొడ్డు ఇసుకకు టన్నుకు రూ. 1600, సన్న ఇసుకకు టనున్న రూ.1800 ధరలను ప్రభుత్వం నిర్ణయించింది. ధర తక్కువగా నిర్ణయించడంతో అనూహ్య స్పందన వస్తుందని, పెద్ద సంఖ్యలో నిర్మాణదారులు వచ్చి ఇసుక కొనుగోలు చేస్తారని ప్రభుత్వం భావించింది. అయితే రోజుకు వేల సంఖ్యల్లో లారీల ఇసుకను వినియోగించే బడా బిల్డర్లు అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. ఎప్పటి మాదిరిగానే మధ్య దళారుల నుంచి ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే టన్నుకు అదనంగా రూ.400 నుంచి రూ.600 చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో నాలుగైదు నెలలుగా ఆశించిన స్థాయిలో అమ్మకాలు జరగడం లేదు. తక్కువ ధరకే ఇసుక అందుబాటులో ఉంచినా ఎందుకు కొనుగోలు చేయడం లేదని ఉన్నతాధికారులు ఆరాతీస్తున్నారు. ప్రచార లోపమా, మాఫియాకు అంతర్గతంగా సహకరిస్తున్నారా? అన్న వాటిపై ఆరా తీస్తే నాసి రకం ఇసుక అంటూ తప్పుడు ప్రచారం చేయడంతోటే ఇలా జరుగుతుందని తెలిసింది.

**రీచ్‌లు బ్లాక్..**

పలువురు ప్రజాప్రతినిధుల అండదడలతో మాఫియా దళారులు ఇసుక రీచ్‌లను బ్లాక్ చేస్తున్నారు. రెండు, మూడు రోజులు ఇసుకను బ్లాక్ చేసి, ఆ తరువాత సరఫరా చేస్తున్నారు. మధ్యమధ్యలో ఇసుకను బ్లాక్ చేస్తూ ధరలను అమాంతంగా పెంచేస్తున్నారు. కనీసం టన్ను ధర రూ.400 నుంచి రూ.700 వరకు పెంచుతున్నారు. ఇటీవల వర్షాలు కురిసిన సమయంలో ఇసుకకు భారీగా డిమాండ్ చేశారు. టన్నుకు రూ.1000ల మేర వసూలు చేశారంటే పరిస్థితులు అర్థం చేసుకోవచ్చు.

**దాడులే..**

ఇసుక రీచ్‌ల వద్ద దళారులు చెప్పింది వినాల్సిందే. ఏ మాత్రం తేడా వచ్చిన దాడులు తప్పవు. ఇటీవల ఒక ఏజెన్సీ ప్రాంతంలో ఇసుక లారీ డ్రైవర్‌కు, ఒక దళారికి మధ్య గొడవ జరిగడంతో లారీ డ్రైవర్‌పై చేయిచేసుకున్నట్లు తెలిసింది. ఇసుక రీచ్‌ల వద్ద దళారులు నిర్ణయించిన ధరలకు కొనుగోలు చేయాల్సిందే, లేదంటే తమను ఇబ్బందులు పెడుతున్నారంటూ లారీడ్రైవర్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఇసుక సరఫరాకు సంబంధించిన విషయంలో క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారులు ఎందుకు పర్యటనలు చేయడం లేదన్నది ప్రస్తుతం ప్రశ్నార్థకంగామారింది. సమీక్షలు నిర్వహించడం తప్ప, క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలిస్తే ధరలు తగ్గడంతోపాటు దళారుల పాత్ర తగ్గి, ప్రభుత్వం ప్రవేశపెట్టిన సాండ్ బజార్‌కు మంచి స్పందన వచ్చే అవకాశం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

# అధ్యాపకులను సన్మానించిన విద్యార్థులు

## పిల్లల జీవితాల్లో విద్యా వెలుగు నింపేది గురువులే



**గన్నవరం, సెప్టెంబరు 7 (జర్నలిస్ట్ ఫైల్) :**

విద్యార్థుల జీవితాల్లో చదువు అనే వెలుగు నింపేది గురువులేనని వీకేఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డి శ్రీనివాసరావు అన్నారు. శనివారం కళాశాల సెమినార్ హాలులో డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థుల ఆధ్వర్యంలో గురువుల అభినందన సన్మాన కార్యక్రమం జరిగింది. 10 మంది అధ్యాపకులను ఘనంగా సన్మానించి తమ అభిమానం చాటుకున్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తల్లిదండ్రులను, గురువులను గౌరవించడం నేర్చుకోవాలన్నారు. మన ఎదుగుదల అనేది తెలివితేటలతో వేసే తొలి అడుగుతోనే ఉంటుందన్నారని చెప్పారు. చదువు అనే వజ్రాయుధాన్ని సొంతం చేసుకుంటే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవడం చాలా సులభమని చెప్పారు. గురువుని ఆదర్శంగా తీసుకున్న వారి జీవితం ఎంతో ఉన్నతంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నవీన్, బాల చంద్రుడు, రాంబాబు, తేజ కుమారి, దుర్గ భవాని, ప్రమీలారాణి పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ



**ఆగిరిపల్లి, సెప్టెంబరు 7 (జర్నలిస్ట్ ఫైల్) :**

ఆగిరిపల్లి మండలం ఈదులగూడెం గ్రామం లో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఈలప్రోలు శ్రీనివాసరావు పిఏసిఎస్ అధ్యక్షులు, గ్రామ ఎంపీటీసీ సభ్యులు కొండసాని వెంకటేశ్వరరావు, ఆరేపల్లి శివయ్య మండల పార్టీ ఉపాధ్యక్షులు, ఆరేపల్లి బసవయ్య గ్రామ పార్టీ సెక్రటరీ, కొండసాని సర్వేశ్వరరావు నాయుడు శ్రీనివాసరావు జాలిపర్తి రఘురాం వార్డు సభ్యులు షేక్ జబీనా గ్రామ రెవెన్యూ అధికారిణి మరియు కూటమి నాయకులు కార్యక్రమంలో పాల్గొనడం జరిగినది.

# బోధనతో పాటు శోధన కూడా ఉపాధ్యాయులకు ఉండాలి




**ముస్తాబాద్, సెప్టెంబరు 7 (జర్నలిస్ట్ ఫైల్) :**

బోధన అనేది ఒక సవాలుతో కూడిన వృత్తి, దీనికి సహనం, నిబద్ధత మరియు విద్య పట్ల మక్కువ అవసరం అని ముస్తాబాద్ నవభారత్ హై స్కూల్ కరస్పాండెంట్ షేక్ ఇమామ్ పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో పాల్గొంటూ ఉపాధ్యాయులను కోరారు ఉపాధ్యాయ దినోత్సవం పిల్లలకు తమ ఉపాధ్యాయుల పట్ల తమ కృతజ్ఞతను, ప్రశంసలను వ్యక్తపరచడానికి ఒక అవకాశాన్ని అందిస్తుంది. ఉపాధ్యాయుల కృషి మరియు అంకితభావాన్ని గౌరవించడానికి, గుర్తించడానికి ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఉపాధ్యాయులు కేవలం విద్యావేత్తలు మాత్రమే కాదు వారు మనకు ఎదగడానికి,నేర్చుకోవడానికి సహాయపడే మార్గదర్శకులు, మరియు స్నేహితులుకూడా. మనం మంచి విద్యను పొందేలా,మెరుగైన వ్యక్తులుగా మారేలా వారు అవిశ్రాంతంగా పనిచేస్తారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న మనం ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటాము. గొప్ప ఉపాధ్యాయుడు, భారతదేశ రెండవ రాష్ట్రపతి అయిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సెప్టెంబర్ 5న కాబట్టి ఈ తేదీని ఎంచుకున్నారు. ఉపాధ్యాయులను సరైన రీతిలో గౌరవించాలని, అప్పుడే విద్యార్థులు సక్రమంగా నేర్చుకుంటారని డాక్టర్ రాధాకృష్ణన్ విశ్వసించారు.

# మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

**విజయవాడ, సెప్టెంబరు 7 (జర్నలిస్ట్ ఫైల్) :**

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న వన్ స్టాప్ సెంటర్ (విజయవాడ)లో అడ్మినిస్ట్రేటర్ ఒక పోస్ట్, సైకో సోషల్ కౌన్సెలర్ ఒక పోస్టు భర్తీచేసేందుకు గతేడాది అక్టోబర్ 16ననోటిఫికేషన్ ఇచ్చి ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగిందని.. అయితే ఇంటర్వ్యూలో ఎవరూ అర్హత సాధించనందున తిరిగి నోటిఫికేషన్ జారిచేసినట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి షేక్ రుక్సానా సుల్తానా బేగం తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాంట్రాక్టు లేదా ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేసేందుకు స్థానిక అర్హులైన 18 నుండి 42 సంవత్సరాల వయసు కలిగిన మహిళా అభ్యర్థులు నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ మహిళలకు 5 సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాలు గరిష్ట వయసులో సడలింపు ఉంటుందన్నారు. సెప్టెంబర్ 9 వరకు ఆసక్తిగల స్థానిక మహిళా అభ్యర్థులు ntr.ap.gov.in నుండి దరఖాస్తులు డౌన్లోడు చేసుకొని.. పూర్తిచేసి, ధ్రువీకరణ పత్రాల నకళ్లను గజిటెడ్ అధికారిచే అటెస్ట్ చేయించి.. ఆ దరఖాస్తులను జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారిణి వారి కార్యాలయం, డోర్ నెంబర్ 31-4-29/A, గద్దె పూర్ణచంద్రరావు విధి, మారుతీనగర్ సెకండ్ లేన్, విజయవాడ కార్యాలయంలో అభ్యర్థులు స్వయంగా సమర్పించాలని తెలిపారు.

# ఏఐతో మీ వ్యాపారాభివృద్ధి మీ చేతుల్లోనే






- గ్లోబల్ మార్కెట్లో స్వయం సహాయక మహిళల ఉత్పత్తులకు గిరాకీ
- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- ఒక కుటుంబం–ఒక పారిశ్రామికవేత్త స్ఫూర్తితో అడుగులు ముందుకు
- ఏఐ ఫర్ ష్యూర్ శిక్షణ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, సెప్టెంబరు 7 (జర్నలిస్ట్ ఫైల్) :**

ప్రతి కుటుంబంలో ఒక మహిళను పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలన్న గౌరవ ముఖ్యమంత్రి ఆలోచనలను ఆచరణలోకి తీసుకొచ్చేందుకు ఏఐ ఫర్ ష్యూర్ కార్యక్రమానికి శ్రీకారంచుట్టామని, స్వయం సహాయక సంఘాల మహిళలు తమ ఉత్పత్తులను ఆధునిక సాంకేతికతతో గ్లోబల్ మార్కెట్లో అమ్మకాలు నిర్వహించుకొని.. ఆర్థిక ప్రగతి సాధించేందుకు అడుగులు ముందుకు వేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని రైతు శిక్షణ కేంద్రంలో డీఆర్డీఏ, మెప్మా, యూసీడీ సంయుక్త ఆధ్వర్యంలో ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త - ఏఐ ఫర్ ష్యూర్ కార్యక్రమాన్ని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా జిల్లాలో ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త విధానాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని, ఇప్పటికే ఓ మంచి ఆలోచనను వ్యాపారంగా ఎలా మలచుకోవాలి, అవసరమైన ఆర్థిక వనరులను ఎలా సమకూర్చుకోవాలి? తదితర అంశాలపై మహిళా పారిశ్రామికవేత్తలతో బ్రాండింగ్, మార్కెటింగ్పై శిక్షణ ఇచ్చామని.. ఫలితంగా దాదాపు 700 మంది స్వయం సహాయక సంఘాల మహిళలు కొత్త వ్యాపారాలు ప్రారంభించి, లఖ్పతి దీదీలుగా ముందడుగు వేయడం జరుగుతోందన్నారు. ఇప్పుడు స్వయం సహాయక సంఘాల మహిళలు తమ ఉత్పత్తులను గ్లోబల్ మార్కెట్కు చేరువచేసుకునేందుకు ఆధునిక సాంకేతికతను ఎలా ఉపయోగించుకోవాలనే దానిపై ఏఐ నిపుణులతో 160 మంది స్వయం సహాయక సంఘాల మహిళా వ్యాపారవేత్తలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వివరించారు. చాట్జీపీటీ వంటి వాటి సహాయంతో బ్రోచర్లు, ఫ్లయర్లు, బ్యానర్లు వంటి వాటిని తయారు చేసుకోవడం, రీల్స్, షార్ట్స్ను రూపొందించి వాటిని వాట్సాప్, ఫేస్బుక్, ఇన్స్టా తదితర సోషల్ మీడియా వేదికల్లో పోస్ట్ చేయడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. డిజిటల్ మార్కెటింగ్, ఈ-కామర్స్ అవకాశాలను అందిపుచ్చుకునేలా చేయిపట్టి నడిపించడం జరుగుతోందన్నారు. పేపరుతో రూపొందించిన పర్యావరణహిత అందమైన బొమ్మలు, అలంకరణ ఉత్పత్తులు, వస్తువులు, హెర్బల్ ఉత్పత్తులు, మిల్లెట్స్ - తాటిబెల్లంతో తయారుచేసిన ఆరోగ్యకర ఆహార ఉత్పత్తులు, స్పోర్ట్స్ వేర్, సంప్రదాయ, ఫ్యాషన్ వస్త్రాల డిజైన్లు, లెదర్ వస్తువులు వంటివి మన మహిళా శక్తి సృజనాత్మకతకు ప్రతిరూపాలని.. వీటిని గ్లోబల్ మార్కెట్కు చేరువ చేయడం ద్వారా ఆర్థిక సాధికారత.. ఆపై జీవన ప్రమాణాలు, తలసరి ఆదాయం వృద్ధి సాధ్యమవుతుందన్నారు. స్వర్ణాంధ్ర ఏ 2047 లక్ష్యాల సాధనకు ఇది తొలి అడుగు అని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు.

### మంచి కార్యక్రమంలో పాల్గొన్నందుకు చాలా ఆనందంగా ఉంది

నిట్ - వరంగల్ ప్రొఫెసర్ డా. స్ఫూర్తి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ వారి విజ్ఞప్తి మేరకు ఓ మంచి కార్యక్రమంలో పాల్గొన్నందుకు చాలా ఆనందంగా ఉందని.. రెండు సెషన్లలో ఆరుగంటల పాటు స్వయం సహాయక సంఘాల మహిళా వ్యాపారవేత్తలకు ఏఐతో పాటు డిజిటల్ మార్కెటింగ్ వేదికలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ ఏఎన్వీ నాంచారరావు, యూసీడీ పీవో పి.వెంకట నారాయణ, గ్రామీణ జిల్లా సమాఖ్య ప్రెసిడెంట్ కె.కల్పన, అర్బన్ జిల్లా సమాఖ్య ప్రెసిడెంట్ కె.మీనాక్షి పాల్గొన్నారు.

# పెద్దలు నేటి సమాజానికి స్ఫూర్తిప్రదాతలు

- అలరించిన సంస్కారవంతులకు ఘన స్వాగతం అంటూ ఏర్పాటు చేసి తోరణం
- కాకతీయ ఇ.ఎమ్. హై స్కూల్లో గ్రాండ్పేరెంట్స్ డే
- విద్యతోపాటు సామాజిక చైతన్యం అవసరం
- కాకతీయ విద్యాసంస్థల అధినేత రవీంద్రనాథ్, డైరెక్టర్ కార్తికేయ

**నందిగామ, సెప్టెంబరు 7 (జర్నలిస్ట్ ఫైల్) :**

విద్యతోపాటు విలువలు,విశ్వసనీయత,క్రమశిక్షణ, పోటీతత్వం అనేక అంశాల్లో విద్యార్థి, విద్యార్థులకు, చిన్నారులను తీర్చిదిద్దడమే కాకతీయ విద్యాసంస్థలు ప్రధాన లక్ష్యమని సంస్థ అధినేత కాపా రవీంద్రనాథ్, డైరెక్టర్ కాపా కార్తికేయ అన్నారు. కాకతీయ ఇ.ఎమ్. హై స్కూల్ క్యాంపస్లో "గ్రాండ్పేరెంట్స్ డే" ను ఎంతో అంగరంగ వైభవం గా జరిగాయి. " సెలబ్రేటింగ్ ఔర్ రూట్స్ " అనే థీమ్తో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథులుగా కాకతీయ విద్యాసంస్థల ఛైర్మన్ కాపా రవీంద్రనాథ్ , కాపా భారతి, డైరెక్టర్ కార్తికేయ కాపా, సుష్మ కాపా మరియు ప్రిన్సిపాల్ సత్యమూర్తి హాజరై సభను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు తమ తాత నాయనమ్మలు, తాత అమ్మమ్మలతో కలిసి పాటలు, ఆటలు, నృత్యాలు ప్రదర్శించి వారిని ఆనందపరిచారు. అనంతరం విద్యార్థులంతా తమ తాతమ్మల పాదాలకు పూలతో నమస్కారం చేసి వారి ఆశీర్వాదాలను పొందారు. తాతమ్మలు తమ మనవరాళ్లతో, మనవళ్లతో సమయం గడుపుతూ ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. పిల్లలు ఇంత ఆప్యాయతతో గౌరవం చూపించడం చూసి గర్వంగా ఉందని వారు కొనియాడారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మరియు తాతమ్మలు పాఠశాల యాజమాన్యం ఇంతటి గొప్ప విలువలతో కూడిన కార్యక్రమం గూర్చి హృదయపూర్వకంగా అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు కుటుంబ బంధాలను మరింత బలపరుస్తాయని, విలువల ఆధారంగా పిల్లల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతున్న పాఠశాల కృషి ప్రశంసనీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థులు, గ్రాండ్ పేరెంట్స్, మరియు ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.



# మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరం నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలి

- వైద్య విద్యతో రాజకీయం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- ప్రభుత్వ ధనంతో పూర్తి చేయాల్సిన వాటిని ప్రైవేటుకు అప్పగించడం సబబు కాదు
- వైద్య విద్య, ప్రజారోగ్యాన్ని ప్రైవేటు పరం చేయడంలో కూటమి కుట్ర
- వైద్య విద్య కోసం జగన్ చేసిందేమీ లేదు
- నిధులు ఇవ్వకుండా సొంత డబ్బా కొట్టుకున్నారు
- బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ ఆగ్రహం



**అమరావతి, సెప్టెంబరు 7 (జర్నలిస్ట్ ఫైల్) :**

రాష్ట్రంలో మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయాలని కూటమి తీసుకున్న నిర్ణయంపై బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ భగ్గుమన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 2019-2024 మధ్య అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం 17 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని, కానీ నిధులు ఇవ్వకుండా జాప్యం చేసిందన్నారు. రాష్ట్రంలో తామే వైద్య విద్యను ప్రోత్సహిస్తున్నామని వైసిపి సొంత డబ్బా కొట్టుకుందే తప్ప నిధులను మంజూరు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ కు చిత్తశుద్ధి ఉండి ఉంటే అధికారంలో ఉన్నప్పుడే నిధులను మంజూరు చేసి మెడికల్ కాలేజీల నిర్మాణాలను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. జగన్ అధికారంలోకి రాకముందు 11 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఉండగా ఆయన అధికారంలోకి వచ్చాక 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి పూనుకున్నారని, వాటి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే అవి పూర్తి కాలేదన్నారు. చివరకు జగన్ హయాంలో ఆరోగ్య శ్రీ బిల్లులు కూడా పెండింగ్ లో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వైద్య విద్యను ప్రైవేటు పరం చేయడంతో పాటు ప్రజారోగ్యాన్ని కార్పోరేట్ శక్తులకు అప్పగించేందుకు ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. జగన్ హయాంలో నిర్మించతలపెట్టిన 17 మెడికల్ కాలేజీల్లో 10 మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేసేందుకు నిర్ణయం తీసుకున్నారన్నారు. వైద్య విద్యను ప్రైవేటు పరం చేస్తే ఫీజులు గణనీయంగా పెరుగుతు యాన్నా రు. ప్రైవేటు సంస్థలు లాభాపేక్షతో పనిచేస్తాయ న్నారు. దీని వల్ల నిరుపేద విద్యార్థులకు అవకాశాలు తగ్గుతా యని హెచ్చరించారు. ఇప్పటికే రాష్ట్రం నుంచి చాలా మండి నిరుపేద విద్యార్థులు నీట్ లో సీట్లు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒకప్పుడు 2,360 సీట్లు ఉంటే ఈ కొత్త కాలేజీల వల్ల ఆ సంఖ్య 4910 కి పెరుగుతుందని దానివల్ల మరో 2500 విద్యార్థులకు మేలు జరుగుతుందున్నారు. అయితే మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు ఇవ్వడం వల్ల చాలా మంది విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. రెండు ప్రభు త్వాలు కూడా వైద్యవిద్య, ప్రజారోగ్యంతో రాజకీయాలు చేశాయని ఆయన విమర్శించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటు పరం నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోకపోతే ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడుతామని ఆయన హెచ్చరించారు.

## నారాయణ విద్యాసంస్థలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**గన్నవరం, సెప్టెంబరు 7 (జర్నలిస్ట్ ఫైల్) :**

గన్నవరం విద్యానగర్ లో నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాల నందు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి తనలోని జ్ఞాన సంపదను విద్యార్థులకు పంచడం ద్వారా వారి భావి జీవితానికి బంగారు బాట వేసిన గురు దేవునిగా సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జన్మదినం సందర్భంగా ఆయనను స్మరించుకుంటూ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. సమాజ నిర్మాణం లో కీలక పాత్ర పోషించేటటువంటి ఉపాధ్యాయుల పేరు మీద ఒక ప్రత్యేక రోజున ఏర్పాటు చేసి ఆ వృత్తిని గౌరవించడం మన సమాజంలో అంతర్భాగం అయింది. దేశానికి కావలసిన అటువంటి యువతను అందించడంలో కీలకపాత్ర ఉపాధ్యాయులదే. మరి అలాంటి గౌరవప్రదమైన వృత్తిలో ఉన్నటువంటి ఉపాధ్యా యులు అందర్నీ మరియు బోధనేతర సిబ్బందిని కూడా వారి యొక్క సేవలకు తగినట్లుగా అందర్నీ సన్మానించడం జరిగింది. విద్యార్థులు ప్రదర్శనలతో, నాటిక లతో, పాటలతో ఉపాధ్యాయులందరినీ ఆనందింపచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మస్తాన్ భాషా ,ఏజీఎం సత్తిరెడ్డి , ఈ చాంప్స్ వైస్ ప్రిన్సిపల్ శిరీష , ఈ కిడ్స్ వైస్ ప్రిన్సిపాల్ అనూష, అకాడమిక్ డీన్ నవీన, ఏవో ప్రసాద్, ఉపాధ్యాయ మరియుఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

## విశ్వజననీ సేవా జ్యోతి అవార్డు కైవసం చేసుకున్న విజయశ్రీ



**ఏలూరు, సెప్టెంబరు 7 (జర్నలిస్ట్ ఫైల్) :**

హైదరాబాద్ విశ్వజనని ఫౌండేషన్ 3వ వార్షికోత్సవ వేడుకల సంబరాలు ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో ఏలూరుకు చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త రొడ్డా విజయశ్రీకి విశ్వ జననీ సేవాజ్యోతి అవార్డు లభించింది. ఈ పురస్కారాన్ని హైదరాబాద్ లోని పొట్టిశ్రీరాములు యూని వర్సిటీలో జరిగిన కార్యక్రమంలో అందజేసి, ఆమెను ఘనంగా సత్కరించారు. విజయశ్రీ లాంటి వ్యక్తులు ఈ సొసైటీకి చాలా అవసరమని వారు అన్నారు. ఈ సందర్భంగా సమాజానికి విభిన్న సేవలు అందించినటువంటి విజయశ్రీ లాంటి వ్యక్తులకు నమస్కారం అందించడం ఎంతో గర్వం కారణంగా ఉందని అన్నారు. అవార్డు అందుకున్న అనంతరం విజయశ్రీ, ఫౌండేషన్ చైర్మన్ బొగ్గరపు బ్రహ్మానందానికి , వారి సంఘ సభ్యులకు ఎంతగానో కృతజ్ఞతలు తెలిపారు.

## యూరియా కోసం రైతులు ఆందోళన వద్దు

### ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



**గన్నవరం, సెప్టెంబరు 7 (జర్నలిస్ట్ ఫైల్) :**

ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో గన్నవరం నియోజకవర్గంలో వ్యవసాయ అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని యూరియా కోసం రైతుల ఆందోళన చెందవద్దని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు భరోసా ఇచ్చారు. నియోజకవర్గం లోని ఉంగుటూరు మండలంలో 171.45 మెట్రిక్ టన్నులు, బాపులపాడు మండలంలో 126.45 మెట్రిక్ టన్నులు, గన్నవరం మండలంలో 65.47 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపా రు. అందుబాటులో ఉన్న ఎరువులను పారదర్శకంగా రైతులందరికీ పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు చెప్పారు. రైతులందరికీ ప్రభుత్వ ధరకే యూరియాను ఇతర ఎరువులను అందిస్తామని ఎక్కడైనా ఎక్కువ ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు అవసరమైన యూరియాను ఆర్. బి. కే లు, అధికారిక ఎరువుల దుకాణాల్లో మాత్రమే కొనుగోలు చేయాలని కొనుగోలు చేసిన ఎరువులకు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రస్తుతం ఉన్న ఎరువులు సరిపోకపోతే అవసరమైనంత మేరకు ఎరువులను తీసుకువచ్చేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టినట్లు యార్లగడ్డ వివరించారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎరువుల కొరతను నివారించేందుకు మనరాష్ట్రానికి ఎక్కువ మొత్తంలో కేటాయిం పులు చేసేలా కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం మంతనాలు చేస్తున్నట్లు చెప్పారు. ఎరువుల పంపిణీలో అక్రమాలు చోటు చేసుకుంటే తనకు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని ఈ సందర్భంగా యార్లగడ్డ సూచించారు.

## డా.జె. రాముడు కు ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ విసిటింగ్ సైంటిస్ట్ ప్రోగ్రామ్ కు ఎంపిక



**మైలవరం, సెప్టెంబరు 7 (జర్నలిస్ట్ ఫైల్) :**

డాక్టర్ లక్కిరెడ్డి హనీమిరెడ్డి గవర్నమెంట్ డిగ్రీ కళాశాల మైలవరం, వృక్ష శాస్త్ర విభాగాధిపతి డా. జె.రాముడు కు ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ, .ఐ ఎన్ ఎస్ ఏ విజిటింగ్ సైంటిస్ట్ ప్రోగ్రాం కు సెలెక్ట్ అయినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇల్లా రవి తెలియజేశారు. ఈ ప్రోగ్రాం ద్వారా వారు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్లాంట్ సైన్సెస్ డిపార్ట్మెంట్లో ఒక నెల కోలాబరేటివ్ గా రీసెర్చ్ వర్క్ కు అనుమతి పొందినట్లు తెలియజేశారు. ఈ ప్రోగ్రాం ద్వారా ఒక నెల కు గాను 30 వేల రూపాయలు ఫెలోషిప్, మరియు ట్రావెల్ సౌకర్యాలు కల్పిస్తారని డాక్టర్ ఇల్లా రవి తెలియజేశారు. దీని ద్వారా రూరల్ డిగ్రీ కళాశాలలో కూడా యూనివర్సిటీల తో పాటుగా రీసెర్చ్ జరగటానికి అవకాశం ఉంటుందని తెలియజేశారు.ఐ ఎన్ ఎస్ ఏ విసిటింగ్ సైంటిస్ట్ ఫెలోషిప్ పొందినందుకు కళాశాల వైస్ ప్రిన్సిపల్ .పీ రంగారావు, కామర్స్ విభాగాధిపతి ఏం .శ్రీనివాసరావు, వి. ఉమా లక్ష్మి మరియు ఇతర అధ్యాపకులు డాక్టర్ జె.రాముడిని అభినందించారు.

# 25 ఏళ్ల సేవకు ఘన సత్కారం

- ఉపాధ్యాయుడు ఇలాహీ బక్ష్ కి సిల్వర్ జూబ్లీ ఎక్సలెన్సీ అవార్డు
- పలువురి నుండి అభినందనల వెల్లువ



**భద్రాచలం, సెప్టెంబరు 7 (జర్నలిస్ట్ ఫైల్) :**

గురువు ఒక దీప స్తంభం ఆయన వెలుగులోనే విద్యార్థుల భవిష్యత్తు ప్రకాశిస్తుంది. విద్యతోనే విలువలు,గౌరవం,అంకితభావం సేవాదృక్పథం మరెన్నో సుగుణాలను చిన్నారుల్లో,విద్యార్థులో నింపే ఎకైక మహోన్నత వ్యక్తి గురువు. ఈ మాటలన్నిటికి జీవం పోసిన ఉపాధ్యాయుడు మొహమ్మద్ ఇలాహీ బక్ష్ అని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు. 25 ఏళ్లుగా హిందీ భాష బోధనలో తన అంకితభావాన్ని చూపిస్తూ, వందలాది విద్యార్థుల జీవితాలను వెలుగులు నింపిన ఆయనను, ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా భద్రాచలం పబ్లిక్ స్కూల్ యాజమాన్యం సిల్వర్ జూబ్లీ ఎక్సలెన్సీ అవార్డుతో సత్కరించింది. 2000లో మొదలైన పయనం జూన్ 19, 2000న ఉపాధ్యాయ వృత్తిని ప్రారంభించిన మొహమ్మద్ ఇలాహీ బక్ష్, క్రమశిక్షణ, నిబద్ధత, తపన అనే మూడు విలువలను తన బోధనలో కలిపారు. విద్య అంటే కేవలం పాఠాలు కాదని వ్యక్తిత్వ నిర్మాణమని నమ్ముతూ, 25 ఏళ్లుగా ప్రతి తరగతిని స్ఫూర్తిదాయక వేదికగా మలిచారు. విద్యార్థులకు మార్గదర్శి ఐటీసీ సంస్థకు అనుబంధంగా నడుస్తున్న భద్రాచలం పబ్లిక్ స్కూల్లో, హిందీ విభాగాన్ని ఒక కొత్త స్థాయికి తీసుకెళ్లిన ఆయన, విద్యార్థుల్లో భాషా పట్ల ఆసక్తిని పెంచి, పలువురు ప్రతిభావంతులను తీర్చిది ద్దారు. తరగతి గది బోధనకే పరిమితం కాకుండా, క్రమశిక్షణతో కూడిన విలువలను విద్యార్థుల్లో పెంపొం దించారు. అవార్డు ప్రదానం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో, ఐటీసీ హెచ్ఆర్ మేనేజర్ శ్యామ్ కిరణ్ మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్ కిటుకులే చేతుల మీదుగా ఇలాహీ బక్ష్ ఈ సిల్వర్ జూబ్లీ ఎక్సలెన్సీ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సహ చర ఉపాధ్యాయులు అభినందనలు తెలుపుతూ, ఆయన కృషి అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. సహచరుల ప్రశంసలు ఇలాహీ బక్ష్ బోధన విధానం మాకు స్ఫూర్తి. విద్యార్థుల పట్ల ఆయనకున్న అంకిత భావం ఆయనను నిజమైన ఆదర్శ ఉపాధ్యాయునిగా నిలబెట్టాయి అని తోటి ఉపాధ్యాయులు ప్రశంసలు కురిపించారు. గౌరవించబడిన కృషి.. విద్యారంగంలో నిబద్ధత, శ్రమ, అంకితభావం కలిసిన ప్రతీకగా నిలిచిన మొహమ్మద్ ఇలాహీ బక్ష్ కి లభించిన ఈ సత్కారం, భవిష్యత్ తరాలకు ఒక సందేశం ఇస్తోంని ఐటిసి సంస్థకు చెందిన ఉన్నతాధికారులు తెలియజేశారు.ఈ సందర్భంగా ది న్యూ ఇండియన్ జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్,అసోసియేషన్ అఫ్ ప్రింట్ అండ్ బ్రాడ్ కాస్టింగ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ వ్యవస్థాపక అధ్యక్షులు పి.మీరాహుస్సేన్ ఖాన్,సీనియర్ జర్నలిస్టులు పఠాన్ సైదాఖాన్,అకుల వెంకటనా రాయణ, చంద్రశేఖర్ అన్నవరపు,ఎం శ్రీనివాసరావు, నాగేశ్వరరావు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

## గ్రామగ్రామాన ఎరువులపై జన జాగృతి

- ఇంటింటికీ చేరువై సరైన సమాచారం అందించే కార్యక్రమం
- ఎరువుల వినియోగంపైనా అవగాహన కల్పించండి
- నానో యూరియా ప్రయోజనాలను వివరించి వినియోగాన్ని ప్రోత్సహించండి: కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, సెప్టెంబరు 7 (జర్నలిస్ట్ ఫైల్) :**

రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతల క్షేమం సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఖరీఫ్ సీజన్ కు సంబంధించి అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఎరువ లను పంపిణీ చేస్తోందని.. ఎక్కడా ఎలాంటి గందర గోళానికి తావు లేకుండా సరైన సమాచారం అందిం చేందుకు ఈనెల 7వ తేదీ ఆదివారం గ్రామగ్రామాన అధికారులు, సిబ్బంది ఇంటింటికి చేరువై ఎరువులకు సంబంధించిన సమాచారాన్ని అందించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ లక్ష్మీశ శనివారం రాత్రి కలెక్టర్ కార్యాలయం నుంచి రెవెన్యూ, వ్యవసాయ, సహకార, మార్క్ఫెడ్ తదితర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యూరియాతోపాటు వివిధ రకాల ఎరువులు అవసరం మేరకు అందుబాటులో ఉన్నాయని ప్రణాళిక ప్రకారం ఎప్పటికప్పుడు ఎరువులు సరఫరా అవుతున్నాయని వివరించారు. ప్రస్తుతం జిల్లాలో 5,546 మెట్రిక్ టన్నుల యూరియాతో పాటు మొత్తం 21,554 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నట్లు వివరించారు. తమ సమీపంలోని సొసైటీ వివరాలతో పాటు ప్రస్తుతం ఆ సొసైటీలో ఎంత మేరకు ఎరువులు ఉన్నాయి... ఏ ఏ రకమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయి.. మరో వారం రోజుల్లో ఎంతమొత్తం ఎరువులు కొత్తగా వస్తాయి.. తదితర అంశాలను తెలియజేయడంతో పాటు ఏ దశలో ఎంతమేరకు, యూరియాను, ఎరువులను ఉపయోగించాలనే దానిపైన అవగాహన కల్పించాలన్నారు. డబ్బు ఆదాతో పాటు పర్యావరణ పరిరక్షణకు, నేల సారాన్ని కాపాడుకునేందుకు అందుబాటులోకి వచ్చిన నానో యూరియా వినియోగంపైనా ప్రయోజనాలపైనా రైతులకు అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించే వివరాలను ఆన్లైన్లో పొందుపరచాలని సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకులతోపాటు వివిధ స్థాయిలోని వ్యవసాయ అధికారులు ఈ అన్నదాతల జాగృతి కార్యక్రమంలో పాల్గొనాలని.. సరైన సమాచారం అందించి రైతులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

## రజక సామాజిక రక్షణ చటం ఏర్పాటు చేయాలి

### రజకులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక వృత్తిదారుల సమైక్య రాష్ట్ర అధ్యక్షులు వెంకట్రావు డిమాండ్



**మైలవరం, సెప్టెంబరు 7 (జర్నలిస్ట్ ఫైల్) :**

శ్రీకాకుళం జిల్లా, ఆముదాలవలస మండలం, కొత్తవలస గ్రామంలో అరసవల్లి హార్తమ్మ 70 సంవత్సరాల మహిళపై మరో ముగ్గురు ఆమె కుటుంబ సభ్యులపై వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా పాత కక్షలు దృష్టిలో పెట్టుకొని కూటమి ప్రభుత్వంలోని కొంతమంది పెత్తందారులు దాడి చేసి తీవ్రంగా గాయపరచి వృద్ధురాలు మరణిం చగా మిగిలిన వారికి తీవ్రమైన గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనకు బాధ్యులైన వారిపై కఠినమైన చట్టాలు పెట్టి ముద్దాయిలు వెంటనే అరెస్టు చేయాలని రజక వృత్తిదారుల సమైక్య రాష్ట్ర అధ్యక్షులు బుద్ధవరపు వెంకటరావు, జిల్లా నాయకులు తాళ్లూరి శేషగిరిరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అదేవిధంగా కృష్ణా జిల్లా నాగాయలంక గ్రామ బిల్ కలెక్టర్ కేతేపల్లి రామకృష్ణపై అధికార పార్టీ నాయకులు మండవ బాలవర్ధన్ రావు అతని అనుచరులు విధి నిర్వహణలో ఉన్న రామకృష్ణ పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. రెండు సంఘటనలతో రాష్ట్రంలో రజకులకు రక్షణ లేకుండా పోయిందని అట్టడుగు వర్గంలో ఉన్న రజకులకు భద్రత కల్పించే విధంగా రజక సామాజిక రక్షిణ చటం ఏర్పాటు చేయాలని తెలిపారు. శనివారం ఉదయం వెంకట్రావు కార్యాలయంలో స్థానిక రజక సంఘం నాయకులతో ఏర్పాటు చేసిన పత్రికా ప్రకటన ద్వారా ముద్దాయిలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లెల రాధాకృష్ణ కొండపల్లి రామకృష్ణ నాగవరపు మల్లయ్య, కొండపల్లి వెంకటస్వామి బుద్ధవరపు గోపాలం, కోరుకొండ లచ్చారావు, బుద్ధవరపు చలమయ్య, జమలయ్య, బొడ్డపాటి వేణు, డి వీరభద్రరావు, జి జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 9 న డా. ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం

- రాష్ట్ర గవర్నర్, యూనివర్శిటీ కులపతి జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ అధ్యక్షతన స్నాతకోత్సవం
- చీఫ్ కార్డియాక్ సర్జన్ డా. ఓపీ యాదవ కు గౌరవ డాక్టరేట్ డిగ్రీ
- డాక్టర్ పి. చంద్రశేఖర్, ఉపకులపతి, డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం



**విజయవాడ, సెప్టెంబరు 7 (జర్నలిస్ట్ ఫైల్) :**

డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 27వ మరియు 28 వ స్నాతకోత్సవం సెప్టెంబర్ 9 వ తేదీన నిర్వహించడం జరుగుతుందని విశ్వవిద్యాలయ విసి డాక్టర్ పి. చంద్రశేఖర్ తెలియజేశారు. శనివారం డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమా వేశంలో డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యా లయం ఉపకులపతి పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ కోవిడ్ వల్ల 2021 వ బ్యాచ్ కి చెందిన 27 వ, 2022 వ బ్యాచ్ కి చెందిన 28 వ స్నాతకోత్సవం నిర్వహిం చలేదన్నారు. సెప్టెంబర్ 9 వ తేదీ న తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళా క్షేత్రంలో ఉదయం 11.30 నిమిషాలకు 27 వ మరియు 28 వ స్నాతకోత్సవాలు రాష్ట్ర గవర్నర్ విశ్వ విద్యాలయ కులపతి జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందన్నారు. యూనివర్శిటీ ప్రధానం చేసే గౌరవ డాక్టరేట్ కోసం ముగ్గురు పేర్లతో గవర్నర్ కు పంపించగా డిల్లీలోని నేషనల్ హార్ట్ ఇనిస్టిట్యూట్ కు చెందిన చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ & చీఫ్ కార్డియాక్ సర్జన్ డా. ఓపీ యాదవ కు గౌరవ డాక్టరేట్ డిగ్రీ కి ఎంపిక చేశారన్నారు. 27 వ స్నాతకోత్సవానికి 53 మంది విద్యార్థులకు, 28 వ స్నాతకోత్సవానికి 67 మంది విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ మెడల్స్ అందించనున్నారన్నారు. వచ్చే ఏడాది నుంచి రెగ్యులర్గా స్నాతకోత్సవం నిర్వహించనున్నట్లు తెలి పారు. యూనివర్శిటీలో రీసెర్చ్ యాక్టివిటీస్ కొరకు 75 లక్షల గ్రాంట్ ఇవ్వటం జరిగిందన్నారు. యూని వర్శిటీ రిజిస్ట్రార్ డా. వి. రాధికా రెడ్డి మాట్లాడుతూ 2021, 2022 సంవత్సరాలకు సంబంధించిన 27 వ, 28 వ స్నాతకోత్సవాలను ఒకేసారి నిర్వహించడం జరుగుతుందన్నారు. 21 వ స్నాతకోత్సవానికి సంబం ధించి 53 మంది విద్యార్థులకు 72 మెడల్స్ ( 55 గోల్డ్, 17 సిల్వర్), 18 క్యాష్ ప్రైజ్ లు, 28 వ స్నాతకోత్సవానికి సంబంధించి 67 మంది విద్యార్థులకు 84 మెడల్స్ ( 60 గోల్డ్, 24 సిల్వర్), 20 క్యాష్ ప్రైజ్‌లు అందించనున్నారన్నారు. పీహెచ్ డీ పూర్తి చేసిన 5 మందికి పీహెచ్ డీ పట్టాలు, సూపర్ స్పెషాలిటీ లో 1 కి డిగ్రీ అందించనున్నారు. మెడల్స్ వచ్చిన వారు స్నాతకోత్సవానికి వచ్చి తీసుకుంటారన్నారు. కార్య క్రమంలో ఆర్ అండ్ డీ డైరెక్టర్ డాక్టర్. సూర్యప్రభ, జాయింట్ రిజిస్ట్రార్ (అకడమిక్) కే. నీలిమ, డిప్యూటీ రిజిస్ట్రార్ కే. సునన్న రామర్స్ , ప్రెస్ అండ్ మీడియా కన్వీనర్ ఎమ్.వీ. అక్కి రాజు లు పాల్గొన్నారు.

## పోలీస్ వాహనమే అంబులెన్స్



○ మానవత్వం చాటిన పాత గుంటూరు ఎస్ఐ ఎన్.సి ప్రసాద్

**గుంటూరు క్రైమ్(జర్నలిస్ట్ ఫైల్)** :గుంటూరు తక్కెళ్ళపాడు బైపాస్ లో రోడ్డులో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన టాటా మ్యాజిక్ వాహనం. ఈ సంఘటన లో ద్వి చక్ర వాహనం పై ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలు,అందులో 4 ఏండ్ల చిన్నారి ఉన్నారు. సకాలంలో అంబులెన్స్ సర్వీస్ అందుబాటులో లేకపోవడంతో ఘటన స్థలంలో ఉన్న పాత గుంటూరు ఎస్ ఐ ప్రసాద్ తమ స్టేషన్ కు చెందినపోలీస్ వాహనములోనే క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహన డ్రైవర్ పరారీలో ఉన్నారని తెలిపారు. ఆపద సమయంలో సమయస్ఫూర్తి, మానవత్వం చాటిన పోలీసులను స్థానికులు ప్రశంసించారు.

## మల్హోత్రాన్ని సన్మానించిన జనసేన నాయకులు



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్)** ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ డైరెక్టర్ గా(స్టేట్ నామినేటెడ్ పోస్ట్) నియమించబడిన పందిటి మల్హోత్ర ని మైదుకూరు జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయనను కలిసి శాలువా తో సన్మానించి హార్థిక శుభాకాంక్షలు తెలిపిన బ్రహ్మంగారిమఠం జనసేన నాయకులు అదేవిధంగా మల్హోత్ర కి పదవి ఇచ్చిన డిప్యూటీ సీఎం మరియు జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కి శుభాకాంక్షలు తెలుపుతూ మల్హోత్ర భవిష్యత్తులో మరిన్ని పదవులు చేపట్టాలని జనసేన నాయకులు ధర్మిశెట్టి మురళి రాయల్ కొక్కు రవి కల్లూరు సద్దాం అంబిశెట్టి వెంకటసుబ్బయ్య పాడి బాబు కొక్కు శ్రీ సాయి ధరిమిశెట్టి సూర్య తెలపడం జరిగింది.

## ప్రశాంతంగా ముగిసిన ఫారెస్ట్ బీట్ & అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పరీక్షలు

**వేంపల్లి (జర్నలిస్ట్ ఫైల్)** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయం: ఏ.పి.పి.ఎస్.సి. ఆధ్వర్యంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు ఆదిత్య యూనివర్సటి డిప్యూటీ ప్రో. ఛాన్సలర్ డా. మేడపాటి శ్రీనివాస రెడ్డి తెలియజేసారు. ఈ పరీక్షల నిర్వహణను పరిశీలించిన ఏ.పి.పి.ఎస్.సి. చైర్మన్ అనురాధ, పెద్దాపురం ఆర్.డి.ఓ. శ్రీమతి. కె. శ్రీరమణి పరీక్షల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆదిత్య విశ్వవిద్యాలయం క్యాంపస్ నందు మొత్తం పది సెంటర్లలో 6648 మంది పరీక్షలు వ్రాయవలసి ఉండగా 5895 మంది హాజరయ్యారు. 753 మంది పరీక్షలకు గైర్హాజర్ అయినట్లు డా. శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పెద్దాపురం డి.ఎస్.పి. శ్రీహరి రాజు నేతృత్వంలో జగ్గంపేట సి.ఐ. వై.ఆర్.కె. శ్రీనివాస్,గండేపల్లి ఎస్. ఐ. శివ నాగబాబు, జగ్గంపేట ఎస్.ఐ. రఘునందన్ రావు, కిర్లంపూడి ఎస్.ఐ. సతీష్ తో పాటు సుమారు 100 మంది పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఆదిత్య యాజమాన్యం అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయడం పట్ల అధికారులు, అభ్యర్థులు సంతృప్తి వ్యక్తం చేశారు.

## ట్రాఫిక్ పోలీసులపై యువకుల దాడి



**ప్రకాశం (జర్నలిస్ట్ ఫైల్)** : ప్రకాశం జిల్లా ఒంగోలులో వినాయక శోభాయాత్రలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. మారుతీనగర్‌కు చెందిన గణపతి ఉత్సవ కమిటీ నిర్వాహకులు వినాయకుడిని నిమజ్జనం కోసం ఆదివారం ఊరేగింపుగా తీసుకెళ్లారు. కర్నూల్ రోడ్డు నుంచి గుంటూరు రోడ్డు మీదుగా కొత్తపట్నం వెళ్లాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. దీనికి విరుద్ధంగా యువకులు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద నుంచి మెయిన్ రోడ్డు మీదుగా ఊరేగింపు తీసుకువెళ్లేందుకు యత్నించారు. ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహానికి గురైన యువకులు ట్రాఫిక్ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ నేపథ్యంలో పోలీసులు, యువకుల మధ్య తోపులాట జరిగింది. ఈ ఘటనలో ట్రాఫిక్ పోలీసులపై యువకులు దాడికి పాల్పడ్డారు. ఇద్దరు ట్రాఫిక్ పోలీసులకు స్వల్ప గాయాలయ్యాయి. యువకులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## “సూపర్ సిక్స్ - సూపర్ హిట్ - స్త్రీ శక్తి” సభకు సర్వం సిద్ధం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్)** :గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోనేడు సెప్టెంబర్ 8(సోమవారం) సాయంత్రం 5 గంటలకు ఏటుకూరు రోడ్డులోని వివాహ కన్వెన్షన్ హాల్‌లో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో “సూపర్ సిక్స్ – సూపర్ హిట్ – స్త్రీ శక్తి” సభను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం సాయంత్రం 4 గంటలకు భారీ ర్యాలీగా కార్యకర్తలు, అభిమానులు, మహిళా శక్తి ఊరేగింపుగా సభా ప్రాంగణానికి చేరుకోనున్నారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణం పసుపు, జనసేన, కాషాయ పతాకాలతో అలరారనుంది.

రాష్ట్ర స్థాయి నాయకులు, కార్పొరేషన్ చైర్మన్లు, ప్రముఖ ప్రజాప్రతినిధులు సభలో పాల్గొనన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రజల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, మహిళా సాధికారత గురించి ఈ సభలో నేతలు ప్రసంగించనున్నారు. ఈ సభను ఘనవిజయం చేయాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు.

# కాపుల హక్కుల సాధనకే కాపునాడు

○ గుంటూరులో ఘన సదస్సు




**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్)** :గుంటూరు నగరంలో ఆదివారం జరిగిన కాపునాడు ప్రాంతీయ సదస్సు ఉత్సాహపూరితంగా సాగింది. మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, పల్నాడు, బాపట్ల జిల్లాల నుండి భారీగా తరలివచ్చిన కాపులు ఐక్యతకు సంకేతంగా నిలిచారు.

**నవంబర్ 9న మహాసభ** : కాపునాడు జాతీయ అధ్యక్షుడు గాళ్ల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ “నవంబర్ 9తో కాపునాడు ఏర్పడి 50 ఏళ్లు పూర్తవుతున్నాయి. ఆ రోజున రాష్ట్ర స్థాయి మహాసభలో కాపుల రాజ్యాధికార దిశగా కీలక నిర్ణయాలు తీసుకుంటాం” అని వెల్లడించారు. రాష్ట్రంలో 25 శాతం జనాభా కలిగిన కాపులను రాజకీయ పార్టీలు కేవలం ఓటు బ్యాంకుగానే చూసి, అవకాశాలు కల్పించడం లేదని తీవ్రంగా విమర్శించారు.

**ఐక్యతే బలం** : దాసరి రాజా మాష్టారు మాట్లాడుతూ “మన కులంపై గర్వం ఉండాలి కానీ, మిగతా వర్గాల సహకారాన్ని కోల్పోయేలా ద్వేషం పెంచుకోవద్దు. మొదటి నుండి టిడిపి కాపులకు రాజకీయ, ఆర్థిక ప్రాధాన్యత ఇచ్చింది” అని గుర్తుచేశారు. కాపుల సమైక్యతే భవిష్యత్తు బలం అని ఆయన పేర్కొన్నారు. ఈ సదస్సులో డా. ఇమడాబత్తిన కృష్ణమూర్తి, రిటైర్డ్ ఐఏఎస్ చెన్నంశెట్టి చక్రపాణి, జనసేన అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, ఏపీఐడీసీ చైర్మన్ దేగల ప్రభాకరరావు, జీడీసీఎంఎస్ చైర్మన్ వద్రాణం హరిబాబు, టిడిపి నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, ఎర్రగోపు నాగేశ్వరరావు, కార్పొరేటర్లు సమత, నిమ్మల రమణ తదితరులు పాల్గొన్నారు.

## 9న వైసిపి, అన్నదాతపోరు : మాజీఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)** కలబొల్లి హామీలతో అధికారంలోకి వచ్చాక రైతు వ్యవసాయ అవసరాలకు యూరియా కూడా అందించలేని దుస్థితిలో, కూటమి పరిపాలన సాగుతుందని ఈ అంశంపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అన్నదాత పోరు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. స్థానిక గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం, ఎరువుల బ్లాక్ మార్కెట్ పై, అన్నదాత పోరు అనే ప్రచార బ్రోచర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీలోని పలువురు నాయకులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు ఇబ్బందులను వారిదైన శైలిలో వివరించారు. నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ప్రధానంగా రైతులకు యూరియా కూడా దొరకని పరిస్థితిని, ఈ ప్రభుత్వంలో చూస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా రైతులను ఇబ్బంది పెడుతుందని, ఈఅంశంపై,తమ పార్టీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపుమేరకు ఈ నెల 9వ తేదీన, సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద అన్నదాత పోరు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల పార్టీ అధ్యక్షులు చెన్నుబోయిన శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలోని రైతులందరూ అన్నదాత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ప్రచార బ్రోచర ఆవిష్కరణ కార్యక్రమంలో తాడిబోయిన రమేష్, గుంటూరు కోటేశ్వరరావు, మైలా విజయ్, కటారి హరీష్ , గుంటూరు కృష్ణ, దేసు శ్రీనివాసరావు, దుబాయ్ బాబు, అక్కిదాసు కిరణ్, పార్టీలోని వివిధ స్థాయి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

○ జీఎస్టి స్లాబుల తగ్గింపు నిర్ణయంపై

○ బిజెపి శ్రేణులహర్షం



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)**: మధ్యతరగతి కుటుంబాల ప్రయోజనం దిశగా కేంద్ర ప్రభుత్వం నాలుగు స్లాబులుగా ఉన్న జీఎస్టీని రెండు స్లాబులుగా తగ్గించడం దేశంలో అనేక మందికి ప్రయోజన కరమని బీజేపీ నాయకులు ప్రధాన నరేంద్ర మోదీ నిర్ణయాన్ని స్వాగతిస్తూ పాలాభిషేకం చేశారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ జీఎస్టీ స్లాబుల తగ్గింపు నిర్ణయాన్ని స్వాగతిస్తూ పట్టణంలోని రైల్వే స్టేషన్ సెంటర్లో బిజెపి నాయకులు ప్రధాని నరేంద్ర మోడీకి ధన్యవాదాలు తెలియజేస్తూ, తమ ఆనందాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తారు. జీఎస్టీ తగ్గింపు మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక పురోగతికి తోడ్పాటు అని నినాదాలు చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా పార్టీ నాయకులు పొట్టి మూర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ నాలుగు స్లాబ్ ల జీఎస్టీని, రెండు స్లాబులుగా తగ్గించడం ద్వారా ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. సగటు ప్రజల ప్రయోజనాలను కాపాడే విధంగా ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా మన్నారు. పట్టణ బిజెపి సీనియర్ నాయకులు అడపా సంపత్ రాయుడు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ రైతుల పక్షపాతి అని, ట్రాక్టర్ల పై జీఎస్టి తగ్గించడం ద్వారా రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. యువ మోర్చా జిల్లా అధ్యక్షులు మైలా హరికృష్ణ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు మంచి శుభ పరిణామం అన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి అనేక విధాలుగా నిధులు విడుదల చేస్తూ, కేంద్ర ప్రభుత్వం ద్వారా రాష్ట్రంలో అనేక అభివృద్ధి పనులకు ప్రధాని నరేంద్ర మోదీ అందిస్తున్న ఆర్థిక సహాయం, రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుం దన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కటారి వాసుదేవ నాయుడు, బిట్రా కనకదుర్గ, మండల పార్టీ అధ్యక్షులు కడియాలనంద కిషోర్, డి. హనుమంతరావు, మూడవ పట్టణ అధ్యక్షుడు సందీప్ రాజు, సింగం రాజు కనకదుర్గ, చంద్ర,ఫణి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# చదువును ఆయుధంగా మార్చుకోవాలి : కమిషనం పులి శ్రీనివాసులు




**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్)** :పేద విద్యార్థులు చదువును ఆయుధంగా మార్చుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ పేర్కొన్నారు. ఈనెల 7వ తేదీన మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్(ఎన్. ఎం. ఎం. ఎస్) ఉచిత శిక్షణ శిబిరాన్ని గుంటూరులోని భాష్యం ఆడిటోరియంలో పులి శ్రీనివాసులు ప్రారంభించి ప్రసంగించారు. మానవత కార్యదర్శి కె. సతీష్ నేతృత్వంలో జరిగిన శిక్షణ శిబిర కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ పాఠశాలల నుండి 8వ తరగతి చదువుతున్న 400 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, శిక్షకులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన పులి శ్రీనివాసులు ప్రసంగిస్తూ విద్యార్థులు గమ్యాన్ని నిర్దేశించుకుని, క్రమశిక్షణతో అడుగులు వేస్తే గమ్య స్థానాన్ని చేరుకోగలరని తెలిపారు. పేద విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో విద్యను అభ్యసిస్తుంటే పేదరికం అడ్డు కాబోదని, మానవత లాంటి సంస్థలు ప్రతిభగల విద్యార్థులను ఆదుకుంటాయని తెలిపారు. మాజీ శాసనమండలి సభ్యులు కె.ఎస్. లక్ష్మణరావు ప్రసంగిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ ద్వారా సంవత్సరానికి 12 వేల రూపాయలు చొప్పున నాలుగు సంవత్సరాల పాటు స్కాలర్ షిప్ లను అందిస్తుందని, తద్వారా ప్రతిభగల విద్యార్థులకు ఆర్థిక వెసులుబాటుతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు. పోటీ పరీక్షలకు పునాది ఏర్పడడానికి ఎన్ఎంఎంఎస్ తోడ్పడుతుందన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ ఎన్ఎంఎంఎస్ ద్వారా మధ్యలో బడి మానేసే విద్యార్థుల సంఖ్య తగ్గుతుందని, ప్రతిభ గల పేద విద్యార్థులకు చేయూతనిస్తూ మనోధైర్యాన్ని నింపుతుందని అన్నారు. అక్షరాస్యతలో ఆంధ్రప్రదేశ్ భారతదేశంలో 34వ స్థానంలో ఉందని, దీనిని అధిగమించడానికి రాజకీయాలకు అ-తీతంగా ఐక్య కృషి జరగాలన్నారు. మానవత కార్యదర్శి కె. సతీష్‌ప్రసంగిస్తూ గత ఏడాది నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ శిక్షణ కార్యక్రమం ద్వారా 80 మంది విద్యార్థులు ఎంపిక కావడం ఆనందదాయకమన్నారు. ఎన్ఎంఎంఎస్ 2025లో 160 మంది ఎంపిక అయ్యేటట్టు కృషి చేస్తామన్నారు. మానవత చైర్మన్ పావులూరి రమేష్ ప్రసంగిస్తూ విజిఎస్ పబ్లికేషన్స్ అధినేత ఎస్. రామారావు లక్ష రూపాయల విలువ చేసే ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ తో కూడిన 300 పుస్తకాలను ఉచితంగా ఇవ్వడం అభినందనీయమన్నారు. అమెరికాలో ఉన్న ప్రవాసా%శీ%ధ్రులు ప్రభాకర్ రావు లక్ష రూపాయలు శిక్షణ కార్యక్రమ నిర్వహణ కోసం అందజేయడం, భాష్యం సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ ఆడిటోరియం ను 13 ఆదివారాలపాటు ఎన్ఎంఎంఎస్ శిక్షణ కోసం ఉచితంగా ఇవ్వడాన్ని స్వాగతించారు. ఈ కార్యక్రమంలో గత సంవత్సరం ఎన్ఎంఎంఎస్ ద్వారా స్కాలర్ షిప్ పొందిన విద్యార్థులను అభినందించారు. విజిఎస్ పబ్లికేషన్స్ ప్రచురించిన ఎన్ఎంఎంఎస్ మెటీరియల్ తో కూడిన పుస్తకాలను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నేతలు టి. ధనుంజయ రెడ్డి, ఉప్పల సాంబశివరావు, పి. విమల కుమారి, టీవీ సాయిరాం, చావా శివాజీ, మేకల రామారావు, చావా లక్ష్మీ సామ్రాజ్యం, కె. పావని తదితరులు ప్రసంగించారు.

## పద్మశాలీయ ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం




**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** : జిల్లాలో ఆరుగురు ఉత్తమ ఉపాధ్యాయులుగా పద్మశాలీయ సంఘానికి చెందిన ఉపాధ్యాయులు ఎంపిక కావడం హర్షనీయమని పద్మశాలీయ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జీవీఎస్ రామకృష్ణ పేర్కొన్నారు. ఈనెల 5వ తేదీ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నుండి జిల్లాలో ఆరుగురు ఉత్తమ ఉపాధ్యాయులుగా పద్మశాలీయ సంఘమునకు చెందిన ఉపాధ్యాయులు ఎంపికైన నేపథ్యంలో, ఆదివారం సాయంత్రం స్థానిక రామ లింగేశ్వరపేటలోని, పద్మశాలి ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయుల అభినందన సభా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జీవీఎస్ రామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని, సంఘీయ ఉత్తమ ఉపాధ్యాయ దంపతులను ఘనంగా సత్కరించారు. జిల్లాలో, కొలకలూరు గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాచర్ల నాగేశ్వరరావు, అదేవిధంగా ఆకురాతి హరి వరప్రసాద్, దివి ఉమాదేవి, మాచర్ల లీలా శ్రీనివాస్ మూర్తి, అరికాటి బాలసుబ్రమణ్యం లను, అసోసియేషన్ తరపున సాదరంగా సత్కరించారు. రాష్ట్ర అధ్యక్షులు జీవీఎస్ రామకృష్ణ మాట్లాడుతూ సంఘీయ ఉపాధ్యాయులు తమ విధి నిర్వహణలో, బాధ్యతాయుతమైన సేవలను విద్యార్థులకు అందించి , విద్యార్థుల తల్లిదండ్రుల ప్రశంసలతోపాటు, ప్రభుత్వ గుర్తింపు పొందడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తెనాలి శాఖ కార్యదర్శి గొట్టుముక్కల సుబ్బారావు, కోశాధికారి తిరువీధుల నాగేశ్వరరావు, కటకం వెంకటప్రసాద్, అందే బాలచంద్రమౌళి,కందుల శ్రీనివాసరావు, కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఖుద్దుస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 9న ఉచిత కంటి వైద్య శిబిరం



**కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్)**: ఖుద్దుస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9 వ తేదీన కాకుమాను మండల పరిధిలోని కొమ్మూరు గ్రామంలో ఉచిత కంటి వైద్య శిభిరం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా. షేక్. అబ్దుల్ ఖుద్దుస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం నాడు కొమ్మూరు గ్రామంలో వాటర్ ట్యాంక్ సమీపంలో మదరస గౌసియా రజ్వియ జియవుల్ సోసిటీ వద్ద వైద్య శిభిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిభిరం లో ఎల్ వి ప్రసాద్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హైదరాబాద్ వారి వెంకటలక్ష్మి నేత్రాలయం కారంచేడు వారి సహకారం తో వైద్య శిభిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిభిరం లో శుక్కడం ,కంటిలోని పొరలు ఉచితంగా పరీక్షలు చేసి ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి చికిత్స అందించనున్నట్లు తెలిపారు. వైద్యశిబిరం ప్రారంభకులుగా కాకుమాను పి హెచ్ సి వైద్యాధికారి డా. స్వర్ణ. రాజశేఖర్,డా. అర్హా అబ్దుల్సమాద్ ఎల్ వి ప్రసాద్ వైద్య శాల కారంచేడు లు హజారవుతారన్నారు. పరిసర ప్రాంతాల లో కంటి సంబంధిత సమస్యలతో బాధపడేవారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## షాపులు నిర్మించుట కొరకై అనుమతివ్వండి



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్)** బ్రహ్మంగారిమఠంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠం మాడ వీధుల్లోని రథం రోడ్డు నందు అప్పటి ఫిట్ పర్సన్ గా ఉన్నటువంటి శంకర్ బాలాజీ ఎలాంటి అనుమతులు లేకున్నను అభివృద్ధి కొరకై షాపులన్నీ కూల్చివేసి పది రోజుల్లో నిర్మిస్తామని చెప్పి నేటికీ మూడు నెలలు గడిచిన నిర్మాణానికి శ్రీకారం చుట్టి ఉండలేదు షాపుల నిర్మాణం నిమిత్తం అనుమతి ఉత్తర్వులు పొందుటకు దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ మైదుకూరు శాసనసభ్యులు పుట్ట సుధాకర్ యాదవ్ కు మెయిల్ ద్వారా వినతి పత్రాన్ని పంపించి బ్రహ్మంగారిమఠం దేవస్థానం మేనేజర్ ఈశ్వర చారి కి వినతిపత్రం అందజేయడం జరిగింది. మేనేజర్ సానుకూలంగా స్పందిస్తూ మీ సమస్యను త్వరలో కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి మీకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

## గ్రానైట్ క్వారీ వద్దన్న స్థానికులపై యజమానుల దౌర్జన్యం

**వెదురుకుప్పం(జర్నలిస్ట్ ఫైల్)** చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం కొమరగుంట పంచాయతీ బందార్ల పల్లి పరిధిలో గ్రానైట్ క్వారీ అనుమతుల విషయమై కొద్దిరోజులుగా స్థానికులు జిల్లా అధికారులకు పిర్యాదులు చేసారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సుమారు 13 మంది స్థానికులపై కేసులు నమోదు చేసినట్టు సమాచారం. ఆదివారం క్వారీ యజమానులకు గ్రామస్తుల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఇరువర్గాలకు గాయాలయ్యాయి. వాహనాలు కూడా ధ్వంసం అయినట్లు చెబుతున్నారు. గాయపడిన వారు తిరుపతి ఆసుపత్రికి తీసుకొని వెళ్లినట్లు సమాచారం. ఉద్రిక్తత వాతావరణం నెలకుంది.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ఫిజియో థెరపిస్టులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ శుభాకాంక్షలు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఫిజియో థెరపిస్టులకు కూటమి ప్రభుత్వం శుభాకాంక్షలు తెలియజేసింది. ప్రతి ఏటా సెప్టెంబర్ 8న ప్రపంచ ఫిజియో థెరపీ డేను జరుపుకుంటున్నారు. అన్ని జబ్బులూ మందులతో నయంకావు. కొన్ని జబ్బులకు ఔషధాలతో పాటు థెరపీ కూడా అవసరం. 1996 నుంచి ప్రపంచ వ్యాప్తంగా సెప్టెంబర్ 8న అవగాహనా కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది(2025) వృద్ధాప్యం-ఆరోగ్యం నినాదంతో కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నారు.

వృద్ధులకు ఫిజియో థెరపిస్టులందించే సేవలందించే సేవలు ఎంతో ముఖ్యమైనవి. బలహీనపడిన కండరాలను బలోపేతం చేయడంలో వీరి సేవలు ఎంతో అవసరం. ఆర్థరైటిస్, వెన్నుపూస సమస్యలను, శరీరం అదుపు తప్పకుండా చేయడంలోనూ వీరందించే సేవల వల్ల మంచి ప్రయోజనాలు చేకూరుతున్నాయి. ప్రత్యేక అవసరాలు గల పిల్లల అభివృద్ధిలో కూడా వీరి సేవలు ప్రశంసనీయం.

రాష్ట్రంలో వేల సంఖ్యలో ఫిజియో థెరపిస్టులున్నారు. ప్రపంచ ఫిజియో థెరపీ డే సందర్భంగా వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు.

## సిబ్బంది పనితీరు అభినందనీయం: ఎస్పీ



**కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్):**కాకుమాను పోలీస్ స్టేషన్ ను గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ శనివారం నాడు ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి స్టేషన్ లో కేసుల వివరాలు,మండలంలోని గ్రామాలలో శాంతి భద్రతల అంశాల గూర్చి అడిగి తెలుసుకున్నారు.గ్రామాలలో ఎక్కడ కూడా అల్లర్లు జరగకుండా ప్రశాంతంగా నిమజ్జన కార్యక్రమాలు పూర్తి అవ్వడం పట్ల సిబ్బందిని అభినందించారు.మండలంలో ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.స్టేషన్ పరిదిలో అసాంఘిక కార్యకలాపాలు కు తావులేకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలన్నారు.ఎవరైనా అసంఘిక కార్యకలాపాలు కు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సందర్భంగా స్టేషన్ నిర్వహణ మండలంలో వ్యవహరిస్తున్న ఫ్రెండ్లీ పోలీసింగ్ పట్ల సిబ్బంది ని ప్రత్యేకంగా అభినందించారు.సిబ్బంది అందరూ కూడా తమ కు కేటాయించబడిన విధులను బాధ్యతగా నిర్వర్తించాలని ,వివిధ రకాల సమస్యలతో వచ్చే బాధితుల కు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది కి పలు సలహాలు,సూచనలు చేశారు.ఎస్పీ వెంట కాకుమాను యస్. ఐ ఏక్ నాథ్,ట్రైనీ ఎస్ ఐ,స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## చీరాలలో ర్యాప్ ముఠా అరెస్ట్



○ రూ.14 లక్షల నగదు, కారు, 2 సెల్ ఫోన్లు స్వాధీనం

**చీరాల (జర్నలిస్ట్ ఫైల్):** తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తామని ఓ నగల వ్యాపారిని ఆశపెట్టి నమ్మబలికి.. ర్యాప్ వేసిన ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్పి తుషార్‌డూడీ ఆదేశాలతో చీరాలలో రూరల్ పోలీసులు నిర్వహించిన విజయవంతమైన ఆపరేషన్‌లో ఆదివారం ఈ ర్యాప్ ముఠా పట్టుబడింది. ఈపురుపాలెం పోలీస్‌స్టేషన్‌లో చీరాల డిఎస్‌పి మెయిన్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఇందుకు సబంధించి తెలిపిన వివరాల ప్రకారం... కర్ణాటక ప్రాంతానికి చెందిన నాగరాజు స్వర్ణకారుడు. అదే రాష్ట్రంలోని కొప్పల్ జిల్లా గంగావతి గ్రామానికి చెందిన ఏడుగురు ర్యాప్ ముఠాలో ఎ1 గా ఉన్న సాతుపాటి యువరాజు అనే వ్యక్తి గత నాలుగు నెలల క్రితం కుమార్ అనే పేరుతో బంగారు వ్యాపారి నాగరాజుకు ఫోన్ చేశారు. తమ వద్ద బంగారం ఉందని తక్కువ ధరకే ఇప్పిస్తామని నమ్మబాలికారు. నాగరాజును, అతని సోదరుడిని గత నెల ఆగస్టు 20న కర్ణాటక నుండి చీరాల ఆటోనగర్‌కు పిలిపించారు. సాతుపాటి యువరాజు, వారిద్దరిని కలిసి అతని వద్ద ఉన్న బంగారు ఆభరణాలలో ఒకటి చూపించి బేరం కుదుర్చుకున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం నాగరాజు, ఆయన సోదరుడు కర్ణాటక నుండి చీరాలకు రూ. 14 లక్షల నగదుతో వచ్చారు. ఎ1గా ఉన్న యువరాజు ఆటోనగర్‌లోని రైల్వే ట్రాక్ సమీపంలో ఉన్న పొలాల వద్దకు వీరిని తీసుకెళ్లి వేరే వ్యక్తులు వస్తారని నమ్మించి వెళ్లిపోయారు. కాసేపటికే మరో ఆరుగురు బేతాడి శశి కుమార్, నాగరాజు, దొడ్డ గజ్జిలేరు కిషోర్ కుమార్, ఎస్ రవికుమార్, కావాటి హరీష్, చప్పిడి మురళీకృష్ణ (కర్ణాటక రాష్ట్రం వారు) అక్కడికి వచ్చి.. బాధితుడు నాగరాజును బెదిరించి కత్తితో దాడి చేసి.. డబ్బు లాక్కుని పరారయ్యారు. నిందితులను పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ముఠా కదలికలను గుర్తించి, వారిని ప్రకాశం జిల్లా దోర్నాల వద్ద 24 గంటల్లోపే పట్టుకుని రూ. 14 లక్షల నగదు, కారు, 2 సెల్‌ఫోన్లు వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు.

## చంద్రగ్రహణం కారణంగా శ్రీశైలంలో ఆలయ ద్వారాల మూసివేత

**శ్రీశైలం (జర్నలిస్ట్ ఫైల్) :** శ్రీశైలంలో ఆదివారం ఏర్పడిన చంద్రగ్రహణం కారణంగా ఆలయ ద్వారాలు మధ్యాహ్నం 1 గంటకు మూసివేయబడ్డాయి. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు, ప్రధానార్చకులు శివప్రసాద్ స్వామి, పలువురు అర్చకులు, వేదపండితులు, సహాయ నిర్వహణాధికారి యం. హరిదాసు, ఆలయ పర్యవేక్షకులు యం. రవికుమార్, అమ్మవారి ఆలయ పర్యవేక్షకులు జి. రవి, ముఖ్య భద్రతాధికారి బి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రగ్రహణం రాత్రి 9.56 నిమిషాలకు ప్రారంభమై రాత్రి 1.26 గంటలకు ముగుస్తుంది. ఈ కారణంగా మధ్యాహ్నం వరకు భక్తులకు అలంకార దర్శనం మాత్రమే కల్పించబడింది. స్పర్శదర్శనం పూర్తిగా నిలిపివేయబడింది. అలాగే అన్ని ఆర్జిత సేవలు, పరోక్ష సేవలు, అమ్మవారి కల్యాణోత్సవం రద్దు చేశారు. సాక్షిగణపతి, హాటకేశ్వరం, ఫాలధార పంచధార, శిఖరేశ్వరం వంటి పరివారాలయాల ద్వారాలు కూడా మూసివేశారు. సోమవారం ఉదయం 5 గంటలకు ఆలయ ద్వారాలు తెరిచి శుద్ధి, సంప్రోక్షణ నిర్వహించారు. అనంతరం ప్రాతఃకాల పూజలు జరిపి ఉదయం 7.30 గంటలకు మహామంగళహారతులు చేశారు. ఈ సమయం నుంచే మధ్యాహ్నం 2.15 వరకు భక్తులకు అలంకార దర్శనం అందుబాటులో ఉంటుంది.

సెప్టెంబర్ 8నాటికి ఆన్లైన్‌లో స్పర్శదర్శనం, విరామదర్శనం టికెట్లు పొందిన భక్తులకు మధ్యాహ్నం 2.15 నుండి సాయంత్రం 4 గంటల వరకు స్పర్శదర్శనం కల్పించబడుతుంది.

తిరిగి సాయంత్రం 5.30 నుండి రాత్రి 9 గంటల వరకు అలంకార దర్శనాలు కొనసాగుతాయి. రాత్రి 9 గంటల తరువాత ఆన్లైన్ టికెట్లు పొందిన వారికి స్పర్శదర్శనం అందించబడుతుంది.

# రైతుల సంక్షేమం కోసం పనిచేస్తా..

○ కోటబొమ్మాళి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బగాది శేషగిరిరావు నియామకం

○ టెక్కలి టీడీపీ నేతల హర్షం



**నిమ్మడ (జర్నలిస్ట్ ఫైల్):** కోటబొమ్మాలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బగాది శేషగిరిరావు నియమించబడటంపై టెక్కలి మండలంలోని తెలుగు దేశం పార్టీ నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ నియామకం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ, నిమ్మడలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

**నేతల అభినందనలు :** ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ రైతుల సమస్యలు, వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి కృషి చేసిన బగాది శేషగిరిరావుకు లభించిన ఈ నియామకం రైతాంగానికి మేలు చేస్తుందన్నారు. ఆయన నేతృత్వంలో మార్కెట్ కమిటీ మరింత చురుకుగా పనిచేసి, రైతులకు తగిన ధరలు, సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడతారని విశ్వాసం వ్యక్తం చేశారు.

**మంత్రిని కలిసిన టిడిపి నాయకులు :** టెక్కలి మండలంలోని పలువురు టీడీపీ నాయకులు నిమ్మడలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ను కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్‌గా నియమితులైన శేషగిరిరావు నిర్ణయం రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. పార్టీ ఆధ్వర్యంలో రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రశంసించారు.

**రైతు సంక్షేమానికి కృషి :** ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రైతాంగ అభివృద్ధే ప్రభుత్వ ప్రాధాన్యత అని తెలిపారు. మార్కెట్ కమిటీలు రైతులకు రక్షణ కవచాలుగా పనిచేసేలా చర్యలు తీసుకుంటామని, కొత్త చైర్మన్ శేషగిరిరావు నేతృత్వంలో కోటబొమ్మాలి మార్కెట్ రైతులకు ఆదర్శవంతంగా ఉండాలని అభిలషిస్తున్నట్లు పేర్కొన్నారు. "రైతు బలపడితేనే రాష్ట్రం బలపడుతుంది. బగాది శేషగిరిరావు నియామకం రైతుల ప్రయోజనాల దిశగా తీసుకున్న సానుకూల నిర్ణయం" అని స్థానిక నేతలు అభినందనలు తెలిపారు.

# మెడికల్ కాలేజీలపై వైసీపీ తప్పుడు ప్రచారం

○ ఐదేళ్లలో కాలేజీల ప్రారంభమేగానీ చిత్తశుద్ధి లేదు

○ పీపీపీ విధానంలో అత్యంత వేగంగా కాలేజీల నిర్మాణం

○ మనస్ఫూర్తిగా స్వాగతిస్తోన్న ప్రజానీకం

○ రాష్ట్ర వైద్య విద్యార్థులకు ఈ నిర్ణయం వరం

○ గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :**రాష్ట్రంలో మెడికల్ కాలేజీల నిర్మాణంపై వైసీపీ ప్రజలను తప్పుదారి పట్టించేలా దుష్ప్రచారానికి పూనుకుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. ఆదివారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో రూ. 5 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మెడికల్ కాలేజీల అంశంపై మాట్లాడారు. రాష్ట్రంలో పది మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో నిర్మించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారని తెలిపారు. ఈ కాలేజీలను 2027-28లోగా పూర్తి చేయడం ద్వారా ఒక్కో కాలేజీలో 150 మెడికల్ సీట్లు పెరుగుతాయని చెప్పారు. కాలేజీల నిర్మాణం పూర్తయ్యాక వాటి నిర్వహణ, యాజమాన్య హక్కులు పూర్తిగా ప్రభుత్వం వద్దే ఉంటాయని, తద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో నిర్మించిన కాలేజీల్లో కనీస మౌలిక వసతులు కూడా లేవని, 59 శాతం మేర ప్రొఫెసర్ల కొరత ఉందని చెప్పారు.

తాము అధికారంలోకి వచ్చాక ఆయా కాలేజీల్లో అన్ని సదుపాయాలు కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కాలేజీల నిర్మాణం త్వరగా పూర్తయితే మన ప్రాంత విద్యార్థులు వేరే రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని చెప్పారు. ఇక్కడే వైద్యులను తయారు చేసుకోవచ్చన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్య శాఖలో మూడు వేల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుందని, రూ.4500 కోట్లతో ఆస్పత్రుల అభివృద్ధికి శ్రీకారం చుట్టిందని వెల్లడించారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా నిరుపేదలకు వైద్యానికి భరోసా కల్పిస్తోందని, ఇది కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అని స్పష్టం చేశారు.

# ప్రతిభకు పెద్దపీట




○ ఇండియా స్కిల్స్ 2025 - ప్రతిభావంతులైన యువతకు చక్కటి అవకాశం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** దేశంలోని ప్రతిభావంతులైన యువతను గుర్తించి వారికి తగిన గుర్తింపు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఈ క్రమంలో యువత ప్రతిభను అంతర్జాతీయ స్థాయిలో ప్రదర్శించే అవకాశాన్ని కల్పించేందుకు ఇండియా స్కిల్స్-2025 పోటీకి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పోటీ ద్వారా విజేతలకు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశమే కాకుండా ప్రత్యేక శిక్షణ, బహుమతులు కూడా లభిస్తాయి.

**63 నైపుణ్యాల్లో పోటీ:** ఈ పోటీలో దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి అభ్యర్థులు పాల్గొనవచ్చు. మొత్తం 63 నైపుణ్యాలు ఈ పోటీకి ఎంపికయ్యాయి. వీటిలో సైబర్ భద్రత, విమాన నిర్వహణ, యంత్ర నిర్మాణం, వంటకళలు, ఫ్యాషన్ డిజైనింగ్, ఆటోమొబైల్ రిపేర్, రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునాతన సాంకేతిక, వృత్తి రంగాలు ఉన్నాయి. విద్యార్థులు, యువత తమకు ఉన్న నైపుణ్యాన్ని ప్రదర్శించే అవకాశం పొందనున్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో విజేతలైన అభ్యర్థులకు 2026లో జరగనున్న వరల్డ్ స్కిల్ కాంపిటీషన్‌తో పాటు ఇతర అంతర్జాతీయ వేదికలపై దేశం తరఫున ప్రాతినిధ్యం వహించే అవకాశం కల్పిస్తామని అధికారులు తెలిపారు. ఈ పోటీలో పాల్గొనడానికి దేశ పౌరులైతే సరిపోతుంది.

జిల్లా స్థాయి ప్రచారం: ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం చేయడానికి అధికార యంత్రాంగం ముందడుగు వేసింది. నెల్లూరు కలెక్టర్ ఆనంద్ శనివారం కలెక్టరేట్‌లో ఇండియా స్కిల్స్-2025కు సంబంధించిన గోడపత్రాలను ఆవిష్కరించారు. జిల్లా ప్రజలు, ముఖ్యంగా యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఖయ్యూం, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

**రిజిస్ట్రేషన్ విధానం:** ఇండియా స్కిల్స్-2025 పోటీలో పాల్గొనాలి అనుకునే యువత తప్పనిసరిగా స్కిల్ ఇండియా డిజిటల్ హబ్ వెబ్‌సైట్ (www.skillindiadigital.gov.in) ద్వారా నమోదు చేసుకోవాలి.

**దరఖాస్తు ప్రక్రియ ఇలా ఉంటుంది:**

వెబ్‌సైట్ ఓపెన్ చేసి, India Skills-2025 విభాగంపై క్లిక్ చేయాలి.

మొబైల్ నంబర్ నమోదు చేసి, వచ్చిన ఓటీపీని ఎంటర్ చేయాలి.

నాలుగు అంకెల పాస్‌వర్డ్ సెట్ చేసుకోవాలి.

12 అంకెల ఆధార్ నంబరు నమోదు చేసి, ఓటీపీ ద్వారా ధ్రువీకరించాలి.

ఈ-కేవైసీ పూర్తయిన తర్వాత దరఖాస్తు వివరాలు నింపి సమర్పించాలి.

అర్హత, గడువు, సంప్రదించాల్సిన నంబర్లు:

**అర్హత:** 16 నుంచి 25 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న యువత

రిజిస్ట్రేషన్ గడువు: సెప్టెంబరు 30, 2025

సంప్రదించాల్సిన నంబర్లు: 99666 67018, 72073 89948

**యువతకు విశిష్ట వేదిక:** ఇండియా స్కిల్స్-2025 కేవలం ఒక పోటీ మాత్రమే కాదు. ఇది యువతకు తమ ప్రతిభను నిరూపించుకునే, దేశానికి ప్రాతినిధ్యం వహించే, భవిష్యత్‌లో మెరుగైన అవకాశాలను పొందే విశిష్ట వేదిక. నైపుణ్యమే భవిష్యత్తు అన్న భావనను బలపరిచే ఈ పోటీల ద్వారా భారతీయ యువత అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చూపనున్నారు.

## ఘనంగా ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం ఆవిర్భావ దినోత్సవం



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా విజయవాడ లెనిన్ సెంటర్‌లోని రెవెన్యూ భవన్‌లో ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. స్టేట్ ఛైర్పర్సన్ పారే లక్ష్మి, సెక్రటరీ జనరల్ పొన్నూరు విజయలక్ష్మి ఆధ్వర్యంలో మహిళా విభాగం నాయకత్వం, మహిళా ఉద్యోగినులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లోనూ స్థానిక నాయకత్వం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.కిషోర్ కుమార్, సిటీ జేఏసీ చైర్మన్ రవి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి శంకర్ తదితర రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరయ్యారు.

పారే లక్ష్మి మాట్లాడుతూ "దేశం, రాష్ట్ర జనాభాలో చిన్న పిల్లల శాతం తగ్గిపోతున్న నేపథ్యంలో ఇద్దరికంటే ఎక్కువ మంది పిల్లలకు కూడా ప్రసూతి సెలవులు ఇచ్చేలా ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం శుభపరిణామం. అయితే, పిల్లల సంరక్షణ కోసం కేంద్ర ఉద్యోగినుల మాదిరిగానే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగినులకు కూడా రెండు సంవత్సరాల చైల్డ్ కేర్ లీవ్ మంజూరు చేయాలి" అని కోరారు.

పొన్నూరు విజయలక్ష్మి మాట్లాడుతూ "గత ప్రభుత్వంలో చైల్డ్ కేర్ లీవ్‌కు ఏజ్ లిమిట్ ఎత్తివేస్తూ ఉత్తర్వులు ఇచ్చినా, ఆర్థిక శాఖ వాటిని అమలు చేయలేదు. అలాగే చైల్డ్ కేర్ లీవ్‌ను కేవలం పది స్పెల్స్‌లో మాత్రమే వాడుకోవాలన్న షరతు మహిళా ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తోంది. స్పెల్స్ పరిమితి లేకుండా, అవసరమైనప్పుడు వాడుకునే అవకాశం కల్పించాలి" అని తెలిపారు.

బొప్పరాజు వెంకటేశ్వర్లు, పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ "ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం ఒక ఆర్మీ లాంటిది. రాష్ట్రం మొత్తం, డివిజన్ స్థాయిల వరకు బలమైన కమిటీలను ఏర్పాటు చేసుకుంది. దానికి నాయకత్వం కష్టపడి పనిచేసింది" అని అభినందించారు.

అదే విధంగా, "ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన ఐఆర్ ఇప్పటికీ ప్రకటించలేదు. ఇప్పటికే రావాల్సిన నాలుగు డి.ఏలు మంజూరు కాలేదు. దీంతో ఉద్యోగులు, పెన్షనర్లు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ డి.ఏలు విడుదల చేసి, ఐఆర్ ప్రకటించాలి. బకాయిలు ప్రతి ఉద్యోగి, పెన్షనర్ పే స్లిప్‌లో కనిపించేలా చర్యలు తీసుకోవాలి" అని కోరారు.

ఈ సమావేశంలో రాష్ట్ర మహిళా విభాగం అసోసియేట్ చైర్పర్సన్ సైకం శివకుమారి రెడ్డి, కోశాధికారి డా.వి.యస్. సాయిలక్ష్మి, విశ్రాంత ఉద్యోగుల స్టేట్ సెక్రటరీ నారాయణరావు, ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వి.ఆర్., గ్రామ వార్డు సచివాలయం ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల ఆర్లయ్య, రాష్ట్ర మహిళా విభాగం కో చైర్పర్సన్లు, సెక్రటరీలు, అనుబంధ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

## గ్రీన్ రైల్వే స్టేషన్‌గా విశాఖ




○ విశాఖపట్నం రైల్వే స్టేషన్ కు 'ప్లాటినం' గ్రీన్ రైల్వే స్టేషన్ సర్టిఫికేషన్

**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్):** ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలోని విశాఖపట్నం రైల్వే స్టేషన్‌కు గ్లోబల్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ ద్వారా అత్యధిక ప్లాటినం రేటింగ్‌తో ప్రతిష్టాత్మకమైన 'గ్రీన్ రైల్వే స్టేషన్ సర్టిఫికేషన్' లభించింది. ఈ గుర్తింపు స్టేషన్ పర్యావరణ అనుకూల పద్ధతులు పర్యావరణ ప్రభావాన్ని తగ్గించే లక్ష్యంతో స్థిరమైన భావనలను అవలంబించడం ద్వార లభించింది. ఈ సర్టిఫికేషన్ సాధించడం లో అంకితభావంతో పనిచేసిన అధికారుల బృందాన్ని వాల్టెయిర్ డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా అభినందించారు, ఈ సాధనకు మార్గం సుగమం చేశారు. గ్రీన్ రైల్వే స్టేషన్ రేటింగ్ వ్యవస్థను భారత రైల్వే పర్యావరణ డైరెక్టరేట్, (గ్లోబల్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్) సహకారంతో అభివృద్ధి చేసింది. నీటి సంరక్షణ, శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ, ఇంధన సామర్థ్యం, శిలాజ ఇంధనాలపై ఆధారపడటం తగ్గించడం, సహజ పదార్థాల కనీస వినియోగం, ప్రయాణీకులు, సిబ్బంది ఆరోగ్యం, శ్రేయస్సును ప్రోత్సహించడం వంటి కీలకమైన జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశాలను పరిగణలోకి తీసుకుని ఈ గుర్తింపు అందిస్తారు.

## 12 గంటల పాటు శ్రీవారి ఆలయం మూసివేత




○ పలు ప్రముఖ దేవాలయాలు మూత

○ సంపూర్ణ చంద్రగ్రహణం ఎఫెక్ట్

**తిరుమల (జర్నలిస్ట్ ఫైల్):** సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా శ్రీవారి ఆలయాన్ని తాత్కాలికంగా మూసివేసినట్లు టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు తెలిపారు. చైర్మన్, అదనపు ఇఒ వెంకయ్య చౌదరి సమక్షంలో ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు ఆలయ ద్వారాలకు అర్చకులు, సిబ్బంది తాళాలు వేశారు. ఏకాంతసేవ అనంతరం ముందుగా బంగారు వాకిలికి తాళం వేశారు. గ్రహణం కారణంగా 12 గంటల పాటు ఆలయం మూసివేసి సోమవారం తెల్లవారు జామున మూడు గంటలకు తెరవనున్నట్లు చెట్కర్మన్ తెలిపారు. శుద్ధి, పుణ్యాహవచనం తరువాత ఏకంతంగా నిత్యసేవలు నిర్వహించిన అనంతరం యాత్రికులను అనుమతిస్తామని, సర్వదర్శనం యాత్రికులకు సోమవారం వేకువజామున రెండు గంటలకు క్యూలైన్‌లోకి అనుమతించనున్నామని చెప్పారు. శ్రీవారి ఆలయంతో పాటు లడ్డూ, అన్నప్రసాద కేంద్రాలను కూడా మూసివేసినట్లు తెలిపారు. టిటిడి స్థానికాలయాలైన తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, తిరుపతి గోవిందరాజస్వామివారి ఆలయం, కోదండరామస్వామివారి ఆలయం, శ్రీనివాసమంగాపురం కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయం, అప్పలాయిగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయం, నారాయణ వనం, కార్వేటినగరం , ఒంటిమిట్ట, అమరావతి ఎస్‌వి ఆలయం తదితర టిటిడి ఆలయాల తలుపులు మూసివేశారు. గ్రహణ సమయంలో శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని మూసివేయకుండా విశేషపూజలు, అభిషేకాలను నిర్వహించారు.

నంద్యాల జిల్లా శ్రీశైలం ఆలయ ద్వారాలను ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు మూసివేశారు. తిరిగి సోమవారం తెల్లవారుజామున ఐదు గంటలకు ఆలయ ద్వారాలు తెరవనున్నట్లు ఇఒ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాలోని అహోబిలం, మహానంది, యాగంటి దేవస్థానాల తలుపులను సైతం మూసివేశారు. విజయవాడ దుర్గమ్మ ప్రధాన ఆలయంతో పాటు ఉప ఆలయాలన్నింటినీ మూసివేసిన్నట్లు, సోమవారం పున్న ప్రారంభమై, యధావిధిగా దర్శనాలు జరగనున్నాయని ఇఒ శీనా నాయక్ తెలిపారు.

## రూ.2లక్షల ఎరువులు సీజ్



**కోడూరు (జర్నలిస్ట్ ఫైల్):** కృష్ణాజిల్లా కోడూరు మండలంలో ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

విజిలెన్స్ ఇన్స్పెక్టర్ బమర్ తో పాటు విజిలెన్స్ సిబ్బంది, మండల వ్యవసాయ శాఖ అధికారి సంయుక్తంగా తనిఖీలు నిర్వహించగా.., కోడూరులోని ఒక ఎరువుల దుకాణంలో బిల్లు బుక్స్, స్టాక్ రిజిస్టర్, ఈపాస్ మిషన్ లో సరిగ్గా లేనందున రూ.2 లక్షల విలువైన 13 టన్నుల ఎరువులు సీజ్ చేసినట్టు మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం. శ్రీధర్ తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎరువుల షాపుల యజమానులు కచ్చితంగా ప్రభుత్వ నిబంధనలను పాటించాలని, ఎవరైనా ఎరువులను అధిక ధరలకు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా కోడూరు మండలంలో విజిలెన్స్ అధికారులు 15 రోజుల్లో రెండోసారి తనిఖీలు నిర్వహించటం విశేషం.

## ఈస్టిండియా పెట్రోలియం కంపెనీపై పిడుగు



**విశాఖ (జర్నలిస్ట్ ఫైల్):** : విశాఖలో ఆదివారం ఉదయం ఈస్టిండియా పెట్రోలియం కంపెనీపై పిడుగు పడింది. పెట్రోల్ ఫిల్టర్ ట్యాంక్‌పై పిడుగుపడటంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనపై అగ్నిమాపక శాఖ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నట్లు హోం మంత్రి అనిత పేర్కొన్నారు. మంటలు అదుపులోకి వచ్చాయని, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467